www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 28-5-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 42 | విజయవాడ సిటీ**
శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: విదియ రా.1:55 తదుపరి తదియ, నక్షత్రం: మృగశిర రా.12:29 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: ఉ.7:53 నుంచి 9:19 వరకు, దుర్ముహూర్తం: ఉ.11:46-12:38, అమృతఘడియలు: సా.4:32-5:59, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:44, సూర్యాస్తమయం: 6:41
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్లేఆఫ్స్‌లో ఎవరితో ఎవరంటే..	క్వాలిఫయర్-1 (గురువారం)	ఎలిమినేటర్ (శుక్రవారం)
	పంజాబ్ X బెంగళూరు	గుజరాత్ X ముంబై
	వేదిక: ముల్లాన్‌పూర్ (రా. 7.30 నుంచి)	వేదిక: ముల్లాన్‌పూర్ (రా. 7.30 నుంచి)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	14	9	4	1	19	0.372
బెంగళూరు	14	9	4	1	19	0.301
గుజరాత్	14	9	5	0	18	0.254
ముంబై	14	8	6	0	16	1.142
ఢిల్లీ	14	7	6	1	15	0.011
హైదరాబాద్	14	6	7	1	13	-0.241
లఖ్‌నవూ	14	6	8	0	12	-0.376
కోల్‌కతా	14	5	7	2	12	-0.305
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	14	4	10	0	8	-0.647

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఫైనల్..సిందూర్ స్పెషల్

త్రివిధ దళాధిపతులకు ఆహ్వానం

బీసీసీఐ నిర్ణయం

న్యూఢిల్లీ: తాజా ఐపీఎల్ సీజన్‌ను వినూత్నంగా ముగించాలని బీసీసీఐ భావిస్తోంది. దీనిలో భాగంగా ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా ముగించిన భారత సాయుధ దళాల చీఫ్‌లకు ఆహ్వానం పలికింది. అహ్మదాబాద్‌లో జూన్ 3వ తేదీన జరిగే ఫైనల్‌ను వీక్షించేందుకు రావాల్సిందిగా ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌లను కోరింది. 'ఆపరేషన్ సిందూర్‌లో మన సాయుధ దళాలు ప్రదర్శించిన శౌర్య పరాక్రమాలకు బీసీసీఐ సెల్యూట్ చేస్తోంది. అందుకే ఐపీఎల్ ముగింపు వేడుకలను సైన్యాన్ని గౌరవించేందుకు అంకితం చేయాలని భావించి త్రివిధ దళాధిపతులతో పాటు ఇతర మిలిటరీ ఉన్నతాధికారులు, సైనికులను ఆహ్వానించాం' అని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు.

ఫీల్డింగ్ కోచ్‌గా మళ్లీ దిలీప్



న్యూఢిల్లీ: టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా హైదరాబాద్‌కు చెందిన టి. దిలీప్‌కు ఉద్వాసన పలికి నెల గడిచిందో లేదో మళ్లీ ఆ బాధ్యతలను అతనికే అప్పగించింది బీసీసీఐ. విదేశీ కోచ్ కోసం ఎంతగానో ప్రయత్నించినా, సరైన వ్యక్తి దొరకలేదని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో దిలీప్‌ను ఏడాది పాటు ఆ పదవిలో కొనసాగించాలని నిర్ణయించామన్నారు. వచ్చేనెల ఇంగ్లండ్‌లో పర్యటించే భారత జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్ వ్యవహరిస్తాడని తెలిపారు.

ఆసియా అథ్లెటిక్స్‌లో గుల్వీర్‌కు స్వర్ణం

గుమి (దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలిరోజే భారత్ రెండు పతకాలతో అదరగొట్టింది. ఇందులో ఓ స్వర్ణం ఉండడం విశేషం. మంగళవారం మొదలైన ఈ పోటీల్లోని పురుషుల 10,000 మీటర్ల రేసులో గుల్వీర్ 28 నిమిషాల 38.63 సెకన్లలో రేసు పూర్తి చేసి విజేతగా నిలిచాడు. పురుషుల 20 కిలో మీటర్ల రేస్ వాక్‌లో భారత అథ్లెట్ సెర్విన్ సెబాస్టియన్ మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నాడు.

జితేశ్ జిగేల్

లఖ్‌నవూపై అద్భుత విజయం
పంత్ సెంచరీ వృథా
క్వాలిఫయర్-1కు బెంగళూరు


జితేశ్ శర్మ (85 నాటౌట్)

లఖ్‌నవూ: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సత్తా చాటుకుంది. ఎలిమినేటర్ గండాన్ని తప్పించుకోవాలంటే లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై కచ్చితంగా గెలిచి తీరాల్సిందే. కళ్లముందు 228 పరుగుల భారీ లక్ష్యం ఉన్నప్పటికీ.. కెప్టెన్ జితేశ్ శర్మ (33 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 85 నాటౌట్) చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. విరాట్ కోహ్లీ (30 బంతుల్లో 10 ఫోర్లతో 54) కూడా సహకరించడంతో బెంగళూరు 6 వికెట్లతో నెగ్గింది. దీంతో 19 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన ఆర్‌సీబీ క్వాలిఫయర్-1లో పంజాబ్‌తో ఆడనుంది. 2016 తర్వాత బెంగళూరు టాప్-2లో చోటు దక్కించుకోవడం విశేషం. ఇందులో ఓడిన జట్టుకు మరో చాన్స్ ఉంటుంది. అలాగే ఐపీఎల్‌లో ఆర్‌సీబీకిదే అత్యధిక ఛేదన కావడం విశేషం. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 3 వికెట్లకు 227 పరుగులు చేసింది. కెప్టెన్ రిషభ్ పంత్ (61 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సర్లతో 118 నాటౌట్) శతకంతో సత్తాచాటగా, మిచెల్ మార్ష్ (37 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 67) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఛేదనలో బెంగళూరు 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 230 పరుగులు చేసి నెగ్గింది. మయాంక్ (23 బంతుల్లో 5 ఫోర్లతో 41 నాటౌట్), సాల్ట్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 30) ఆకట్టుకున్నారు. ఓరౌర్కీకి 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జితేశ్ నిలిచాడు.

ముందు విరాట్.. ఆ తర్వాత జితేశ్: భారీ ఛేదనను ఆర్‌సీబీ సజావుగానే ఆరంభించింది. మొదట ఓపెనర్ విరాట్ కోహ్లీ విజయంపై ఆశలు రేకెత్తించగా.. జితేశ్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ముగించాడు. రెండో ఓవర్‌లో విరాట్ నాలుగు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. మరో ఓపెనర్ సాల్ట్ ఆరో ఓవర్‌లో వెనుదిరిగినా పవర్‌ప్లేలో జట్టు 66/1 స్కోరుతో నిలిచింది. ఇక ఎనిమిదో ఓవర్‌లో రజత్ (14), లివింగ్‌స్టోన్ (0)లను పేసర్ ఓరౌర్కీ అవుట్ చేయడంతో 90/3తో తడబడినట్టు కనిపించింది. అయితే మయాంక్ పదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో రన్‌రేట్ తగ్గకుండా చూశాడు. 27 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాక విరాట్‌ను పేసర్ అవేశ్ వెనక్కి పంపాడు. ఈ సమయంలో మయాంక్-జితేశ్ జోడీ వేగంగా ఆడే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా జితేశ్ 14వ ఓవర్‌లో 6,4.. తర్వాతి ఓవర్‌లో 4,6,4,4తో పరుగుల వరద పారించాడు. 17వ ఓవర్‌లో హైడ్రామా నెలకొంది. తొలి బంతికే జితేశ్ అవుటైనా అది నోబ్‌గా తేలడంతో బతికిపోయాడు. ఇక అదే ఓవర్‌లో స్పిన్నర్ దిగ్వేష్ అతడిని మన్కడింగ్ కూడా చేశాడు. కానీ పంత్ అప్పీల్‌ను వెనక్కితీసుకోవడంతో నాటౌట్‌గా ప్రకటించారు. ఓ సిక్సర్‌తో 22 బంతుల్లోనే జితేశ్ హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది. 18వ ఓవర్‌లో అతడి 4,4,6,6తో 21 రన్స్ రావడంతో సమీకరణం 12 బంతుల్లో ఏడు పరుగులకు మారింది. దీంతో బెంగళూరు మరో 8 బంతులుండగానే నెగ్గింది.

పంత్-మార్ష్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రిషభ్ పంత్ అజేయ శతకంతో పాటు ఓపెనర్ మార్ష్ అదరగొట్టాడు. బౌలర్ ఎవరైనా బాదుడే లక్ష్యంగా ఈ జోడీ ముందుకు సాగడంతో స్కోరుబోర్డు ఉరకలెత్తింది. మార్‌క్రమ్ స్థానంలో ఆడిన అరంగేట్ర ఓపెనర్ బ్రీట్‌స్కీ (14)ని మూడో ఓవర్‌లోనే తుషార బౌల్డ్ చేశాడు. కానీ మరో వికెట్ తీసేందుకు ఆర్‌సీబీ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన పంత్ ఈసారి ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. ఇప్పటికే జట్టు ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించిన వేళ ఎలాంటి ఒత్తిడీ లేకుండా సహజశైలిలో ఆడడం కనిపించింది. రాగానే బాదుడు ఆరంభిస్తూ నాలుగో ఓవర్‌లో 6,4,4తో 18 రన్స్ అందించాడు. దీంతో జట్టు పవర్‌ప్లేలో 55 పరుగులు సాధించింది. ఇక భువీ ఓవర్‌లో 6,4తో ఆకట్టుకున్న పంత్.. పదో ఓవర్‌లో 6,4,4తో 29 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అప్పటికి మార్ష్ ఇంకా 26 పరుగుల దగ్గరే ఉండడం గమనార్హం. కాస్త ఆలస్యంగా జోరు పెంచిన మార్ష్ పేసర్ షెపర్డ్ వేసిన ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో 4,6 బాదాడు. అలాగే సుయాష్ ఓవర్‌లో సిక్సర్‌తో 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అటు పంత్ మాత్రం తన ధాటిని కొనసాగిస్తూ 15వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో అదుర్స్ అనిపించాడు. అయితే తర్వాతి ఓవర్‌లో మార్ష్ సైతం రెండు వరుస సిక్సర్లతో ఊపు మీద కనిపించినా పేసర్ భువీకి చిక్కాడు. దీంతో రెండో వికెట్‌కు 152 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. పంత్ మాత్రం తన ధాటిని ఆపకుండా 18వ ఓవర్‌లో రెండు ఫోర్లతో 54 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేశాడు. ఈ సంతోషంలో తను రెండు చేతులూ కింద పెట్టి తలకిందులుగా జంప్ చేస్తూ (సోమర్‌సాల్ట్) సంబరాలు చేసుకున్నాడు. అలాగే ఆఖరి రెండు ఓవర్లలో 26 పరుగులు చేసిన ఎల్‌ఎస్‌జీ పూరన్ (13) వికెట్ కోల్పోయినా భారీ స్కోరుతో ప్రత్యర్థికి సవాల్ విసిరింది.


పంత్ శతక సంబరం

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్ష్ (సి) సుయాష్ (బి) భువనేశ్వర్ 67, మాథ్యూ బ్రీట్‌స్కీ (బి) తుషార 14, పంత్ (నాటౌట్) 118, పూరన్ (సి) యశ్ దయాల్ (బి) షెపర్డ్ 13, అబ్దుల్ సమద్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 227/3; వికెట్ల పతనం:** 1-25, 2-177, 3-226; **బౌలింగ్:** తుషార 4-0-26-1, క్రునాల్ 2-0-14-0, యశ్ దయాల్ 3-0-44-0, భువనేశ్వర్ 4-0-46-1, సుయాశ్ 3-0-39-0, షెపర్డ్ 4-0-51-1.

బెంగళూరు: సాల్ట్ (సి) దిగ్వేష్ (బి) ఆకాశ్ 30, కోహ్లీ (సి) బదోని (బి) అవేశ్ 54, పటీదార్ (సి) అబ్దుల్ (బి) ఓరౌర్కీ 14, లివింగ్‌స్టోన్ (ఎల్బీ) ఓరౌర్కీ 0, మయాంక్ (నాటౌట్) 41, జితేశ్ (నాటౌట్) 85, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.4 ఓవర్లలో 230/4; వికెట్ల పతనం:** 1-61, 2-90, 3-90, 4-123; **బౌలింగ్:** ఆకాశ్ 4-0-40-1, ఓరౌర్కీ 4-0-74-2, దిగ్వేష్ రాఠి 4-0-36-0, షాబాజ్ 3-0-39-0, అవేశ్ 3-0-32-1, బదోని 0.4-0-9-0.

ఐపీఎల్‌లో 5 సార్లు (2013, 2016, 2023, 2024, 2025) 600+ స్కోర్లు సాధించిన ఏకైక బ్యాటర్‌గా విరాట్. అలాగే మొత్తంగా 63 హాఫ్ సెంచరీలతో వార్నర్ (62)ను అధిగమించాడు.

1 ఆర్‌సీబీ తరఫున (ఐపీఎల్‌లో 8606, చాంపియన్స్ లీగ్ టీ20లో 424) 9000+ పరుగులు సాధించిన విరాట్.

బెదిరింపులు నిజమే



- ఆధారాలున్నాయి
- సన్‌రైజర్స్‌ను జగన్మోహన్ అదనపు టికెట్లు అడిగారు
- నిర్ధారించిన విజిలెన్స్
- హెచ్‌సీఏ పై చర్యలకు సిఫారసు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)పై చర్యలకు విజిలెన్స్ సిఫారసు చేసింది. ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఫ్రాంచైజీపై హెచ్‌సీఏ పెద్దలు ఒత్తిడి తీసుకొచ్చినట్టు విజిలెన్స్ నిర్ధారించింది. వ్యక్తిగతంగా తనకు అడిగినన్ని టికెట్లు ఇవ్వలేదని హెచ్‌సీఏ అధ్యక్షుడు ఫ్రాంచైజీని ఇబ్బందులకు గురిచేసినట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. ఒప్పందం ప్రకారం ప్రతి మ్యాచ్‌కూ స్టేడియం కెపాసిటీలో పదిశాతం టికెట్లను సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ హెచ్‌సీఏకు ఇస్తూ వచ్చింది. అయితే అదనంగా తమకు మరో పదిశాతం టికెట్లు కావాలని, వీవీఐపీ బాక్స్‌ల్లోనూ వాటా ఇవ్వాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు ఫ్రాంచైజీపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఇలాగైతే తాము హైదరాబాద్‌ను వీడి వెళ్లిపోతామంటూ సన్‌రైజర్స్ ప్రకటన చేసిన నేపథ్యంలో దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. ఈ క్రమంలో హైదరాబాద్ రూరల్ విజిలెన్స్ విభాగం సుదీర్ఘ విచారణ జరిపి హెచ్‌సీఏ బెదిరింపులు నిజమేనని నిర్ధారించింది. వీవీఐపీ గ్యాలరీలోని బాక్స్ రూములకు తాళం వేసినదీ వాస్తవమేనని విజిలెన్స్ అధికారులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. లఖ్‌నవూ మ్యాచ్ సందర్భంగా ఈ సంఘటన జరిగినట్టు నిర్ధారించారు. దీంతో ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను అందచేసి చర్యలకు సిఫారసు చేశారు.

ప్రీ క్వార్టర్స్‌కు సింధు, ప్రణయ్



సింగపూర్: భారత ఏస్ షట్లర్లు పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ సింగపూర్ ఓపెన్ ప్రీక్వార్టర్స్‌కు చేరుకొన్నారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో సింధు 21-14, 21-9తో వెన్ యు జాంగ్ (కెనడా)పై నెగ్గింది. మాళవిక 21-14, 18-21, 11-21తో సుపనిదా కొటగాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో, అన్‌మోల్ కర్బ్ 11-21, 22-24తో చెన్ యు ఫీ (చైనా) చేతిలో ఓడారు. ప్రణయ్ 19-21, 21-16, 21-14తో రాస్మస్ జమ్మే (డెన్మార్క్)పై నెగ్గగా.. కిరణ్ జార్జ్ 19-21, 17-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో, ప్రియాన్షు 21-14, 10-21, 14-21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడారు. మహిళల డబుల్స్‌లో కవిప్రియ-సిమ్రన్ జంట 4-21, 9-21తో కొరియా జోడీ లి సొ హి-బెక్ హ న (కొరియా) చేతిలో, మిక్స్‌డ్‌లో ధ్రువ్ కపిల-తనీషా ద్వయం 18-21, 13-21తో చైనా జంట జియాంగ్-జాంగ్ చి చేతిలో, సూర్య-అమృత ద్వయం 11-21, 17-21తో జపాన్ జంట యుచి షిమోగమి-సయాక చేతిలో ఓడారు.

సిన్నర్, జొకో ముందంజ

- జ్వెరెవ్, గాఫ్ కూడా
- ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో టాప్ సీడ్ సిన్నర్, ఆరో సీడ్ జొకోవిచ్, జ్వెరెవ్, గాఫ్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో సిన్నర్ 6-4, 6-3, 7-5తో ఆర్థర్ (ఫ్రాన్స్)పై, జొకోవిచ్ (సెర్బియా) 6-3, 6-3, 6-3తో మెకెంజీ (అమెరికా)పై, మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-3, 6-3, 6-4తో లెర్నర్ (అమెరికా)పై, ఐదో సీడ్ డ్రేపర్ (బ్రిటన్) 3-6, 6-1, 6-4, 6-2తో మాటి (ఇటలీ)పై, రుబ్లేవ్ 6-4, 4-6, 6-4, 6-1తో హ్యారిస్ (సౌతాఫ్రికా)పై గెలిచి ముందంజ వేశారు. కాగా, 11వ సీడ్ డానిల్ మెద్వెదెవ్ 5-7, 3-6, 6-4, 6-1, 5-7తో కామెరూన్ (బ్రిటన్) చేతిలో ఓడగా.. దిమిత్రోవ్ ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కొకొ గాఫ్ 6-2, 6-2తో ఒలీవియా గడెకి (ఆస్ట్రేలియా)పై, మూడో సీడ్ జెస్సికా పెగుల 6-2, 6-4తో అన్నా బొడోని (రుమేనియా)పై నెగ్గారు.

ఎల్ఐసీ లాభం రూ.19,013 కోట్లు

రూ.12 చొప్పున తుది డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎల్ఐసీ ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలో చక్కటి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.19,013 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే లాభం 38 శాతం పెరిగింది. అయితే ఇదే కాలంలో కంపెనీ స్థూల ఆదాయం మాత్రం రూ.2,50,928 కోట్ల నుంచి రూ.2,41,625 కోట్లకు పడిపోయింది. అయినా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.12 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

ప్రీమియం ఆదాయం: గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంతో పోలిస్తే ఈ సంవత్సరం తొలి ఏడాది ప్రీమియం ఆదాయం రూ.13,810 కోట్ల నుంచి రూ.11,069 కోట్లకు పడిపోయింది. ఇదే సమయంలో రెన్యూవల్ ప్రీమియం ఆదాయం మాత్రం రూ.77,368 కోట్ల నుంచి రూ.79,138 కోట్లకు చేరింది.

సంవత్సరం మొత్తానికి: 202425 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఎల్ఐసీ రూ.48,151 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఆర్జించిన రూ.40,676 కోట్లతో పోలిస్తే ఇది ఇది 18 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.8,53,707 కోట్ల నుంచి రూ.8,84,148 కోట్లకు చేరింది.

రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులు: 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ ఈక్విటీ మార్కెట్‌లో రూ.1.85 లక్షల కోట్లు పెట్టుబడిగా పెట్టింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 41 శాతం ఎక్కువ. ఇవిగాక రుణ పత్రాల్లోనూ రూ.80,000 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. పెట్టుబడుల విక్రయం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.73,000 కోట్ల రాబడులు ఆర్జించినట్టు కంపెనీ తెలిపింది. ఈ సంవత్సరం పెట్టుబడులు మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని పేర్కొంది.

రూ.54.52 లక్షల కోట్ల ఆస్తులు

గత ఏడాది మార్చి నాటికి రూ.51,21,887 కోట్లుగా ఉన్న ఎల్ఐసీ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) ఈ ఏడాది మార్చి నాటికి రూ.54,52,297 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరానికి పాలసీదారులకు బోనస్ కోసం కంపెనీ రూ.56,190.24 కోట్లు కేటాయించింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.3,234.37 కోట్లు ఎక్కువ.

13 శాతం పెరిగిన ఎన్ఎండీసీ లాభం

ఒక్కో షేరుపై రూపాయి డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి చక్కటి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.23,668 కోట్ల టర్నోవర్‌పై రూ.6,693 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే టర్నోవర్ 11 శాతం, నికర లాభం 13 శాతం పెరిగాయి. మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలోనూ కంపెనీ రూ.7,444 కోట్ల టర్నోవర్‌పై రూ.1,496 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే టర్నోవర్ ఎనిమిది శాతం పెరిగినా, నికర లాభం నామమాత్రంగా రెండు శాతం మాత్రమే పెరిగింది. అయినా 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు ఒక్కో షేరుపై రూపాయి చొప్పున తుది డివిడెండ్‌గా చెల్లించాలని ఎన్ఎండీసీ బోర్డు సిఫారసు చేసింది. ఇంతకు ముందు చెల్లించిన రూ.2.3 మధ్యంతర డివిడెండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ ఒక్కో షేరుపై రూ.3.3 చొప్పున డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై ఇది 330 శాతానికి సమానం.

ఇన్‌స్టామార్ట్ రీ బ్రాండింగ్

- స్విగ్గీ పేరు తొలగింపు

న్యూఢిల్లీ: క్విక్‌కామర్స్ సేవల ప్లాట్‌ఫామ్ 'స్విగ్గీ ఇన్‌స్టామార్ట్' పేరు మార్చుకుంది. తన మాతృ సంస్థ 'స్విగ్గీ' పేరును వదిలించుకుని కేవలం 'ఇన్‌స్టామార్ట్'గా కొత్త అవతారమెత్తింది. సరికొత్త లోగోను సైతం ఆవిష్కరించింది. శరవేగంగా వృద్ధి చెందుతున్న క్విక్ కామర్స్ రంగంలో స్వతంత్ర బ్రాండ్‌గా గుర్తింపు సాధించేందుకు వ్యూహాత్మకంగా ఈ రీబ్రాండింగ్ జరిపినట్టు తెలిసింది.

బీఎస్ఎన్ఎల్‌కు రెండో వరుస లాభం

18 సంవత్సరాల తర్వాత ఇదే ప్రథమం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని టెలికం కంపెనీ బీఎస్ఎన్ఎల్ లాభాల బాటలో కొనసాగుతోంది. మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో రూ.280 కోట్ల లాభం నమోదు చేసింది. అంతకు ముందు డిసెంబరు త్రైమాసికంలో కూడా సంస్థ రూ.262 కోట్ల నికర లాభం ప్రకటించింది. 2007 తర్వాత బీఎస్ఎన్ఎల్ వరుసగా రెండు త్రైమాసికాలు నికర లాభాలు ఆర్జించడం ఇదే మొదటిసారని కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.849 కోట్ల నికర నష్టాలు చవిచూసింది.

ఏడాది మొత్తంలో తగ్గిన నష్టం: మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూస్తే మాత్రం బీఎస్ఎన్ఎల్‌కు నష్టాలు తప్పలేదు. అయితే 2023-24తో పోల్చితే నష్టం రూ.5,370 కోట్ల నుంచి రూ.2,247 కోట్లకు తగ్గింది. అంటే నష్టం 58 శాతం తగ్గిందన్న మాట. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మూడు సర్కిల్స్ మాత్రమే లాభాలు నమోదు చేయగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 10 సర్కిల్స్ లాభాలు నమోదు చేసినట్టు సింధియా చెప్పారు. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం 10 శాతం పెరిగి రూ.23,400 కోట్లకు, నిర్వహణ ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.20,841 కోట్లకు చేరాయని సింధియా చెప్పారు.

మెడ్‌ప్లస్ లాభం రూ.13.98 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ నాలుగో త్రైమాసికంలో రూ.13.98 కోట్ల స్టాండ్ అలోన్ లాభం ప్రకటించింది. ముందు ఏడాది ఇదే కాలంలో కంపెనీ 9.83 కోట్ల లాభం నమోదు చేసింది. ఆదాయం సైతం రూ.150.27 కోట్ల నుంచి రూ.204.46 కోట్లకు చేరింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా కంపెనీ ఆదాయం రూ.473.34 కోట్ల నుంచి రూ.722.03 కోట్లకు, నికర లాభం రూ.9.44 కోట్ల నుంచి రూ.40.33 కోట్లకు పెరిగాయి.

రెండు రోజుల లాభాలకు బ్రేక్

625 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో రెండు రోజుల ర్యాలీకి అడ్డుకట్ట పడింది. బ్యాంకింగ్, ఐటీ, ఆటో షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడంతో సెన్సెక్స్ మంగళవారం 624.82 పాయింట్లు క్షీణించి 81,551.63 వద్దకు జారుకుంది. ఒకదశలో సూచీ 1,054 పాయింట్లు కోల్పోయి 81,121.70 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 174.95 పాయింట్లు పతనమై 24,826.20 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నష్టపోగా.. అల్ట్రాటెక్ సిమెంట్ షేరు 2.29 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. కాగా ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 30 పైసలు తగ్గి రూ.85.40 వద్ద ముగిసింది.

ఇండిగోలో గంగ్వాల్ రూ.11,564 కోట్ల వాటా విక్రయం

న్యూఢిల్లీ: ఇండిగో ఎయిర్‌లైన్స్ మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రమోటర్లలో ఒకరైన రాకేశ్ గంగ్వాల్, ఆయన కుటుంబ ట్రస్ట్ కలిసి సంస్థలో 5.7 శాతం వాటాను రూ.11,564 కోట్లకు విక్రయించారు. 5.7 శాతం వాటాకు సమానమైన 2.21 కోట్ల షేర్లను రూ.5,230.50 చొప్పున విక్రయించినట్లు తెలిసింది. ఈ లావాదేవీకి ముందు కంపెనీలో గంగ్వాల్, ఆయన కుటుంబ ట్రస్ట్‌కు 13.5 శాతం వాటా ఉండేది. ఇండిగో మరో ప్రమోటర్ రాహుల్ భాటియాతో విభేదాల నేపథ్యంలో గంగ్వాల్ తన వాటాను క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నారు.


ఐబీఎంలో 8,000 ఉద్యోగాలు ఉఫ్

న్యూయార్క్: భారీగా ఉద్యోగులను తొలగిస్తున్న అమెరికన్ టెక్ దిగ్గజాల్లో ఐబీఎం కూడా చేరింది. ఈ సంస్థ 8,000 ఉద్యోగులను తొలగించినట్లు తెలిసింది. అందులో మెజారిటీ సిబ్బంది మానవ వనరుల (హెచ్‌ఆర్) విభాగానికి చెందినవారే. ఐబీఎం ఈమధ్యనే 200 హెచ్‌ఆర్ ఉద్యోగాలను ఏఐ ఏజెంట్లతో భర్తీ చేసింది. కొద్ది రోజులకే ఈ విభాగంలో భారీగా తీసివేతలకు పూనుకోవడం గమనార్హం.

ఐటీ రిటర్న్‌ల గడువు పెంపు

న్యూఢిల్లీ: 2025-26 పన్ను మదింపు సంవత్సరానికి ఐటీ రిటర్న్‌ల దాఖలు గడువును ఆదాయపు పన్ను శాఖ జూలై 31 నుంచి సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులు, అవిభక్త హిందూ కుటుంబాలు, తమ అకౌంట్స్‌ను ఆడిట్ చేయించాల్సిన అవసరం లేని సంస్థలకు ఈ వెసులుబాటు వర్తిస్తుందని సీబీడీటీ తెలిపింది. ఐటీఆర్ ఫారాల్లో చేసిన మార్పులు, చేర్పులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది.

మ్యూచువల్ ఫండ్ వ్యాపారంలోకి జియో ఫైనాన్షియల్



న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫ్ఎస్ఎల్) మ్యూచువల్ ఫండ్ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించేందుకు సెబీ ఆమోదం తెలిపింది. ఈ వ్యాపారం కోసం అమెరికాకు చెందిన బ్లాక్‌రాక్, జేఎఫ్ఎస్ఎల్ కలిసి 'జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో సమ భాగస్వామ్య కంపెనీని ఏర్పాటు చేశాయి. కాగా, 'జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్'కు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీతో పాటు దీనికి అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా వ్యవహరించేందుకు జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సెబీ అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో జేఎఫ్ఎస్ఎల్ షేరు బీఎస్ఈలో 3.46 శాతం లాభపడి రూ.291.50 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	525
వరంగల్	517	గోదావరి	510
చిత్తూరు	603	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	117
కరీంనగర్	115	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	105
కర్నూలు	115	నెల్లూరు	110
విశాఖపట్నం	111	అనంతపురం	110
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,130 ▲	89,950 ▲	1,11,000 ▲
విజయవాడ	99,000 ▼	93,500 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	98,350 ▼	89,950 ▲	1,11,000 ▲
రాజమండ్రి	97,470 ▼	89,350 ▼	1,00,300 ▼
ప్రొద్దుటూరు	96,000 ▼	88,320 ▼	98,900 ▼
ముంబై	95,150 ▼	87,160 ▼	96,525 ▼



www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 28-5-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**







తారకరామ నామం... సదా స్మరామి!



ఆపరేషన్ సిందూర్ ప్రజలందరిలోనూ దేశ భక్తిని తట్టిలేపింది. యుద్ధంలో అమరులైన సైనికులకు దేశం యావత్తు అశ్రునివాళులు అర్పించింది. మన సైన్యం వీరత్వాన్ని తలచుకొని జాతి యావత్తు పులకించింది. వారి శౌర్యంతో పాటు సైనికుల సంక్షేమం కోసం మహానటుడు ఎన్టీఆర్ గతంలో చేసిన ఓ మంచి పనిని సమాజానికి గుర్తుచేసింది. 1965 పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో మన సైనికుల సంక్షేమం కోసం తనవంతు బాధ్యత నెరవేర్చేందుకు నడుం బిగించిన ఎన్టీఆర్ జనాల్లోకి వెళ్లారు. విరాళాలు సేకరించి జాతీయ రక్షణ నిధికి అందించారు. అలాగే ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమను పట్టి కుదిపేస్తున్న థియేటర్ల వ్యవహారం కాస్తా రచ్చకెక్కిన విషయం చూస్తున్నాం. కానీ తన నాయకత్వ ప్రతిభతో ఒకప్పుడు ఇండస్ట్రీని ఏకతాటిపై నడిపించారు ఎన్టీఆర్. పరిశ్రమకు ఏ ఇబ్బంది వచ్చినా పెద్దదిక్కుగా ఉండి పరిష్కరించడంలో ముందుండేవారు. కానీ, ఇప్పుడు ఏదీ ఆ నాటి ఎన్టీఆర్ స్ఫూర్తి? ఓటీటీ ప్రభావంతో ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదనేది చాలాకాలంగా వినిపిస్తోంది. దీనివల్ల సింగిల్ స్క్రీన్ల నిర్వహణభారంగా మారి పెద్ద సంఖ్యలో థియేటర్లు మూతపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు కూడా అన్న ఎన్టీఆర్‌నే పరిశ్రమ గుర్తుచేసుకుంటోంది. ఆయన మాటకు గౌరవమిస్తూ తరువాతి తరం హీరోలు ముందుకు సాగారు. కానీ, ఈనాడు ఆ రీతిన పిలుపునిచ్చేవారెక్కడ? అంత పెద్దరికం ఎవరిలో ఉంది?

ఎన్టీఆర్ జైత్రయాత్ర...

ఎన్టీఆర్‌ను ఈ విషయాల్లోనే తలచుకోవడం కాదు ఆ రోజుల్లో సినిమా థియేటర్లకు ఫీడింగ్ అంటే రామారావు సినిమాలే! ఇతర హీరోలవి ఎంత పెద్ద విజయాలు సాధించినా, ఎన్టీఆర్ స్థాయిలో వసూళ్ళు చూసేవి కావు. అందువల్ల ఆయన యేడాదికి పదికి తక్కువ కాకుండా నటించారు. యాభై ఏళ్ళు పైబడ్డ తరువాత కూడా సంవత్సరానికి ఏడెనిమిది సినిమాల్లో నటిస్తూ సాగారు రామారావు. ఇక ఆయన స్టార్ డమ్ 'పాతాళభైరవి'తో తిరుగులేని జానపద నాయకునిగానూ, 'మాయాబజార్' తరువాత పౌరాణికాలంటే రామారావే అనే రీతిలోనూ జైత్రయాత్ర చేశారు. అంతకు ముందు జానపద కథానాయకులుగా వెలిగిన వారు, పౌరాణికాల్లో రాణించినవారు వేరే దారి చూసుకోవలసి వచ్చింది. 'నిప్పులాంటి మనిషి' రీమేక్‌తో గ్రాండ్ సక్సెస్ చూసిన ఎన్టీఆర్ యాభై ఏళ్ల తరువాత కూడా స్టార్స్‌గా రాణించవచ్చునని దేశంలోని నటులందరికీ నిరూపించి చూపించారు. ఆ సినిమా ఒరిజినల్ 'జంజీర్'లో నటించిన అమితాబ్ మాత్రం యాభై తరువాత కేరెక్టర్ రోల్స్‌కు మారారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అరవై ఏళ్ళు దాటినా హీరోలుగా సాగుతున్న మన స్టార్స్‌ను చూస్తూనే ఉన్నాం. ఆయన సినీ రంగ నిష్క్రమణ తరువాత టాప్ స్టార్స్‌గా వెలిగిన నటులు కూడా ఆయన సినీ రంగంలో ఉన్నప్పుడు కేవలం సైడ్ పాత్రలకు, చిన్న సినిమాలకే పరిమితమయ్యారన్న విషయం అందరికీ తెలిసిందే.

పాత చిత్రాలతో బాక్సాఫీస్‌కు కళ

ఆ రోజుల్లో సింగిల్ థియేటర్స్ వారికి ఎన్టీఆర్ రిపీట్ రన్ మూవీస్ శ్రీరామరక్షగా ఉండేవి. ఎంత పెద్ద థియేటర్ అయినా, ఎంత కొత్త సినిమా హాలయినా గ్యాప్ వస్తే చాలు వెంటనే ఎన్టీఆర్ పాత చిత్రాలు ప్రదర్శించేవారు. ఎన్టీఆర్ పాత సినిమాలు సైతం మంచి వసూళ్లు చూసేవి. దాంతో థియేటర్లకు నష్టం వాటిల్లేది కాదు. పైగా ఆ రోజుల్లో సినిమా పరిశ్రమను నమ్ముకున్న వారి కోసం ఎన్టీఆర్ ఏడాదికి ఏడు, ఎనిమిది సినిమాలు తగ్గకుండా చేసేవారు. ఒకదశలో పదికి పైగా చిత్రాలలోనూ ఆయన నటించిన సందర్భాలున్నాయి. అలా థియేటర్లకు నష్టాలు వాటిల్లకుండా చూడడంలోనూ ఎన్టీఆర్ సినిమాలే ఆదరువుగా నిలిచాయి. కానీ, ఈ తరం హీరోలు, ముందు తరం కథానాయకులు సైతం ఏడాదికో, రెండేళ్లకో ఒక సినిమా చేస్తున్న పరిస్థితులున్నాయి. పైగా సినిమాలకు పెనుభూతంగా ఓటీటీ బయలు దేరింది. చిన్నా చితకా సినిమాలు వస్తున్నాయి కానీ, అవేవీ థియేటర్లను ఆదుకొనే పరిస్థితుల్లో లేవు. ఈ నేపథ్యంలో అగ్రకథానాయకులు కనీసం సంవత్సరానికి రెండు సినిమాల్లోనైనా నటించవలసిన పరిస్థితి ఏర్పడింది. చిత్రపరిశ్రమ క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు రామారావు ఎన్నో సార్లు ఆదుకున్న దాఖలాలున్నాయి. తన తరువాతి తరం హీరోలకు సైతం ఎక్కువ సినిమాల్లో నటించమని, అప్పుడే పరిశ్రమ బాగుపడుతుందని చెప్పేవారు ఎన్టీఆర్.

అన్ని రికార్డులూ ఆయనవే

ఇక తెలుగునాట స్టార్‌గా ఎన్టీఆర్ విజయాలకు, రికార్డులకు కొదువే లేదు. 'పాతాళభైరవి'తో 30 థియేటర్లలో వందరోజులు అవలీలగా సాధించడం ఎవరి వల్లా కాలేదు. మరో ఆరుసార్లు ఆ సక్సెస్ మార్కును ఎన్టీఆరే సాధించగలిగారు గాని ఇతరులు ఎవరికీ సాధ్యం కాలేదు. ఈయన పరిశ్రమవదలి వెళ్లిన పదేళ్ల తరువాత టాక్స్ రాయితీలు ఇస్తేనే ఇతర హీరోలకు 30 థియేటర్లలో సెంచరీ సాధ్యమైంది. ఎన్టీఆర్ చిత్రసీమలో ఉండగా కోటి రూపాయలు వసూళ్లు చూసిన సినిమాలు మొత్తం 16 కాగా, అందులో 13 ఈయనవే! మొదటివారం రూ.23 లక్షలు ఓపెనింగ్ చూసిన చిత్రాలు ఎన్టీఆర్‌వి 12 సినిమాలు కాగా, ఎన్టీఆర్ సినీరంగంలో ఉన్నంత వరకు తెలుగులో మరే హీరోకూ ఒకటి కూడా లేకపోవడం గమనార్హం! ఆ సమయంలో ఎన్టీఆర్ సినిమాల ఓపెనింగ్స్ రూ.23 లక్షల నుంచి రూ. 71 లక్షల రూపాయల దాకా వెళ్లినా కూడా ఇతరులెవరికీ రూ. 23 లక్షలు ఓపెనింగ్ లేకపోవడం, అంటే మూడో వంతు ఓపెనింగ్ కూడా లేకపోవడం గమనించదగ్గ అంశం. ఇలా ఎటు చూసినా ఎన్టీఆర్ నామాన్ని స్మరించడం అన్నది తెలుగువారికి, తెలుగు చిత్రపరిశ్రమకు రివాజుగా మారింది. అందుకే 'తారకరామ నామం సదా స్మరామి'!

● కొమ్మినేని వెంకటేశ్వర రావు

వ్యక్తిగత హోదాతో సంప్రదింపులకు పవన్ చెక్

● 'హరిహర వీరమల్లు' ధరల పెంపునకూ ఇదే నిబంధన



కొత్త చిత్రాల విడుదల సందర్భంలో టికెట్ ధరల పెంపు నిమిత్తం నిర్మాతలు, వారికి సంబంధించిన వారు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. సినిమా హాళ్ల బంద్ ప్రకటన, ఈ క్రమంలో తమ శాఖ ద్వారా చేపట్టిన చర్యలను, తాజా పరిణామాలను రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మంగళవారం వివరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పలు కీలక సూచనలు చేశారు. త్వరలో విడుదలయ్యే 'హరిహర వీరమల్లు' సినిమాకు టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించాలనీ, ఇందులో తన మన భేదాలు పాటించవద్దని స్పష్టంగా చెప్పారు.

ప్రేక్షకులు సినిమా హాల్ వరకూ రావాలంటే..?

రాష్ట్ర వ్యాప్తంగా మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్స్‌లో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలోనూ గుత్తాధిపత్యం సాగుతోందనే విషయం కూడా ప్రభుత్వం దృష్టికి వచ్చినందున దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి పవన్‌కల్యాణ్ సూచించారు. ప్రేక్షకులు కుటుంబ సమేతంగా సినిమా హాళ్లకు రావాలంటే తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి రాకూడదని పవన్ అభిప్రాయపడ్డారు.

సినిమా హాళ్ల బంద్ నేపథ్యంలో...

థియేటర్ల బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని మంత్రి దుర్గేశ్ డిప్యూటీ సీఎంకు వివరించారు. బంద్ ప్రకటన వెనుక జనసేనాయకుడు ఉన్నారని ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు. ఈ ప్రకటన వెనుక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్లు కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉన్నాయని సినిమా వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ కోణంలో కూడా విచారణ చేయించాలని ఆయన మంత్రికి సూచించారు. థియేటర్ల బంద్‌కు కారకుల్లో జనసేన తరపువాళ్లు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దని ఆదేశించారు. నిర్మాతలను, నటులను, దర్శకులను బెదిరింపు ధోరణిలో దారికి తెచ్చుకొని వ్యాపారాలు సాగించాలనుకోనే అనారోగ్యకర వాతావరణానికి తావు ఇవ్వకుండా సినిమా వ్యాపారం సాగించే ప్రోత్సాహకర పరిస్థితులను ప్రభుత్వం తీసుకువస్తుందనే విషయాన్ని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి, నిర్మాతల మండలికి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, దర్శకుల సంఘాలకు తెలియజేయాలన్నారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)



'జైలర్ 2' విలన్‌గా నాగార్జున?

తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంతో జరుగుతోంది. 'జైలర్' సినిమాతో రజనీకాంత్ అభిమానులనే కాకుండా తమిళ, తెలుగు ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకొన్న దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దానికి సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2' పై ఉన్న భారీ అంచనాలను దృష్టిలో ఉంచుకొని మరింత ఆసక్తికరంగా రూపొందిస్తున్నారు. రజనీకాంత్ ఇందులో పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేస్తుండగా, ఈ సినిమాలో ఆయనతో తలపడే విలన్‌గా నాగార్జున నటించనున్నట్లు మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే 'కూలీ' చిత్రంలో వీరిద్దరూ పోటాపోటీగా ఉండే పాత్రలను పోషిస్తున్నారు. 'జైలర్ 2' లో విలన్ పాత్ర కోసం కొన్ని పేర్లు పరిశీలించినా, చివరకు 'కూలీ' చిత్రంలో సైమన్‌గా నాగార్జున లుక్, పెర్ఫార్మెన్స్ చూసి ముగ్ధుడైన దర్శకుడు నెల్సన్ తన సినిమాకు ఆయనే విలన్ అని ఫిక్స్ అయ్యారట. వెంటనే నాగార్జునను కలిశారట. కథ, తన పాత్ర నచ్చడంతో నాగార్జున గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని తెలుస్తోంది. 'జైలర్ 2' చిత్రానికి సంబంధించి ఇప్పటికి రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. మూడో షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. ఇందులోనే రజనీకాంత్, నాగార్జున పాల్గొనే భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు నెల్సన్ ప్లాన్ చేస్తున్నారు. 'జైలర్ 2'లో బాలకృష్ణ కూడా నటించనున్నారని వార్తలు వచ్చాయి. ఇంతవరకూ ఒక్క సినిమాలో కూడా కలసి నటించని బాలకృష్ణ, నాగార్జున ఈ సినిమాలో కలసి ఒక ఫ్రేమ్‌లో కనిపిస్తారా, లేక వారిద్దరికీ విడివిడిగా సన్నివేశాలు ఉంటాయా అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

జనసేన ఇన్‌చార్జిపై వేటు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల నేపథ్యంలో జూన్ 1 నుంచి థియేటర్ల బంద్‌కు నిర్ణయించారన్న వివాదానికి సంబంధించి జనసేన రాజమండ్రి సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, సినీ డిస్ట్రిబ్యూటర్ అనుశ్రీ(అత్తి) సత్యనారాయణను ఆ పార్టీ నాయకత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు జనసేన పార్టీ కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ హెడ్ వేములపాటి అజయ్‌కుమార్ పేరిట సత్యనారాయణకు లేఖ పంపారు. 'అవాంఛనీయమైన థియేటర్ల బంద్ పిలుపు నిర్ణయంలో మీరూ భాగస్వాములేనని మీపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినందున పార్టీలో మీ సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటు మిమ్మల్ని పార్టీ రాజమండ్రి నగర నియోజకవర్గం ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగిస్తున్నాం. వచ్చిన ఆరోపణలు సత్యమో కాదో మీరు నిరూపించుకునేవరకూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలి' అని అందులో ఆదేశించారు. నిర్మాత దిల్ రాజు సోమవారం మాట్లాడుతూ.. అసలు బంద్ విషయం ప్రస్తావనకు తెచ్చింది గోదావరి జిల్లాలకు చెందిన జనసేన నేత, సినిమా థియేటర్ల యజమాని అనుశ్రీ సత్యనారాయణేనని ఆరోపించారు. అయితే సత్యనారాయణ బంద్‌ను వ్యతిరేకించారు. పైగా ఆయన పవన్ కల్యాణ్‌కు బాగా సన్నిహితుడు. ఆయన సస్పెన్షన్ చర్చనీయాంశమైంది.

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

సినిమా థియేటర్లలో తనిఖీలు

కాకినాడ, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని థియేటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. థియేటర్ల నిర్వహణ, సౌకర్యాలపై అధికారులు మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. థియేటర్లలో ఆహార నాణ్యత, ధరల నియంత్రణ, టికెట్ ధరలు, తినుబండారాల విక్రయం, థియేటర్ ఫిట్‌నెస్, ఫైర్, ఫుడ్ సేఫ్టీ, శానిటేషన్ తదితర అంశాలను పరిశీలించారు.

పవన్‌తో ఏకీభవిస్తున్నా



'సగటు సినిమా ప్రేక్షకులను థియేటర్లకు తీసుకురావడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన సూచనలతో నేను ఏకీభవిస్తున్నాను. సినిమా హాళ్లలో తినుబండారాలు, పానీయాల ధరలను అందరికీ అందుబాటులోకి తేవాలన్న వారి అభిప్రాయం అభినందనీయం. దీనిని మనమందరం స్వాగతించి, కలసికట్టుగా ముందుకు సాగుదాం' అని నిర్మాత దిల్ రాజు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా కాకుండా ఫిల్మ్ చాంబర్ ద్వారా మాత్రమే సంప్రదించాలనే సూచన పరిశ్రమకు శాశ్వత దిశ ఇస్తుంది. అందుకే తెలుగు చిత్ర పరిశ్రమ ప్రభుత్వాలతో కలసి ముందుకు సాగాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన అన్ని అంశాలపై తెలంగాణ ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపి, తెలుగు సినిమా అభివృద్ధికి నిర్మాతల మండలితో కలసి కృషి చేస్తాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 28-5-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

6 తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం శాసనాలు

మహానాడులో లోకేశ్ ప్రతిపాదన

అన్ని రంగాల్లో తెలుగువారు ముందుండాలి

యువత, మహిళలు, రైతులు, పేదలు, కార్యకర్తల కోసం ప్రణాళికల రూపకల్పన

ఈ మార్గాన్నే ఎంచుకోవాలని పిలుపు



మహానాడు వేదిక నుంచి కార్యకర్తలకు చంద్రబాబు అభివాదం


మహానాడులో ప్రసంగిస్తున్న లోకేశ్



కార్యకర్తకు జై

వారి త్యాగాలతోనే ఈ అధికారం: చంద్రబాబు

వారి పోరాటాలతోనే నేటి ఈ స్థానం.. మహానాడు వేదికగా పాదాభివందనం చేస్తున్నా

త్యాగాలను వృథా కానివ్వం.. గుర్తింపు ఇస్తాం.. సంక్షేమం అమలు తథ్యం

టీడీపీ విధానాలు, ఆలోచనలు.. అన్ని పార్టీలకూ బ్లూప్రింట్

ప్రజల వద్దకు పాలన, జవాబుదారీని దేశానికి పరిచయం చేశాం

తెలుగు రాష్ట్రాల్లోని నాయకులంతా టీడీపీ వర్సిటీలో చదివిన విద్యార్థులే

11 నెలల్లో 4.95 లక్షల కోట్ల పెట్టుబడులు.. సూపర్ 6 అమలు బాధ్యత మాది

విధ్వంస పాలకుల స్కాముల్ని లెక్కిస్తున్నాం.. ఎవరు అవినీతి చేసినా వదిలిపెట్టం

పెద్ద నోట్లు రద్దు చేయాలి.. డిజిటల్ కరెన్సీని ప్రోత్సహించాలి

అప్పుడే దేశంలో అవినీతి అంతం.. ప్రధానికి నివేదిక ఇచ్చా: సీఎం


పల్నాడు జిల్లాలో హత్యకు గురైన తోట చంద్రయ్య పాడె మోస్తున్న చంద్రబాబు (ఫైల్)



చంద్రయ్య స్ఫూర్తి అజరామరం

వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టారు. ప్రశ్నించిన గొంతుల్ని నొక్కడానికి గ్రామ స్థాయి నాయకుల గొంతులను కోశారు. మన పసుపు సింహం.. మన చంద్రయ్య పీక కోస్తుంటే కూడా 'జై టీడీపీ' అంటూ ప్రాణాలు వదిలారు. అలాంటి స్ఫూర్తి మన పార్టీని నడిపిస్తోంది. అది శాశ్వతంగా ఉంటుంది. మహానాడు వేదికగా మీకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాం. మీ త్యాగాలను వృథా కానివ్వకుండా తగిన గుర్తింపు, సంక్షేమం అమలు చేసి చూపిస్తాం. -చంద్రబాబు

(మహానాడు ప్రాంగణం నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

'మీరు చేసిన పోరాటాలే నేటి ఈ అధికారం. మీ త్యాగాలే నేటి ఈ స్థానం' అని టీడీపీ కార్యకర్తలనుద్దేశించి పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ 'చైతన్య రథం' నుంచి తాను చేపట్టిన 'వస్తున్నా మీ కోసం', లోకేశ్ 'యువగళం' పాదయాత్ర వరకు కార్యకర్తల్లో అదే పోరాట స్ఫూర్తి ఉందని చెప్పారు. గత ప్రభుత్వంలో పాలన అంటే హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులుగా మార్చేశారని మండిపడ్డారు. విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని తెలిపారు. టీడీపీ నాయకులపైనా, కార్యకర్తలపైనా అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టారని.. అయినా ఎత్తిన జెండా దించకుండా పోరాడారని వారిని ప్రశంసించారు. టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా మూడ్రోజులు నిర్వహించే

మిగతా 10వ పేజీలో...


మహానాడులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్న తదితరులు

నిరూపిస్తే రాజీనామా!

ఉర్సాపై జగన్‌కు లోకేశ్ సవాల్

99 పైసలకు భూమలివ్వలేదు.. జగన్ ఇంకా అబద్ధాలాడుతున్నారు

టాప్-100 ఐటీ కంపెనీలు విశాఖ వస్తే 99 పైసలకే భూమి ఇవ్వడానికి రెడీ

సీఎం పదవిపై తొందరెందుకు?.. నేను ఏనాడూ పదవులు అడగలేదు

కార్యకర్తలందరికీ న్యాయం చేస్తాం.. మరో 50 ఏళ్లు పార్టీ పటిష్ఠంగా ఉండాలి

పార్టీ పటిష్ఠానికి వర్కింగ్ గ్రూపులు.. మోదీ నుంచి ఈ ఆలోచన తీసుకున్నా

ఆయన్నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.. మీడియాతో లోకేశ్ చిట్‌చాట్

(మహానాడు ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

ఉర్సా సంస్థకు ఎకరా భూమి 99 పైసలకు ఇచ్చినట్లు జగన్ నిరూపిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి లోకేశ్ సవాల్ విసిరారు. జగన్ ఇంకా అబద్ధాలే మాట్లాడుతున్నారని అన్నారు. మంగళవారం కడప మహానాడు ప్రాంగణంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా

మిగతా 11వ పేజీలో...

కార్యకర్తే అధినేత!

కడప వేదికగా 'మహా'సంరంభం

'నా తెలుగు కుటుంబం'పైనే చర్చంతా

తొలి రోజు 5 తీర్మానాలు ఆమోదం

లోకేశ్ ప్రతిపాదిత 6 శాసనాల్లో భాగం

ప్రముఖంగా ప్రస్తావించిన చంద్రబాబు

రాష్ట్ర చరిత్రను మారుస్తాయని కితాబు

వీటికోసం పార్టీ నియమావళికి సవరణ

10 11



రాష్ట్ర పండుగగా ఎన్టీఆర్ జయంతి

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు

నోటిఫికేషన్ విడుదల

నేటి సాయంత్రం ఫలితం ప్రకటన

తొలిరోజు 22.28 కోట్ల విరాళాలు



అమెరికా విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు బంద్!

ప్రపంచ వ్యాప్తంగా తక్షణమే అమలులోకి

విదేశీ విద్యార్థుల 'సోషల్' ఖాతాల తనిఖీకి త్వరలో కఠిన నిబంధనలు

అప్పటిదాకా ఇంటర్వ్యూల నిలుపుదల

ఇప్పటికే షెడ్యూల్ అయిన వారికి ఓకే

క్లాసులు ఎగ్గొడితే.. వీసా రద్దు!

విదేశీ విద్యార్థులకు అమెరికా హెచ్చరిక

8



8

జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన?

భారీగా నోట్ల కట్టలు దొరికిన నేపథ్యంలో చర్యలకు రంగం సిద్ధం!

ఆయనపై ఆరోపణలను ఇప్పటికే నిర్ధారించిన ముగ్గురు జడ్జిల కమిటీ

అభిశంసనకు సిఫారసు చేసిన మాజీ చీఫ్ జస్టిస్ ఖన్నా

ఐటీ రిటర్న్‌ల గడువు సెప్టెంబరు 15 వరకు పెంపు

బిజినెస్‌లో

రాష్ట్రంలో పెరుగుతున్న కొవిడ్ కేసులు

ఒకేరోజు నలుగురికి కరోనా..? నిలకడగా ఆరోగ్యం

8

రంగంలోకి ఈడీ

మద్యం స్కామ్‌లో కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ

బెజవాడలో సిట్ అధికారులతో సుదీర్ఘంగా భేటీ

పరస్పరం సహకరించుకునేందుకు అంగీకారం

ఉమ్మడిగా దర్యాప్తు చేయాలని నిర్ణయం

స్కామ్‌లో 'అంతిమ లబ్ధిదారు' కోసం వేట

నేడు జైలులో కసిరెడ్డిని ప్రశ్నించనున్న ఈడీ

సిట్ సహకారంతో ప్రశ్నావళి సిద్ధం

'ముడుపుల' సంగతి తేల్చే దిశగా ముందడుగు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో విచారణ కీలక దశకు చేరుకుంది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే ఈ కేసులో కీలక నిందితుల అరెస్టులు, విచారణ చేయగా.. ముడుపులు ఎక్కడికి చేరాయి? 'అంతిమ లబ్ధిదారు' ఎవరు? అనేది పక్కా ఆధారాలతో సహా తేల్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగింది. ఈ కేసు విచారణలో పరస్పరం సహకారం అందించుకోవాలని సిట్, ఈడీ నిర్ణయించాయి. 3,500 కోట్ల రూపాయల స్కామ్‌లో పేద ప్రజల నుంచి పిండుకుని దాచుకున్న అసలు దొంగకు ఉమ్మడిగా ఉచ్చు బిగించేందుకు

మిగతా 9వ పేజీలో...

గ్రూపు-1 కేసులో మరొకరికి సంకెళ్లు

కామ్‌సైన్ మధు సహాయకుడు రఘు అరెస్టు.. హైదరాబాద్‌లో అదుపులోకి

వానలే వానలు

నైరుతిపై ఐఎండీ తీపి కబురు

దీర్ఘకాల సగటుకు 106 శాతం కురిసే అవకాశం

బంగాళాఖాతంలో అల్పపీడనం

రాష్ట్రంలో నేడూ రేపు వర్షాలు

7


మంగళవారం శ్రీకాకుళం బస్టాండు వద్ద జోరు వాన



6

జస్టిస్ బట్టు దేవానంద్ మళ్లీ

ఏపీ హైకోర్టుకు

హైకోర్టు జడ్జీల బదిలీకి కొలీజియం సిఫారసు

కాంగ్రెస్‌తో రాయబారం!

హస్తం గూటికి చేరేందుకు కవిత యత్నాలు

8

మధ్యవర్తి ద్వారా అధిష్ఠానంతో సంప్రదింపులు

సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ దృష్టికి తెచ్చిన అధిష్ఠానం

ప్రస్తుత పరిస్థితుల్లో వద్దని కాంగ్రెస్ నేతల నిర్ణయం

కేసీఆర్ కుటుంబ కలహాలకు కాంగ్రెస్ కారణమన్న తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళతాయని అభిప్రాయం

కారు దిగి చేయి అందుకునేందుకు ఎమ్మెల్యేల పావులు

కవిత బాటలో ఆ పార్టీని ఇప్పుడే వీడాలని యోచన

వారిలో అత్యధికులు గ్రేటర్‌లోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే!





సినిమా పేజీలో

టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు

నేరుగా రావద్దు

చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే కోరాలి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచన

తన 'హరిహర వీరమల్లు'కూ ఇదే నిబంధన

సినిమా హాళ్లలో తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ ధరలు ప్రేక్షకులకు అందుబాటులో ఉండాలి

సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేశ్‌కు దిశానిర్దేశం

పవన్ కల్యాణ్‌తో ఏకీభవిస్తున్నా: దిల్ రాజు

థియేటర్ల బంద్ నిర్ణయంలో జనసేన నేత అత్తి సత్యనారాయణ.. పార్టీ నుంచి సస్పెన్షన్



పటేల్ మాట వినుంటే

ఉగ్రదాడులు జరిగేవే కాదు!

8

పీవోకేను స్వాధీనం చేసుకోవాలని చెప్పినా నాటి పాలకులు పట్టించుకోలే

1947లో దేశ విభజన నిర్ణయంతోనే పాక్ ఉగ్రవాదం పరంపర మొదలైంది

పాక్ తీరు మారకపోతే తగిన బదులిస్తాం

గుజరాత్‌లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

2.2 కి.మీ.లోపలికెళ్లి విధ్వంసం

ఆపరేషన్ సిందూర్‌లో సరిహద్దు దాటి దాడులు

పారిపోయిన పాక్ రేంజర్లు: బీఎస్ఎఫ్ వెల్లడి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సాగర విపత్తు!

కేరళ సముద్రతీరానికి 38 నాటికల్ మైళ్ళదూరంలో, అరేబియా సముద్రంలో శనివారం ప్రమాదానికి గురైన లైబీరియా కార్గోనౌక క్రమంగా ఒరుగుతూ ఆదివారం పూర్తిగా మునిగిపోయింది. నౌకలోని వందలాది కంటైనర్లు సముద్రంలో పడిపోయి, చమురు, ప్రమాదకర రసాయనాలు భారీగా లీకవుతూండటమే కాక, పెద్దసంఖ్యలో కంటైనర్లు ఒడ్డుకు కొట్టుకువస్తున్నాయి. చేపలవేటను నిషేధించి, మత్స్యకారులను సముద్రంలోకి వెళ్ళకుండా ఆపగలిగినప్పటికీ, విస్తరిస్తోన్న చమురుతెట్టును కట్టడిచేయడం, విషపూరిత రసాయనాల ప్రభావాన్ని ఉపశమింపచేయడం పెద్ద సవాలుగా మారింది. కేరళ రాష్ట్రప్రభుత్వం దేశ, విదేశీ నిపుణుల సాయంతో దుష్ప్రభావాలను అరికట్టాలని నిర్ణయం తీసుకుంది.

నాలుగువందల యాభై మెట్రిక్ టన్నుల డీజిల్, ఫర్నెస్ ఆయిల్‌తో పాటు కాల్షియం కార్బైడ్ వంటి విషరసాయనాలను సైతం ఈ నౌక రవాణా చేస్తున్నందున పలురకాల ప్రమాదాలను, సమస్యలను కూడా నిపుణులు ఊహిస్తున్నారు. తీరప్రాంతవాసులకు ప్రమాద తీవ్రతను తెలియచేసి వివిధ తీరాలకు కొట్టుకువస్తున్న కంటైనర్లను తాకవద్దన్న హెచ్చరికలు కూడా అధికారులు చేశారు. తీరానికి వందలమీటర్ల దూరంలో ఉండాలన్న నిబంధనను సైతం విధించారు. తీరరక్షకదళం, నావికాదళం కలగలసి ఈ కార్గోనౌకలోని 24మంది సిబ్బందినీ రక్షించడంతో పాటు, చమురుతెట్టు వ్యాప్తివేగాన్ని నియంత్రించేందుకు డోర్నియర్ విమానం ద్వారా ఆయిల్ స్పిల్ డిస్పర్సెంట్స్ వినియోగం కూడా వెంటనే జరిగింది. రాపిడ్ రెస్పాన్స్ బృందాలు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. చమురువ్యాప్తి, కంటైనర్లు కొట్టుకురావడం వంటి పరిణామాలపై రుతుపవనాల ప్రభావం అధికంగా ఉంటోంది. ఆశించినంత వేగంగా నియంత్రణ, నివారణ చర్యలు సాగకపోవడానికి కూడా రుతుపవనాలు కారణమవుతున్నాయి. టైర్–2 కేటగిరీ ప్రమాదం కాబట్టి, ఇటువంటి సందర్భాల్లో జాతీయ స్థాయి సంస్థలు చేయాల్సినవన్నీ చేస్తున్నాయి.

నియంత్రణ, ఉపశమన చర్యలతో కాలుష్యాన్ని ఎంతగా కట్టడి చేయగలిగినప్పటికీ, సముద్ర జలాల్లో కలిసిపోతూ, లోతుల్లోకి జారిపోతున్న విషాన్ని వడగట్టడం అసాధ్యమైన విషయం. రాబోయేరోజుల్లో సముద్రజీవులమీదా, పర్యావరణంమీద ఈ ఉపద్రవం ప్రభావం హెచ్చుగా ఉండేమాట నిజం. మత్స్యకారుల జీవనోపాధికి కొంతకాలం ఆటంకం తప్పదు. ప్రమాదకర రసాయనాలు నీళ్ళలో కరిగి, చేపల్లోకి చేరతాయి కనుక, అనేక నెలలపాటు ప్రభావిత ప్రాంతాన్ని అధ్యయనం చేయవలసి ఉంటుంది. సముద్రజీవరాశికి ఈ కార్గోనౌక చేసిన అపారనష్టం అంచనాలకు అందనిది. అతి తక్కువ కాలుష్యంతో దేశంలో కేరళ బీచ్‌లకు మంచిపేరుంది, పర్యాటకానికి అవన్నీ పెట్టింది పేరు. ఆ జలాల్లో కాలుష్యం వ్యాప్తిని నివారించేందుకు, సాధ్యమైనంత అధికంగా శుద్ధి జరిపేందుకు మన నిపుణుల సలహాలూ సూచనలతో పాటు, అంతర్జాతీయ సంస్థల సాయం కూడా తీసుకోవాలి. ఇప్పుడున్న విధానాలన్నీ ఉపరితలంలోనే తప్ప, లోతైన శుద్ధి చేయలేవన్న వాదన ఉన్నప్పటికీ, ఖర్చుదారీపని అని వెనకాడకుండా పర్యావరణానికీ, జీవరాశికీ జరిగిన ఈ అన్యాయాన్ని చేతనైనంతమేరకు సరిదిద్దాల్సిందే. సముద్రజలాల్లో చమురు పారబోయడమే కాక, ప్రమాదకర రసాయనాలతో జలాలను విషపూరితం చేసి, సముద్ర, తీరప్రాంత జీవవైవిధ్యాన్ని ముప్పులో ముంచిన ఘటన ఇది. కొన్ని రకాల సముద్రజీవులకు సంతానోత్పత్తికి అనువైన కాలం కూడా ఇదే. అందువల్ల, అన్ని రకాల నష్టాన్ని నిర్దిష్టంగా గణించి, అంతర్జాతీయ చట్టాలకు లోబడి సదరు సంస్థనుంచి నష్టపరిహారాన్ని సాధించడం గురించి కూడా ఆలోచించాలి.

సముద్రంలో వాతావరణ పరిస్థితులు తలకిందులైనప్పుడు, పరస్పరం ఢీకొన్నప్పుడు ఓడలు తిరగబడటం సహజం. సముద్రపునీరు లోపలకు చొరబడి ఈ కార్గోనౌక ఒరిగిపోవడానికీ, అంతిమంగా మునిగిపోవడానికీ ఏయే కారణాలు దోహదం చేశాయో నిర్ధారణ జరగాలి. దాదాపు ముప్పై సంవత్సరాలుగా తిరుగుతున్న ఈ ఓడ నిర్వహణ సక్రమంగా ఉన్నదా, అత్యంత ప్రమాదకర రసాయనాలతో భారీ సరుకురవాణాకు ఇది తగినదేనా? అన్నవి తేలాలి. శక్తిసామర్థ్యాలకు మించిన అదనపు బరువుతో అది ప్రయాణం చేసిందా అన్నదీ ముఖ్యమే. ప్రమాదాలు అకారణంగా ఏమీ జరగవు. కార్యకారణసంబంధాలను నిగ్గుతేల్చగలిగినప్పుడు, ఇటువంటి ఘటనలను కొంతమేరకైనా నివారించవచ్చు.

కశ్మీర్ లోయలో పాకిస్థాన్ ప్రేరేపిత రక్తపాతాన్ని ముక్త కంఠంతో ఖండించే విషయంలో ఇప్పటికీ ప్రపంచ దేశాలు ఆశించిన విధంగా స్పందించడం లేదు. దౌత్య మర్యాదలను పక్కనపెట్టి 2019లో అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలలో ట్రంప్‌కు మద్దతుగా మోదీ ప్రచారం చేశారు. అయినా ట్రంప్ నోట సైతం పాకిస్థాన్ పట్ల ప్రశంసలు వినపడడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? భారతదేశం తన విదేశాంగ విధానాన్ని నిష్పాక్షికంగా సమీక్షించుకోవల్సిన సందర్భమిది.

ఉగ్రవాదంపై భారత్ ఒంటరిపోరు

ప్రపంచంలో ఉగ్రవాదం బారినపడిన ప్రప్రథమ దేశాలలో భారత్ ఒకటి. ఉగ్రవాదం అంటే ఏమిటో ప్రపంచ ప్రజలకు తెలియని కాలంలో భారతదేశం ఆ రక్కసి దాడులకు గురయింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా ఎత్తుడుబిడ్డగా ఉన్న పాకిస్థాన్ ప్రేరేపించిన ఉగ్ర హింసాకాండకు వ్యతిరేకంగా విశాల భారతావని ఏకత్రాటిపై నిలబడి సమర్థంగా పోరాడింది. గతంతో పోల్చితే ఇప్పుడు ఉగ్రవాద ఘాతుకాలు చాల వరకు తగ్గిపోయాయి. అయితే కశ్మీర్ లోయలో తరచు జరుగుతోన్న పాకిస్థాన్ ప్రేరేపిత రక్తపాతాన్ని ముక్త కంఠంతో ఖండించే విషయంలో ఇప్పటికీ ప్రపంచ దేశాలు ఆశించిన విధంగా స్పందించడం లేదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత విదేశాంగ విధానంలో తనదైన ఒక విశిష్ట శైలిని నెలకొల్పారు. పహల్గాం అమానుష మారణకాండను ఖండిస్తూ దానికి బాధ్యులను హెచ్చరింపజేయడంలో ప్రపంచ దేశాల మద్దతును ప్రధాని మోదీ

గల్ఫ్ లేఖ

సమీకరించలేకపోయారు. ఇరుగు పొరుగు నేపాల్, భూటాన్ మొదలు అమెరికా దాకా ఎన్నో దేశాలు పహల్గాం ఉగ్రదాడిని ఖండించాయి. అయితే పాకిస్థాన్‌ను ఒక్క పల్లెత్తు మాట అనలేదు! ఇది భారత ప్రభుత్వాన్ని, ప్రజలను విస్మయానికి గురి చేసింది. భారత సైనిక అవసరాలకు దన్నుగా ఉన్న రష్యా సైతం ఇరు దేశాలు సంయమనం పాటించాలని మాత్రమే విజ్ఞప్తి చేయడం గమనార్హం. 'తన స్నేహితుడు' అని ప్రధాని మోదీ సగర్వంగా చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా పాకిస్థాన్‌ను పల్లెత్తు మాట అనలేదు. అనకపోగా, ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసే పాకిస్థాన్‌ను మహోన్నత భారత్‌తో పోల్చి భారతీయులను అవమానపరిచారు.

అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠను ఇనుమడింపజేయడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత దశాబ్ద కాలంగా నిర్మాణాత్మక పాత్ర వహిస్తున్నారు, సందేహం లేదు. సంప్రదాయ దౌత్య నియమాలకు అదనంగా మోదీ తన వ్యక్తిగత శ్రద్ధాసక్తులతో విదేశాంగ విధాన దిశ, దశలను మార్చారు. తరుచు విదేశీ పర్యటనలు చేయడమే కాకుండా, ప్రపంచ శిఖరాగ్ర సదస్సుల సందర్భంగా చొరవ తీసుకుని ప్రభావశీలురు అయిన ప్రపంచ దేశాల అధినేతలతో చనువుగా మాట్లాడే తీరు,



వ్యంగ్యోక్తులు విసిరే వైనం అమిత ఆసక్తికరంగా ఉంటుంది. అటువంటి చనువు, చొరవ జవహర్‌లాల్ నెహ్రూ సైతం ఎప్పుడూ తీసుకోలేదు. వృత్తిరీత్యా దౌత్యవేత్త అయిన విదేశాంగ మంత్రి జైశంకర్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ అయిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అనుభవం మోదీకి అదనంగా కలిసి వస్తున్న విశేష సానుకూల అంశం.

మరి మోదీ విదేశీ పర్యటనలు, ప్రపంచ నేతలతో ఆయన వ్యక్తిగత మైత్రి పహల్గాం మారణకాండ అనంతరం ఎంత వరకు దేశానికి ఉపకరించాయి? ఇది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న. సమస్త దౌత్య మర్యాదలను పక్కనపెట్టి 2019లో అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలలో ట్రంప్‌కు మద్దతుగా మోదీ ప్రచారం చేశారు. అయినా ట్రంప్ నోట సైతం పాకిస్థాన్ పట్ల ప్రశంసలు వినపడడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

ప్రధాని మోదీ ప్రతిష్ఠ భారత విదేశాంగ విధానానికి ప్రామాణికమైతే, ప్రస్తుతం గల్ఫ్‌తో సహా వివిధ దేశాలకు అఖిలపక్ష ఎంపీ బృందాల పర్యటన అవశ్యకత ఎందుకు? ఇది సహజంగా స్ఫురించే ప్రశ్న. ప్రస్తుతం భారత పార్లమెంటేరియన్లు పర్యటిస్తున్న దేశాల రాయబార కార్యాలయాలన్నీ న్యూఢిల్లీలో ఉన్నాయి. అనుభవజ్ఞుడయిన విదేశాంగ మంత్రి రాయబారులకు ఇచ్చే విపుల వివరణల కంటే ఎక్కువగా, యువ పార్లమెంటు సభ్యులు శ్రీకృష్ణదేవరాయులు, హరీష్ బాలయోగిలతో కూడిన ఎంపీ బృందాలు విదేశీగడ్డపై విదేశీ నేతలకు వివరించగలుగుతాయా?

అందునా భద్రతా మండలి సభ్య దేశాలు, కీలక మిత్ర, ముస్లిం దేశాలకు భారతీయ పార్లమెంటేరియన్ల బృందాలను పంపించడం వల్ల భారత–పాకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలలోని కశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయం చేయడానికి పరోక్షంగా దోహదపడదూ? ఇది ఉపేక్షించదగని వాస్తవం. అందునా ఏరికోరి ముస్లిం రాజకీయ నాయకులను గల్ఫ్ దేశాలకు పంపించడం విడ్డూరంగా ఉంది. అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉన్నా భారతీయ సమాజం దేశ సార్వభౌమత్వాన్ని సంరక్షించుకోవడంలో సమైక్యంగా ఉన్నది, ఎప్పటికీ సమైక్యంగా ఉంటుంది. ఈ తిరుగులేని వాస్తవాన్ని ప్రపంచం ముందు రుజువు చేసుకోవల్సిన అవసరం లేదు.

పాకిస్థాన్‌కు చైనా, టర్కీ, అజర్ బైజాన్ అండగా నిలిచాయి. మరి చైనాను మినహాయించి, మిగతా రెండు దేశాల ఉత్పత్తులు, సేవలను బహిష్కరించాలని కొందరు పిలుపునివ్వడాన్ని ఏ విధంగా అర్థంచేసుకోవాలి? అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ పాకిస్థాన్‌కు బిలియన్ డాలర్ల రుణాన్ని ఇవ్వడాన్ని దౌత్య పలుకుబడితో అడ్డుకోలేకపోయిన మనం ఒక మిఠాయి – మైసూర్ పాక్– పేరును మార్చుకుని మురిసిపోతున్నాం! మోదీ తన మిత్రుడని భావించే ట్రంప్, కశ్మీర్‌పై భారత్ సైనిక చర్య గురించి మాట్లాడిన తీరు భారతీయులకు అవమానకరం. ఒక్కసారి కాదు, వివిధ సందర్భాలలో ఆయన అదే బాణీని పునరుద్ఘాటించారు. ట్రంప్ ప్రకటనపై భారత ఖండనను అంతర్జాతీయ సమాజం పట్టించుకోనేలేదు. అంతర్జాతీయ మీడియాలో భారత్ వాదం వినిపించకపోవడమే అందుకు నిదర్శనం. భారతదేశం తన విదేశాంగ విధానాన్ని నిష్పాక్షికంగా సమీక్షించుకోవల్సిన సందర్భమిది.

▪ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

'పహల్గామ్'తో మారుతున్న రాజకీయాలు



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

దేశ రాజధానిలో వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియదు. విపరీతంగా ఉక్కబోస్తున్న సమయంలో వర్షాలు ముంచెత్తుతున్న కాలమిది. ప్రస్తుతం రాజకీయ వాతావరణం కూడా ఇదే విధంగా ఒక సంధి దశలో ఉన్నట్లు కనపడుతోంది. భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీతో సహా దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు తమ దారిని వెతుక్కునే క్రమంలో ఉన్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా పరివర్తనం చెందకుండా, ప్రజల ఆలోచనలను పసిగట్టకుండా మార్పులను ప్రతిఘటించేవారు క్రమంగా పలుకుబడిని, ప్రభావాన్ని కోల్పోతారని చాణక్యుడుతో సహా పలువురు చరిత్రకారులు అనేక సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడు రాజకీయ పార్టీలు, నేతలు తమను తాము మార్చుకునే క్రమంలోనో, మార్పుకు సిద్ధమవుతున్న క్రమంలోనే ఉన్నట్లనిపిస్తోంది.


ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉండగా భారతీయ జనతా పార్టీకి మరో బ్రాండ్ అంబాసిడర్ అవసరం లేదు. బీజేపీకి బలం, ఆత్మస్థైర్యం ఆయనే. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటించిన నరేంద్రమోదీ, ఈ యుద్ధం నాలుగు రోజుల్లోనే ముగిసిన తర్వాత దాని గురించి ప్రచారం చేసే బాధ్యత పూర్తిగా తన భుజస్కంధాలపై వేసుకున్నారు. తిరంగా యాత్ర వంటి కార్యక్రమాలతో పార్టీని ప్రజల్లోకి వెళ్లమని ఆదేశించినా, నీతీ ఆయోగ్, ఎన్డీఏ వంటి సమావేశాల్లో కూడా ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసించేలా నరేంద్రమోదీ మాట్లాడినప్పుడే దానికి బహుళ ప్రచారం లభిస్తోంది. ఎందుకంటే పాక్‌పై యుద్ధం ప్రారంభించేందుకు, దాన్ని ముగించేందుకు కర్త, కర్మ, క్రియ నరేంద్రమోదీయే. యుద్ధం ముగిసిన తర్వాత ఆయన స్వంత రాష్ట్రమైన గుజరాత్‌లో రెండు రోజులు పర్యటించారు. ఈ నెలలో బిహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, సిక్కిం, మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నారు. యుద్ధం ప్రారంభించడంపై, ముగించిన తీరుపై ప్రశ్నల వర్షానికి ఆస్కారం లేకుండా ఆయన ప్రయత్నిస్తున్నారు.

అయినప్పటికీ కార్గిల్, పుల్వామా అనంతర పరిణామాలు దేశ రాజకీయాలను నిర్దేశించినట్లే పహల్గామ్ అనంతర పరిణామాలు దేశ రాజకీయాలను నిర్దేశిస్తాయా? అన్న చర్చ సాగుతోంది. 1999 ఏప్రిల్ 17న వాజపేయి ప్రభుత్వం కేవలం ఒకే ఒక్క ఓటుతో అధికారం కోల్పోయింది. కాని 1999 జూలైలో కార్గిల్‌లో చొరబాటు జరిగినప్పుడు భారతీయ సైన్యం పాకిస్థాన్‌కు బలంగా గుణపాఠం చెప్పిన తర్వాత సెప్టెంబర్ – అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో 20 పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమి ప్రభంజనం వీచింది. 303 స్థానాలతో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏలో 29 సీట్లతో తెలుగుదేశం కీలక భాగస్వామ్యంగా నిలిచింది. కాని యుద్ధం వల్ల వచ్చిన ఊపు పెద్దగా నిలవలేదు. 1999లో బీజేపీకి లభించిన 182 సీట్లు 138కి పడిపోయాయి. మెజారిటీ కేంద్ర మంత్రులు ఓడిపోయారు. ఆ తర్వాత పదేళ్ల పాటు యూపీఏ ప్రభుత్వం అధికారంలో కొనసాగింది.

యూపీఏ ప్రభుత్వాన్ని గద్దె దించి పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన నరేంద్రమోదీ గత ఎన్నికల్లో 240 సీట్లు సాధించినప్పటికీ తన ప్రభావం కోల్పోలేదు. కాంగ్రెస్ 99 సీట్లకే పరిమితం కావడంతో ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు మోదీకి పూర్తి మద్దతు ప్రకటించాయి. తన సారథ్యంలో బీజేపీ తక్కువ సీట్లు లభించాయని తెలిసినప్పటికీ గడచిన ఏడాదిగా మోదీ తన ఆకర్షణ, ఆదరణ తగ్గకుండా చూసుకుంటున్నారు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఆయన విలువను మరింత పెంచింది. తన స్వభావానికి భిన్నంగా మిత్రపక్షాలను సంతోషపెట్టే ప్రయత్నం చేయడంలోనూ, పార్టీలో అసంతృప్తి స్వరాలు తలెత్తకుండా చూడడంలోనూ ఆయన విజయం సాధించారు. అదే సమయంలో కులగణన వంటి అంశాలపై పట్టువిడుపులతో వ్యవహరించారు. తమిళనాడులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడినే తొలగించి అన్నాడీఎంకేకు స్నేహహస్తం చాచారు.

నిజానికి వాజపేయి హయాంలో జరిగినట్లు పాకిస్థాన్‌తో యుద్ధం మరికొన్ని రోజులు జరిగి ఉంటే మోదీ ప్రభంజనానికి తిరుగు ఉండేది కాదు. కాని అణుయుద్ధానికి దారితీసే ప్రమాదం ఏర్పడడం, విదేశీ శక్తులు జోక్యం చేసుకోవడం ఈ యుద్ధ విరమణ జరగడం ప్రజల్లో తీవ్ర చర్చలకు దారితీసింది. నరేంద్రమోదీ దాదాపు 90 విదేశీ పర్యటనలు చేసినా, పదిసార్లకు పైగా అమెరికా వెళ్లి వచ్చినా పాకిస్థాన్‌ను ఉగ్రవాదం విషయంలో ఏకాకి చేయలేకపోవడం, కొన్ని దేశాలు పాక్‌కు మద్దతునీయడం చాలా మందికి ఆశాభంగం కలిగించింది. పాకిస్థాన్ మరోసారి చిన్న ఉగ్రవాద చర్యకు పాల్పడినా తేరుకోలేనంత బుద్ధి చెబుతాం అని భారత నేతలు అంటున్నారు. కాని అంతర్జాతీయంగా భారత్‌కు మద్దతు రానంతవరకూ, పాకిస్థాన్‌ను ఏకాకి చేయనంత వరకూ భారతదేశం ఆ దేశానికి గట్టిగా బుద్ధి చెబుతుందా లేదా అన్న సందేహాలు కలుగుతూనే ఉంటాయి.

అయినప్పటికీ మోదీకి ఇప్పట్లో పార్టీలో, ఎన్డీఏ తిరుగుండదని మోదీ శకం ఇప్పట్లో ముగిసే అవకాశాలు లేవని ఆయన అభిమానులు భావిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం మోదీ స్థానంలో అంతటి బలమైన ప్రత్యామ్నాయ నాయకుడు లభించగలడా అన్న సందేహాలు వారిలో నెలకొనడమే. అయినా ప్రజల మనోభావాలను తమకు అనుకూలంగా తిప్పుకోవడం, ప్రతిపక్షాల దాడిని ఎదుర్కోవడం మాత్రమే కాక, బీజేపీ కొన్ని అంతర్గత సమస్యల్ని కూడా పరిష్కరించుకోవల్సిన పరిస్థితిలో ఉన్నది. గత ఆరునెలలుగా మోదీ, అమిత్ షాలు బీజేపీ జాతీయ అధ్యక్షుడి స్థానంలో తమకు అనుకూలమైన నేతను నియమించలేకపోతున్నారు. కొన్ని రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకం కూడా పెండింగ్‌లో పడిపోయింది. దేశంలో హిందూత్వ ప్రాబల్యం పూర్తిగా పెరిగింది కనుక ఒకే వ్యక్తి ఆధారిత నాయకత్వం కాకుండా సంస్థాగతంగా పార్టీ బలోపేతం కావడం అవసరమని ఆర్ఎస్ఎస్ భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. విజయదశమి నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రోజురోజుకూ విస్తరిస్తోంది. భారతదేశం ఇప్పటికే హిందూ రాష్ట్రమని ఇటీవల ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ ఆర్గనైజర్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. వ్యక్తి ప్రాధాన్యత తగ్గి విలువల ప్రాధాన్యత పెరగాలని చెప్పిన భాగవత్ బీజేపీని మరింత బలమైన సైద్ధాంతిక పార్టీగా మార్చాలని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రస్తుతం



పాకిస్థాన్‌పై యుద్ధం ప్రారంభించేందుకు, దాన్ని ముగించేందుకు కర్త, కర్మ క్రియ నరేంద్రమోదీయే. యుద్ధాన్ని ఆరంభించి, ముగించిన తీరుపై ప్రశ్నల వర్షానికి ఆస్కారం లేకుండా ఆయన ప్రయత్నిస్తున్నారు. కార్గిల్, పుల్వామా అనంతర పరిణామాలు దేశ రాజకీయ గతిని నిర్దేశించినట్లే పహల్గామ్ పర్యవసానాలు వర్తమాన రాజకీయాలను నిర్దేశిస్తాయా అన్న ప్రశ్నపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

ఆర్ఎస్ఎస్, బీజేపీల అంతర్గత సంబంధాల తీరుతెన్నులపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

ఈ విషయం అలా ఉంటే బిహార్, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పార్టీకి విజయం సాధించిపెట్టడమే కాదు, దక్షిణాదిన విస్తరించడం, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడం నరేంద్ర మోదీ ముందున్న కర్తవ్యం. మూడో టర్మ్‌లో తనకు తిరుగులేకుండా చేసేందుకు మోదీ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తూనే ఉన్నారు. రానున్న కొద్ది నెలల్లో మోదీ తన సమస్యలను ఎలా అధిగమించగలరన్నది తేలుతుంది.

మరోవైపు కాంగ్రెస్ కూడా పుంజుకుంటున్నదని చెప్పేందుకు ఎలాంటి రుజువులు కనిపించడం లేదు. తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో పార్టీ అంతర్గత సమస్యలతో సతమతమవుతోంది. అనేక నిర్ణయాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ఢిల్లీ వస్తున్న నేతలకు సరైన సమాధానం చెప్పగల నేతలు కనపడడం లేదు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ నాలుగోసారి పరాజయం చెందకుండా 2029 నాటికి బలమైన పార్టీగా మారుతుందా లేదా అన్న విషయంలో పార్టీ నేతల్లోనే చర్చ జరుగుతోంది. దేశ వ్యాప్తంగా 21.2 శాతం ఓటు ఉన్న కాంగ్రెస్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. కాని మోదీని ఎదుర్కొనగల బలమైన నాయకత్వం, సాహసోపేతమైన సైద్ధాంతిక ఎజెండాతో పాటు విశ్వసనీయమైన జాతీయ సంకీర్ణాన్ని ఏర్పాటు చేయగల శక్తి కాంగ్రెస్ సమకూర్చుకోగలగాలి. అధికార వికేంద్రీకరణ, జిల్లా స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడం అవసరం. సామాజిక న్యాయమే ఎజెండాగా ప్రకటిస్తూ కాంగ్రెస్‌ను బలహీన వర్గాల పార్టీగా ప్రజలు అక్కున చేర్చుకోవాలని రాహుల్ భావిస్తున్నారు. కాని బీజేపీ శక్తిమంతమైన జాతీయవాదానికి వ్యతిరేకంగా ప్రజలు స్వీకరించే ఒక సైద్ధాంతిక భావనను ఏర్పర్చడంలో కాంగ్రెస్ ఇంకా విజయవంతం కాలేకపోతున్నది. రాహుల్ భారత్ జోడో యాత్ర, వివిధ రాష్ట్రాల్లో పర్యటనలు పార్టీని ఉనికిలో ఉండేలా చేస్తున్నాయి కాని ఒక సంస్థగా పార్టీ ప్రజల్లో పుంజుకోవాల్సిన మరింత క్రియాశీలక నాయకత్వం కాంగ్రెస్‌కు అవసరం.

ప్రాంతీయ పార్టీలు కూడా పరిణామ క్రమంలోనే ఉన్నాయని చెప్పక తప్పదు. సమాజ్‌వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్ మొదలైన కీలక పార్టీలు తమను తాము బీజేపీ నుంచి రక్షించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాయి. తమిళనాడులో డీఎంకే తిరిగి అధికారంలోకి రావడానికి రకరకాల ఎత్తుగడలు వేస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ నిలదొక్కుకునేందుకు యత్నిస్తుండగా బీఆర్ఎస్ అంతర్గత కలహాల్లో కూరుకుపోయింది. కురువృద్ధ నేత కేసీఆర్ పార్టీపై పట్టు కోల్పోయినట్లు కనిపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తనకు లభించిన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేయడంలో విజయవంతం అయిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు తాను, తన పార్టీ మనుగడ కాపాడుకోలేని ప్రమాదంలో ఉన్నారు.

43 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీని గద్దెదించి దేశంలో ప్రత్యామ్నాయ పాలనకు శ్రీకారం చుట్టిన తెలుగుదేశం కూడా భావి మార్పులకు సిద్ధమవుతోందని మహానాడు జరుగుతున్న తీరుతో అర్థమవుతోంది. దేశంలో గత నాలుగు దశాబ్దాల్లో జరిగిన అనేక కీలక రాజకీయ పరిణామాల్లో భాగస్వామి అయిన చంద్రబాబునాయుడు నిర్దిష్టమైన, పరిమితమైన లక్ష్యాలను పెట్టుకుని చరిత్రలో నిలిచిపోవాలన్న ధ్యేయంతో అడుగులు వేస్తున్నారు. 1989లో ఎన్టీఆర్ హయాంలో నేషనల్ ఫ్రంట్‌లోనూ, 1998లో చంద్రబాబు హయాంలో వాజపేయి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం నేడు మోదీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండడమే ఆ పార్టీ కీలక ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. తెలుగుదేశం చారిత్రక పయనం ప్రాంతీయ పార్టీలు అవలంబించాల్సిన తీరుకు గుణపాఠం అని వేరే చెప్పనక్కర్లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఆంధ్రుల మనోరథం నెరవేరేనా?

ఆ రాత్రి (1977, నవంబర్ 18) దివిసీమ జనం పాలిట కాళరాత్రిగా చరిత్రలో మిగిలిపోయింది. బంగాళాఖాతంలో తలెత్తిన ఉప్పెన సమీప గ్రామాలపై విరుచుకుపడింది. గ్రామాలకు గ్రామాలను ముంచెత్తింది. నిద్రపోతున్నవారు ఎటో కొట్టుకుపోయారు; మెలుకువ వచ్చినవారు ఆ ప్రవాహంలో చెట్ల కొమ్మలకు తగులుకుని, వాటినే పట్టుకుని వేలాడుతూ ఆ కాళరాత్రి గడిపారు. వరి కుప్పలు కొట్టుకుపోయాయి. వేలాదిగా పశువులు చనిపోయాయి. మనుషుల్ని, కోట్లాది విలువైన ఆస్తుల్ని, పొలాల్లో పంట కుప్పల్ని ఒకే ఒక రాత్రిలో ఉప్పెన ఊడ్చేసింది. పచ్చని పంట పొలాలు మేట వేసుకుపోయాయి. తెల్లవారాక చూస్తే, బంగాళాఖాతం ఎంతో అమాయకంగా, ప్రశాంతంగా... 'జగన్ చిరునవ్వు'లా కనిపించింది. కానీ, ఒక్క రాత్రిలో అది సృష్టించిన విధ్వంసం నుంచి దివిసీమను చక్కదిద్దడానికి మండలి వేంకటకృష్ణారావు వంటి నిస్వార్థ నేతలకు సైతం ఒక దశాబ్దానికి పైగా పట్టింది.


వైసీపీ అసురగణం "మేమేంటో చూద్దురు గానీ... ఒక్క ఛాన్స్.. ప్లీజ్" అంటూ అభ్యర్థించారు. జనం కూడా అమాయకంగా నమ్మేశారు. 'ఒక్క ఛాన్స్' ఇచ్చారు. 2019లో తెలుగు రాష్ట్రంపై పడిన వైసీపీ అసురల పాలన 1977 నాటి దివిసీమ ఉప్పెన విధ్వంసాన్ని గుర్తు చేసింది. నింగి, నేల, నీరు అనే దానితో పెద్ద పట్టింపు లేకుండా, దోచుకోవడానికే తాము ఈ మానవ జన్మ ఎత్తాం అన్నట్టుగా చెలరేగిపోయారు. నడమంత్రపు సిరులతో కళ్లు పూర్తిగా పూడిపోయినట్టుగా విశృంఖలంగా వ్యవహరించారు.

'తా చెడ్డ కోతి, వనమెల్లా చెరిచింది' అనేది ఓ తెలుగు సామెత. ఒక రాజకీయ పార్టీ ముసుగు కప్పుకున్న పలురకాల సంఘ వ్యతిరేక శక్తులు, తమకు అవసరమైన అధికార, న్యాయ, కేంద్ర సర్వీస్ వ్యవస్థలను కూడా తమ బాటలోకి తెచ్చుకుని, సుభిక్షమైన ప్రజాస్వామిక రాష్ట్రాన్ని ఒక ఆటవిక రాజ్యంగా మార్చివేశారు. హిందూ దేవుళ్లను సైతం చెరబట్టేశారు. పోలీస్ స్టేషన్లలో కొందరు ఖాకీయులు యమకింకరుల అవతారం ఎత్తారు. ఫిర్యాదులు చేయడానికి వెళ్లిన బాధితులపైనే కేసులు బనాయించారు. ప్రశ్నిస్తే చితక బాదారు. వైసీపీ వారే కొన్ని చోట్ల పోలీసు అధికారుల లాగా వ్యవహరించి, ఎవరిని ఎలా హాండిల్ చేయాలో అధికారులకు డిక్టేట్ చేశారు. కాకినాడలో అనంత బాబు అనే ఎమ్మెల్సీ చేసిన అరాచకమే రాష్ట్రంలో సగటు వైసీపీ అసురుని బరితెగింపు వ్యవహార శైలికి, సగటు పోలీసుల అమానుష ప్రవర్తనకు తిరుగులేని ఉదాహరణలు.

రాష్ట్ర వ్యాప్తంగా కొద్దిపాటి హెచ్చు తగ్గులు, తేడాలతో ఎందరో అనంతబాబులు, ఎందరో ద్వారంపూడి చంద్రశేఖర రెడ్లు ఉన్నారు. ప్రభుత్వ ఆస్తులు, వరస కుదిరితే ప్రైవేట్ ఆస్తులు, ఇసుక మింగేశారు. ప్రజల మద్యం బలహీనతను అడ్డం పెట్టుకుని వేలాది కోట్లు దండుకున్నారు. భూగర్భ ఖనిజ సంపదను స్వాహా చేశారు. ఇదేంటి స్వామీ అని ఎవరైనా నసిగితే, అర్ధరాత్రుళ్ళు కొంపల మీద పడి, గోడలు దూకి, తలుపులు పగలకొట్టి, జనాన్ని ఎత్తుకుపోవడం వంటి పోలీసు అరాచకాలు చూస్తూ జనం భయవిహ్వలతకు లోనయ్యారు. దీంతో పాటు తెలుగుదేశం, చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌పై నిత్యం మాటల కాలుష్యం, పలికెల కొద్దీ దుమ్మెత్తి పోయడానికి పేటీఎం భజన గొట్టాలు, కరపత్రాలు, దొంగ సమీక్షకుల ఊదర. ఎంత పేటీఎం పేమెంట్‌కు అంత ఊదర అన్నట్టుగా జనం మీదకు (యాంటీ సోషల్ మీడియా) వీడియోలు వదలడం నిత్యకృత్యమై పోయింది. ఇందుకో ఉదాహరణ చూద్దాం.

విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఓపెన్ టాప్ వాహనంలో వెడుతుంటే ఎవరో ఆకతాయి గులకరాయి లాంటిది విసిరినట్టు పత్రికల్లో వచ్చింది. జగన్ చుట్టూ ఉండే సెక్యూరిటీని తప్పించుకుని, అది జగన్‌కు తగిలి, అక్కడితో ఆగకుండా పక్కనే ఉన్న వెల్లంపల్లి శ్రీనివాస్ అనే ఎమ్మెల్యేకి కూడా తగిలింది (ఏ వస్తువైనా ఎవరైనా విసిరితే, అది ఒకరి తరువాత ఒకరికి ఒకేచోట తగలడం ఇదే మొదటిసారి). పైగా జగన్‌కు ఎక్కడ తగిలిందో, వెల్లంపల్లి శ్రీనివాస్‌కు కూడా సరిగ్గా అక్కడే తగిలిందని... వారిద్దరూ నుదిటికి ఎడమవైపు వేసుకున్న జాన్సన్ బ్యాండేజ్ స్ట్రిప్‌ను బట్టి అర్థం చేసుకోవాలి.

2019–24 మధ్య ఐదేళ్ల 'పీడకల' లాంటి కాలంలో అరాచకాలకు, దోపిడీలకు, దౌర్జన్యాలకు, కబ్జాలకు, మహిళల పట్ల అకృత్యాలకు పాల్పడిన దుశ్శాసనులకు ప్రజాక్షేత్రంలో చోటు లేకుండా చంద్రబాబు ప్రభుత్వం చూడాలని తెలుగు ప్రజలు కోరుకుంటున్నారు. తెలుగు సమాజానికి ఆయన ఇచ్చే 'రిటర్న్ గిఫ్ట్' అదే. తన మీద ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని ఆయన నిలబెట్టుకుంటారా? తనకు అధికారమిచ్చిన ఓటర్ల ఋణం తీర్చుకుంటారా!?



హైదరాబాద్‌లోని ఒక పేటీఎం విశ్లేషకుడు 'జగన్‌పై జరిగిన దాడి మీద చంద్రబాబు వైఖరి ఏమిటి?' అని అంటూ ఒక వీడియో వదిలారు. జగన్ ఒక్కరే ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కాలేదు. అంతకు ముందు 1953 నుంచి సీఎంలుగా పలువురు తెలుగు రాష్ట్రాన్ని పాలించారు. వారి పాలనా రీతులను, జగన్మోహన్‌రెడ్డి నడమంత్రపు పాలన కంటే ముందే తెలుగు ప్రజలు చవి చూశారు. కానీ, ఇంత దోపిడీ, విద్వేషం, రాజకీయ కాలుష్యం, విచ్చలవిడితనం, అధికారం పతనం, పోలీసు కర్కశత్వం... తెలుగు ప్రజలు గత డెబ్బై ఏళ్లలో ఎప్పుడూ చూడలేదు.

అందుకే, తెలుగు ప్రజలు 2024 అసెంబ్లీ ఎన్నికల కోసం వేయికళ్లతో ఎదురు చూశారు. తమ మనసులో ఏముందో మూడో కంటికి తెలియకుండా జాగ్రత్త పడ్డారు. ఎంతమంది వాలంటీర్లను నిఘా పెట్టినా, ఎన్ని రకాల సర్వేలు చేయించినా, వైసీపీ నేతలకు ఓటర్ నాడి అందలేదు. 'వై నాట్ 175?' అనే మూడ్‌లో మునిగి తేలారు. విశేషమేమంటే ఓటరూ అదే అనుకున్నాడు, ఈసారి 'కూటమికి వై నాట్ 175!?' అని. 'ఓటు' అనే వేటకొడవలి తీసుకుని, వైసీపీ అనే ఓ అరాచకాన్ని కసితీరా 164 పోట్లు పొడిచాడు. దాంతో, ఓ ఐదేళ్ల వరకు వారిని ఆవహించిన భయం తొలగిపోయింది. మళ్లీ స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నారు. 'పోలీస్ పీడ' విరగడయింది. తమ ఆస్తిపాస్తులను ఎవరో అర్ధాంతరంగా దొంగిలించుకుపోతారనే భయం వీడింది. మహిళల మానప్రాణాలకు రక్షణ ఏర్పడిందనే భరోసా కలిగింది. ఆత్మగౌరవంతో తమ బతుకులు తాము బతికే రోజులు మళ్లీ తిరిగి వచ్చాయనే ఆనంద డోలికల్లో జనం తేలియాడుతూ సంబరాలు చేసుకున్నారు. ఏ స్వేచ్ఛా సమాజం అయినా ఇంతకంటే ఏమి కోరుకుంటుంది?

చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు వల్ల తెలుగు ప్రజలు సాధించిన అతి గొప్ప విజయం ఇదే. ఆ ప్రభుత్వం తీసుకునే ప్రతి పథకం, ప్రతి ఆలోచన కూడా తెలుగు వారికి అదనపు బోనస్సే. వచ్చే నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అసలు ఏమీ చేయకపోయినా ప్రజలకు ఐదు పైసల నష్టం లేదు. చంద్రబాబు పునరాగమనంతో లభించిన ఆత్మగౌరవంతో కూడిన జీవనం, మాన మర్యాదలకు భంగం లేని, ఆస్తిపాస్తులకు బూచోళ్ల నుంచి కబ్జా భయం లేని సమాజం... తెలుగువారి జీవనయానంలో లభించిన ఓ గొప్ప ఉపశమనం.

అయితే, ఐదేళ్ల పాటు తమ జీవనాన్ని నరకప్రాయం చేసి, సమాజాన్ని, ప్రకృతి వనరులను దోచేసినవారు ఉండవలసింది ప్రజాక్షేత్రంలో కాదని మెజారిటీ తెలుగు ప్రజలు భావిస్తున్నారు. వారికి 'తగిన', అర్థమైన చోట్లకు వారిని పంపించాలని కోరుకుంటున్నారు. ఆ దిశగా చంద్రబాబు వెనుకపడ్డారనే భావం తెలుగుదేశం కార్యకర్తలనే గాకుండా, మామూలు ప్రజలను కూడా దహించి వేసింది. తమ ఆగ్రహావేశాలను సోషల్ మీడియా వేదికలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా వ్యక్తపరచడానికి వారేమీ మొహమాటపడలేదు. చివరాఖరికి– 'సిట్'లు, దర్యాప్తులు, జైళ్లు.. వంటివి మొదలయ్యాయి. వైసీపీ అరాచకాలపై యుద్ధం మొదలైంది. తెలుగు తమ్ముళ్ళకి కొంత ఉపశమనం కలగడం మొదలైంది. అది ఇంకా వేగం పుంజుకోవాలని తెలుగుదేశం కార్యకర్తలే కాక, సగటు తెలుగువాడు కూడా కోరుకుంటున్నాడు. సంక్షేమం–అభివృద్ధి పథకాలతో ముందుకు వెడుతున్నామని చంద్రబాబు, లోకేష్ చెబుతున్నారు. ఆ రెండింటికీ వారు మరొకటి కలపాలి. అదే– 'సిట్'లు. ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క 'సిట్' ఏర్పాటు కావాలి.

వచ్చే ఎన్నికల నాటికి చంద్రబాబు పునరాగమనానికి ముందున్న ఐదేళ్ల 'పీడకల' లాంటి కాలంలో అరాచకాలకు, దోపిడీలకు, దౌర్జన్యాలకు, కబ్జాలకు, మహిళల పట్ల అకృత్యాలకు పాల్పడిన దుశ్శాసనులకు ప్రజాక్షేత్రంలో చోటు లేకుండా చంద్రబాబు ప్రభుత్వం చూడాలని తెలుగు ప్రజలు కోరుకుంటున్నారు. తెలుగు సమాజానికి ఆయన ఇచ్చే 'రిటర్న్ గిఫ్ట్' అదే. అందుకే ఆయనకు 164 సీట్లిచ్చి, సంబరాలు చేసుకున్నారు. మరి, తన మీద ప్రజలు పెట్టుకున్న 'ఈ ఆశలు, ఆకాంక్షలను ఆయన నెరవేర్చి, తెలుగు ప్రజల ఋణం తీర్చుకుంటారా!?

• భోగాది వేంకటరాయుడు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





వర్షాలొచ్చేలోపు తవ్వేద్దాం!

జిల్లాలో 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ లక్ష్యం

ప్రస్తుతం 5.5 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు

వర్షాకాలంలో కొరత లేకుండా భూగర్భ గనుల శాఖ అధికారుల చర్యలు

నైరుతి రుతు పవనాలు జిల్లాకు దగ్గరగా వచ్చాయి. వాటితో సంబంధం లేకుండా అల్పపీడనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ వర్షాలు మరింత విస్తారంగా పడే సూచనలు ఉన్నాయి. ఈలోపే భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచాలని భూగర్భ గనుల శాఖ అధికారులు నిర్ణయించారు. వర్షకాలంలో ఇసుకకు ఎలాంటి కొరత లేకుండా ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ ఉంచాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న ఎనిమిది స్టాక్ పాయింట్లలో ప్రస్తుతం 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. ప్రస్తుత అవసరాలకు ఈ ఇసుక సరిపోతుందని అంచనా వేశారు. వర్షాకాలంలో రీచ్‌ల్లోకి దిగి ఇసుకను తవ్వే అవకాశం ఉండదు. ఎగువన వర్షాలు కురిస్తే తెలంగాణలోని వాగులు, వంకల నుంచి వచ్చే నీరంతా కృష్ణా నదిలో కలుస్తుంది. దీనికితోడు ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసినా నది రూపం ఉగ్రంగా ఉంటుంది.

త్వరలో తవ్వకాలు

జిల్లాలో ఇబ్రహీంపట్నం నుంచి జగ్గయ్యపేట వరకు మొత్తం 15 రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ 15 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉన్నట్టు అధికారులు ఇంతకుముందు అంచనా వేశారు. చందర్లపాడు, కంచికచర్ల, జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో ఇసుక స్టాక్ యార్డులు ఉన్నాయి. కంచికచర్ల మండలం పెండ్యాల, నందిగామ మండలం మాగళ్లు, చందర్లపాడు మండలం కొడవటికల్లు, వత్సవాయి మండలం అల్లూరుపాడు, జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి, వత్సవాయి మండలం పోలంపల్లి, కంచికచర్ల మండలం కీసర, మోగులూరు స్టాక్ యార్డుల నుంచి సరఫరా అవుతోంది. వాస్తవానికి జిల్లాలో 15 రీచ్‌లను భూగర్భ మిగతా 4లో..

రూ.70 కోట్ల విలువైన ఆలయ భూములు కబ్జా!

రాజధాని ప్రాంతం రాయపూడిలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి దానం చేసిన రూ. 70 కోట్లు విలువ చేసే భూమి కబ్జాకు గురైంది. కబ్జాదారులు దర్జాగా ఈ భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చి పెద్ద మొత్తంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కబ్జా చేసిన భూమిలోని 20 సెంట్ల స్థలంలో కబ్జాదారులు చర్చి నిర్మాణానికి ప్రయత్నించగా, స్థానికులు అడ్డుకున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.


తుళ్లూరు మండలం, రాయపూడిలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానం

తుళ్లూరు మండలం, రాయపూడిలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానానికి 6.77 ఎకరాలు విరాళంగా ఇచ్చిన దాత

దాతల మరణానంతరం భూములు స్వాధీనం చేసుకున్న మహిళ

ల్యాండ్ పూలింగ్‌కు ఆ భూములు ఇచ్చి పెద్ద మొత్తంలో ప్రభుత్వం నుంచి లబ్ధి!

20 సెంట్లలో చర్చి నిర్మాణానికి ప్రయత్నం.. అడ్డుకున్న స్థానికులు

దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యల్లేవని విమర్శలు

విజయవాడ (ఇంద్రకీలాద్రి), మే 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన మల్లెల వెంకట రాయుడు దంపతులకు ఐదుగురు సంతానం. కుమారులు ఐదుగురికి ఆస్తులను సమానంగా పంచారు. అయితే రాయపూడి గ్రామంలోని సర్వే నెం.172/ఎలో 2.75 ఎకరాలు, 174/బిలో 2.50 ఎకరాలు, 132లో 1.52 ఎకరాలు వెరసి 6.77 ఎకరాల భూమిని గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానానికి 1934లో విరాళంగా ఇచ్చారు. ఆ భూముల పత్రాలను మాత్రం ఆయన వద్దే ఉంచుకున్నట్టు సమాచారం. ఐదుగురు కుమారుల్లో నలుగురు వివాహాలు చేసుకోగా, ఒక కుమారుడు మల్లెల విశ్వనాథం వివాహం చేసుకోలేదు. అయితే ఆయన వయస్సు సుమారు 60 ఏళ్లు పైబడిన తర్వాత తన బాగోగులు చూసేందుకు ఓ మహిళను వివాహం చేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. వెంకటరాయుడు చనిపోయిన తర్వాత విశ్వనాథం దేవస్థానానికి విరాళంగా ఇచ్చిన భూమి పత్రాలను ఆయన వద్ద పెట్టుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. విశ్వనాథం తనంతరం ఆయన ఆస్తులకు సంబంధించిన పత్రాలతో పాటు వెంకటరాయుడు దేవస్థానానికి విరాళంగా ఇచ్చిన భూమి పత్రాలను కూడా ఆమె తీసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్ర విభజన జరిగి, రాజధాని నిర్మాణానికి భూములు అవసరం కావటంతో నాటి టీడీపీ ప్రభుత్వం ప్రైవేటు భూములను కొనుగోలు చేసి వారికి పరిహారం అందజేసి, కొన్ని ప్లాట్లు కేటాయించింది. ఈ క్రమంలో దేవస్థానం భూమి పత్రాలను విశ్వనాథం వివాహం చేసుకున్న మహిళ సంబంధిత అధికారులకు భూములను ఇచ్చి పరిహారంతో పాటు ప్లాట్లు కూడా తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పలువురు అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పలువురు సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. శ్రీవేణుగోపాలస్వామి మిగతా 4లో..

ఆలయ భూమిలో చర్చి నిర్మాణానికి యత్నం

విశ్వనాథం భార్య పలువురు స్థానికులతో కలిసి సుమారు 20 సెంట్లు స్థలంలో చర్చి నిర్మించటానికి ప్రయత్నించగా, విషయం తెలుసుకున్న ఫిర్యాదు దారులు స్థానికులతో కలిసి అడ్డుకున్నారు. దేవదాయ శాఖ, రెవెన్యూ, సీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని ఫిర్యాదుదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, దేవదాయ శాఖ స్పందించి కబ్జాకు గురైన శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే 6.77 ఎకరాల భూమిని దేవస్థానానికి అప్పగించటంతో పాటు రికార్డుల్లో దేవస్థానం పేరు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.1.09 కోట్ల ఫ్లిప్‌కార్ట్ సొమ్ము నొక్కేశారు

- పోలీసులకు డెల్‌ఫాస్ట్ సంస్థ ప్రతినిధి ఫిర్యాదు
- 9 మంది అవుట్‌డోర్ హబ్‌ల ఆపరేటింగ్ పార్టనర్లపై కేసు నమోదు

విజయవాడ, మే 27(ఆంధ్రజ్యోతి): ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ద్వారా వస్తువులు డెలివరీ చేసి వినియోగదారుల నుంచి వసూలు చేసిన రూ.1.09కోట్లను కాజేసిన తొమ్మిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడకు చెందిన ఎం.అశోక్‌కుమార్, ఎ.శివశంకర్, వేమూళ్ల కల్పనాదేవి కలిసి ఏలూరు రోడ్డులో డెల్‌ఫాస్ట్ సర్వీసెస్ సంస్థను నిర్వహిస్తున్నారు. ఫ్లిప్‌కార్ట్‌లో బుక్ చేసుకున్న వస్తువులను డెలివరీ చేయడానికి డెల్‌ఫాస్ట్ సర్వీసెస్‌కు, ఫ్లిప్‌కార్ట్‌కు మధ్య ఒప్పందం కుదిరింది. ఈ వస్తువులను డెలివరీ చేయడానికి రాష్ట్రంలో 18 అవుట్‌డోర్ హబ్‌లను డెల్‌ఫాస్ట్ సర్వీసెస్ గుర్తించింది. ఫ్లిప్‌కార్ట్‌లో బుక్ చేసుకున్న వస్తువులను ఆ సంస్థ రాష్ట్రంలో ఉన్న అవుట్‌డోర్ హబ్‌లకు పంపుతుంది. ఆ హబ్‌లు డెలివరీ బాయ్స్ ద్వారా సదరు వినియోగదారుల చిరునామాకు చేర్చుతాయి. బుక్ చేసుకున్న వినియోగదారుల్లో కొంతమంది ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తారు. మరికొంతమంది సీవోడీ (క్యాష్ ఆన్ డెలివరీ) చేస్తారు. వస్తువులను డెలివరీ చేసే బాయ్స్ వినియోగదారుల నుంచి డబ్బులను వసూలు చేసి ఫ్లిప్‌కార్ట్‌కు గానీ, ఆ సంస్థ నియమించిన సీఎంఎస్ (క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్)కు డిపాజిట్ చేస్తారు. తర్వాత ఫ్లిప్‌కార్ట్‌కు ప్రతి 15 రోజులకు ఒకసారి డెల్‌ఫాస్ట్ బిల్లులను తయారు చేసి పంపతుంది. ఆ తర్వాత 45 రోజులకు డెల్‌ఫాస్ట్‌కు ఫ్లిప్‌కార్ట్ డబ్బులు జమ చేస్తోంది. అనంతరం డెల్‌ఫాస్ట్ రాష్ట్రంలో గుర్తించిన ఆపరేటింగ్ పార్టనర్లకు సర్వీస్ చార్జీలను చెల్లిస్తుంది. ఈ అవుట్‌డోర్ హబ్‌లను నిర్వహించే ఆపరేటింగ్ పార్టనర్లు క్యాష్ ఆన్ డెలివరీగా వినియోగదారుల నుంచి వసూలు చేసిన రూ.1,09,71,464కోట్లను ఫ్లిప్‌కార్ట్‌కు గానీ, సీఎంఎస్‌లకు గానీ చెల్లించలేదు. ఈ సొమ్మును మొత్తం స్వప్రయోజనాలకు వినియోగించుకున్నాయని డెల్‌ఫాస్ట్ సంస్థ ప్రతినిధి అశోక్‌కుమార్ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అవరోధాలను అధిగమిస్తూ..

చురుగ్గా బుడమేరు డైవర్షన్ చానల్ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు

- సిల్ట్, డీ వాటరింగ్ చేసుకుంటూ ముందుకు
- వరద ముంపు నుంచి బెజవాడను రక్షించడమే ధ్యేయం


బీడీసీపై జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం): బుడమేరు వరద ముంపు నుంచి బెజవాడ పల్లపు ప్రాంతాలను కాపాడటమే లక్ష్యంగా బీడీసీ రిటైనింగ్ వాల్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులకు అడుగడుగునా అకాల వర్షాలు ఆటంకం కలిగిస్తున్నా మొక్కవోని ఆత్మ విశ్వాసంతో ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకునేందుకు జలవనరులశాఖ అధికారులు పని ప్రదేశంలో ఉండి పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. వర్షాలు ముమ్మరం అయితే పనులకు తీవ్ర ఆటంకం అవుతాయనే ఉద్దేశంలో ముందు కాంక్రీట్ పనులు పూర్తి చేసేందుకు అవరోధంగా ఉన్న సిల్ట్‌ను యంత్రాల సాయంతో పక్కకు పోయిస్తున్నారు. అనంతరం డీ వాటరింగ్ చేస్తూ తాత్కాలికంగా గ్రావెల్ రోడ్డు వేసుకుంటూ కాంక్రీట్ పనులకు ఉన్న ఆటంకాలను తప్పిస్తున్నారు. ఒక్కసారి గ్రౌండ్ లెవల్‌లో కాంక్రీట్ పనులు పూర్తి చేసుకోగలిగితే వాల్‌నిర్మాణ పనులు సులభతరం అయ్యే అవకాశం ఉండటంతో కాంక్రీట్ పనుల కోసం శ్రమిస్తున్నారు. అవసరమైతే రాత్రిపగలు తేడా లేకుండా మూడు షిప్టులు పని చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు అధికారులు కాంట్రాక్టు సంస్థతో పనులు వేగంగా చేయిస్తున్నారు. ప్రస్తుతం పగలు మాత్రమే పనులు జరుగుతున్నాయి. అవసరాన్ని బట్టి రాత్రి కూడా చేయాల్సి వస్తే చేయించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

3.3 నుంచి 4.3 కి.మీ వరకు రిటైనింగ్ వాల్

బుడమేరు వరద మళ్లింపు ఎడమ కాలువకు గత ఏడాది సెప్టెంబరు 1న వచ్చిన వరదలకు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నుంచి సుమారు 3.9 కిలో మీటర్ వద్ద నుంచి 500 మీటర్ల వరకు మూడు చోట్ల పెద్ద పెద్ద గండ్లు పడటంతో బెజవాడ పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వారం రోజుల్లో గండ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు


పనుల్ని పరిశీలిస్తున్న అధికారులు

చేయించారు కాని సీపేజ్ ఆగలేదు. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.28 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో 3.3 కిలో మీటర్ వద్ద నుంచి 4.3 కిలో మీటర్ వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు మిగతా 4లో..

వసూళ్లకు వరస కుదిరింది!



దుర్గగుడిపై టోల్‌గేట్, పార్కింగ్ టెండర్ కాంట్రాక్టు సంస్థ నిర్వాకం

- నష్టం వచ్చిందని అదనంగా ఆరు నెలలు ఉచితంగా కాంట్రాక్టు
- ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించాలని కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చిన సంస్థ
- ప్రతిగా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చిన దేవస్థానం అధికారులు
- నెలాఖరుతో ముగియనున్న సదరు సంస్థ టెండర్ గడువు
- కొత్త టెండర్ ప్రక్రియపై నిర్లక్ష్యంగా అధికారులు
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల వాహనాలు ఘాట్ మీదకు చేరుకోవటానికి, పార్కింగ్ చేయటానికి వీలుగా 2023, జూన్‌లో ఓ సంస్థకు కాంట్రాక్టును దేవస్థానం అధికారులు అప్పగించారు. రెండేళ్ల కాలానికి అగ్రిమెంట్ చేశారు. 2023, జూన్‌లో టెండర్ ఇచ్చారు. 2025, మే నెలాఖరుకు గడువు పూర్తి కానుంది. అంటే మరో నాలుగు రోజుల్లోనే కాంట్రాక్టు సంస్థ గడువు ముగుస్తుంది. కానీ, కొత్త టెండర్ పిలవాలన్న ప్రయత్నం దేవస్థాన అధికారులు చేయటం లేదు. వాస్తవానికి ఈ ప్రక్రియ మూడు నెలల కిందటి నుంచే ప్రారంభించాలి. లీజుల విభాగం అధికారులు నూతన ఈవో దృష్టికి తీసుకువెళ్లే కనీస ప్రయత్నం కూడా చేయటం లేదు. టెండరు నిబంధనలకు విరుద్ధంగా దేవస్థానానికి భారీ నష్టం వాటిల్లే ఈ వండర్ టెండర్ విషయంలో సంబంధిత అధికారులు నిర్లిప్తంగా ఉండటానికి కొంతమంది అధికారుల వ్యక్తిగత ప్రయోజనాలే కారణమని తెలుస్తోంది.

ఐదు నెలలకే కాంట్రాక్టు సంస్థకు నష్టం వచ్చిందట

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దుర్గగుడి టోల్‌గేట్, వాహనాల పార్కింగ్ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ ఆరు నెలల తర్వాత నష్టం వచ్చిందంటూ అప్పటి దేవస్థాన ఈవో రామారావుకు లేఖ రాసింది. అప్పట్లో అభివృద్ధి పనుల కారణంగా కొద్ది రోజులు ఘాట్ రోడ్డును మూసివేశారు. ఘాట్ రోడ్ మూసివేత కారణంగా తమకు నష్టం జరిగిందని పేర్కొంది. ఈ నష్టాన్ని చూపుతూ తమకు కార్పొరేషన్ కార్యాలయం మిగతా 4లో..


కడపలో మంగళవారం జరిగిన టీడీపీ మహానాడుకు హాజరైన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), జగ్గయ్యపేట, నందిగామ ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), తంగిరాల సౌమ్య తదితరులు

దద్దరిల్లిన కౌన్సిల్

- మేమేమన్న దొంగలమా అంటూ వైసీపీ కౌన్సిలర్‌పై డీఈ అసహనం
- సింగిల్ టెండర్లతో దోచేసున్నారన్న వైసీపీ
- అభివృద్ధి ఏమిటో త్వరలో చూస్తామంటూ జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ చురకలు
- ఆదాయం పెంచిన కమిషనర్‌కు కౌన్సిల్ ప్రశంసలు

6

గ్రామ స్థాయిలో దెబ్బతిన్న రెవెన్యూ వ్యవస్థ

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

6



మనమిత్రపై అవగాహన కల్పించండి: కలెక్టర్

6



మహానాడు సంబరం

కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.



బదిలీలు పారదర్శకంగా జరగాలి


- రాజకీయ సిఫార్సుల కాలం తొలగించాలి
- పశుసంవర్ధక శాఖ రాష్ట్ర జేఏసీ వినతి

లబ్బీపేట, మే27 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధక శాఖలో బదిలీల నిర్వహణ పారదర్శకంగా జరగాలని రాష్ట్ర జేఏసీ చైర్మన్ శివరామ కృష్ణ రావు, కో-చైర్మన్ గణేశ్వరరావులు కోరారు. లబ్బీపేటలోని పశుసంవర్ధక శాఖ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం అన్ని జిల్లాల పశువైద్యాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పశువైద్య ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించాలని తీర్మానం చేయడం జరిగిందని, 100 శాతం రాజకీయ అనుమతితో నాయకులు సిఫార్సు లెటర్‌లతో బదిలీలు నిర్వహించడం వల్ల అర్హులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. బదిలీ అప్లికేషన్‌లలో రాజకీయ సిఫార్సు లెటర్ తప్పనిసరి అనే కాలమ్ ఉండటం చాలా బాధకరమని, గైడ్‌లైన్స్ ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో, ట్రైబల్ ఏరియా ప్రాంతాలలో రెండు సంవత్సరాల పైబడి సర్వీస్ పూర్తి చేసుకున్న వైద్యులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నా రాజకీయ నాయకుల సిఫార్సు తప్పనిసరి అనడం బాధాకరం అన్నారు. దీనివల్లే పశువైద్యులకు తీవ్రనష్టం వాటిల్లుతుందని, పశుసంవర్ధక శాఖకు, ప్రభుత్వానికి అనేక విన్నపాల ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశం అనంతరం డైరెక్టర్ దామోదర్నాయుడుకు అన్ని జిల్లాల వారు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యఅధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

31న ఏపీఎన్జీజీవో రాష్ట్ర ఎన్నికలు

విజయవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఏపీఎన్జీజీవో) రాష్ట్ర ఎన్నికలు మార్చి 31న విజయవాడలో జరగనున్నాయి. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో, సంఘంలో కీలకమైన పదవులకు ఎన్నికలు జరుగుతున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా అలపర్తి విద్యాసాగర్ ఎన్నిక లాంఛనం కాగా.. ప్రధాన కార్యదర్శిగా ఎవరిని ఎన్నుకుంటారన్న దానిపై ఆసక్తిగా నెలకొంది. ప్రస్తుతం ఈ పదవిలో విద్యాసాగర్ వ్యవహరిస్తున్నారు. శివారెడ్డి పదవీ విరమణ నేపథ్యంలో, ఏపీఎన్జీజీవో జిల్లా యూనిట్స్, ఇతర యూనిట్స్ అన్నీ ఏకగ్రీవంగా తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశాయి. విజయవాడలోని శేషసాయి కళ్యాణ మండపంలో ఏపీఎన్జీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నికలు, బహిరంగ సభ నిర్వహించనున్నారు.

కార్పొరేటర్ ఆత్మహత్యాయత్నం!



విద్యాధరపురం, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక బాధలు తాళలేక 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. కామకోటినగర్‌లోని తన కార్యాలయంలో పురుగుల మందు తాగి, సెల్‌ఫోన్‌లో భార్యకు మెసేజ్ పంపాడు. వెంటనే ఆమె భర్తను స్థానికుల సహకారంతో గొల్లపూడిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించింది. కామకోటినగర్‌లో నరేంద్ర రాఘవ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. 39వ డివిజన్ నుంచి వైసీపీ తరపున ఎన్నికలల్లో గెలిచాడు. అక్వా వ్యాపారం చేస్తున్నాడు. గతేడాది వైసీపీ నుంచి బీజేపీలో చేరాడు. కొద్ది నెలలుగా ఆర్థిక ఇబ్బందులు పడుతుండడంతో పాటు అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కార్యాలయంలో ఎవరూలేని సమయంలో మధ్యాహ్నం వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. సమాచారం తెలుసుకున్న భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు ఆసుపత్రికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. గతంలో డివిజన్‌లోని వీఎంసీ ఉద్యోగినితో కలిసి డ్వాక్రా గ్రూపుల ద్వారా పెద్దఎత్తున బీనామీ పేర్లతో డబ్బు డ్రా చేసినట్టు డివిజన్‌లో ప్రచారం జరిగింది. ఈ ఆరోపణలతో మనస్థాపానికి గురయ్యాడని స్థానికులు చెబుతున్నారు.

రూ.70 కోట్ల ఆలయ భూములు కబ్జా!

(3వ పేజీ తరువాయి)

దేవస్థానానికి చెందిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని దేవదాయశాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేసినా స్పందించలేదని ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారులు రెండు సంవత్సరాల క్రితం ఈ భూమిని నిషేధిత రికార్డులో నమోదు చేయించారు. ఫిర్యాదుదారుల ఒత్తిడి మేరకు దేవదాయ శాఖ అధికారులు 43 రిజిస్టర్‌లో నమోదు చేశారు. అయితే భూమిని మాత్రం స్వాధీనం చేసుకోవటంలో కాలయాపన చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదుదారులు రెవెన్యూ అధికారులను విశ్వనాథం భార్యకు ఇచ్చిన పరిహారాన్ని వెనక్కు తీసుకుని, కేటాయించిన ప్లాట్లను రద్దు చేసి దేవస్థానానికి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

రికార్డుల్లో పేర్లు మార్చమని తహసీల్దార్‌కు లేఖలు

- వేణుగోపాల స్వామి దేవస్థానం ఈవో అచ్చిరెడ్డి

రాయపూడిలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానానికి ఆరు ఎకరాల 77 సెంట్ల భూమిని దాత మల్లెల వెంకటరాయుడు విరాళంగా 1934లో ఇచ్చినట్లు గిఫ్ట్ డీడ్ ఉంది. అయితే ఆ రికార్డుల గురించి దేవదాయశాఖ అధికారులకు తెలియదు. గత ఏడాది జూలైలో దేవస్థానానికి విరాళంగా ఇచ్చిన భూమి ఉన్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. రికార్డులను పరిశీలిస్తే ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో భూమి ఉన్నట్లుగా తేలింది. దీంతో వారి పేర్లను తొలగించి దేవస్థానం పేరిట మ్యుటేషన్ చేయాలని స్థానిక తహసీల్దార్‌కు లేఖలు రాశాం. రెవెన్యూ వారు పట్టించుకోలేదు. సీఆర్‌డీఏ అధికారులు మాత్రం రికార్డులో ఉన్న ప్రైవేట్ వ్యక్తుల పేరిట పూలింగ్ పరిహారంగా ప్లాట్లు, డబ్బులు ఇచ్చారు. సీఆర్‌డీఏ అధికారులకు ఈ అంశంపై దేవదాయశాఖ సహాయ కమిషనర్ లేఖరాశారు. ఇందుకు పరిహారంగా దేవదాయశాఖకు ఎకరాకు రూ.25 లక్షలు ఇస్తామని సీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. అయితే ఇందుకు తాము అంగీకరించడం లేదు. పూలింగ్ నిబంధనల ప్రకారం ఎకరాకు వెయ్యి గజాల నివాస భూమి, కౌలు, 250 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్ ఇవ్వాలని కోరాం. రెవెన్యూ అధికారులు తక్షణం రికార్డుల్లో పేర్లు మార్చి దేవస్థానానికి అప్పగిస్తూ పాస్ బుక్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

వర్షాలొచ్చేలోపు తవ్వేద్దాం!

(3వ పేజీ తరువాయి)

గనుల శాఖ అధికారులు గుర్తించారు. వాటిలో మూడు రీచ్‌లు మాత్రం నిర్వహణలో లేవని తెలుస్తోంది. స్థానిక గ్రామాల ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడం, వారు ఆందోళనలు చేస్తుండడంతో ఈ మూడు రీచ్‌లో ఇసుక తవ్వకాలను నిలుపుదల చేశారు. ప్రస్తుతం 12 రీచ్‌లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ రీచ్‌ల్లో తవ్విన ఇసుకను స్టాక్ పాయింట్లకు తీసుకెళ్తున్నారు. ఇక్కడి నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతోంది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఇసుక నిల్వలు ఉన్నప్పటికీ రాబోయే రోజులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తవ్వకాలు చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి భూగర్భ గనుల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయి. వర్షాకాలానికి సరిపడే విధంగా ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ పాయింట్లలో అందుబాటులో ఉంచాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. దీని ప్రకారం త్వరలో రీచ్‌లో ఇసుక తవ్వకాలను వేగవంతం చేయాలని అధికారులు నిర్ణయించారు.

వసూళ్లకు వరస కుదిరింది!

(3వ పేజీ తరువాయి)

సీతమ్మవారి పాదాల దగ్గర కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ గట్టు వెంబడి ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని కూడా కేటాయించాల్సిందిగా కోరింది. దీంతో అప్పటి ఈవో రామారావు వెంటనే ఆరు నెలల పాటు ఉచితంగా నిర్వహించుకోవటానికి అవకాశం కల్పించాలని అప్పటి దేవదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. దీంతో పాటు సీతమ్మ వారి పాదల దగ్గర ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని పార్కింగ్‌కు వాడుకోవడానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అప్పటి దేవదాయ శాఖ కమిషనర్ కూడా అంగీకరించి ఆరు నెలల పాటు ఉచితంగా నిర్వహించుకునేలా ఆదేశాలు ఇవ్వటం అనేక విమర్శలకు దారి తీసింది.

ఏడాదికి రూ.3 కోట్లు తక్కువ కాకుండా ఆదాయం

రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద దేవస్థానం కావటంతో ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, కోస్తా, రాయలసీమ, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనం కోసం భక్తులు వస్తుంటారు. తెలంగాణ, తమిళనాడు నుంచి వచ్చే భక్తుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. శుక్ర, శని, ఆదివారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. టోల్‌గేట్ మీదుగా కానీ, పార్కింగ్ ప్రాంతాలకు కానీ ఆ రోజుల్లో కనిష్టంగా 2,500 ద్విచక్రవాహనాలు, 1500 కార్లు తగ్గకుండా వస్తాయన్నది లెక్కగా ఉంది. సాధారణ రోజులైన సోమ,మంగళ,బుధవారాల్లో ద్విచక్రవాహనాలు 1,500, కార్లు వెయ్యి వరకు వస్తాయి. కారుకు రూ.50, ద్విచక్ర వాహనానికి రూ.10 చొప్పున వసూలు చేయటానికి అనుమతి ఉంది. ఈ లెక్కన చూస్తే సంవత్సరానికి రూ. 3 కోట్లకు తక్కువగా వచ్చే ప్రసక్తే లేదు. రెండేళ్లకు రూ.6 కోట వరకు ఆదాయం రావటానికి అవకాశం ఉంటుంది.

కోర్టుకెళ్లి మరీ మరో రెండేళ్ల పొడిగింపు

ఈ కాంట్రాక్టులో తనకు నష్టం వస్తుందని సదరు కాంట్రాక్టు సంస్థ 2024లో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మరో రెండేళ్లు పొడిగించాల్సిందిగా కోరటంతో సింగిల్ జడ్జితో కూడిన ధర్మాసనం కాంట్రాక్టు సంస్థకు మరో రెండేళ్లు పొడిగించాలన్న ఆదేశాలను ఇచ్చింది.

ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించిన అధికారులు

సింగిల్ జడ్జితో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కాంట్రాక్టు సంస్థ తీరుపైనా, దేవస్థాన అధికారులపైన పెద్ద ఎత్తున విమర్శలు రావటంతో దేవస్థాన అధికారులు ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించారు. రెండేళ్ల పాటు ఉచితంగా పొడిగింపు ఇస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు వల్ల తాము నష్టపోతామని అభ్యర్థించారు. దీనిపై ద్విసభ్య ధర్మాసనం స్టే ఇచ్చింది.

కోర్టు స్టే ఇచ్చినా.. తదుపరి చర్యలు శూన్యం

కాంట్రాక్టు సంస్థపై కోర్టుకు వెళ్లిన దేవస్థాన అధికారులు ఆ తర్వాత కోర్టు ఇచ్చిన స్టేను మాత్రం పట్టించుకోకుండా వదిలేశారు. కోర్టు ఇచ్చిన స్టే ప్రకారం చూస్తే.. యథాతథ పరిస్థితి కొనసాగాలి. ఈ నెలాఖరుతో కాంట్రాక్టు సంస్థ గడువు ముగిసే నేపథ్యంలో ముందుగానే టెండర్ల ప్రక్రియను సిద్ధం చేసుకుని టెండర్లు పిలవాల్సిన అధికారులు ఆ పని చేయటం లేదు. దీంతో కాంట్రాక్టు సంస్థతో అధికారులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నష్టాలు సాకు చూపే సంస్థకు అన్నదానం కాంట్రాక్టు!

టోల్‌గేట్, పార్కింగ్ స్టాండ్ నిర్వహణ వల్ల నష్టం వస్తుందంటూ దుర్గగుడి అధికారులకు బొమ్మ చూపిన కాంట్రాక్టు సంస్థకు దేవస్థాన అధికారులు రెడ్ కార్పెట్ పరిచారు. ఏకంగా అన్నదానం కాంట్రాక్టునే ఆ సంస్థకు అప్పగించారు. ఒక కాంట్రాక్టు విషయంలో, డబ్బులు చెల్లింపుల విషయంలో తీవ్రంగా ఇబ్బందులు పెట్టి, కోర్టు గడప వరకు వెళ్లిన కాంట్రాక్టు సంస్థపై ఇంత ప్రేమ ఏమిటో అర్థం కాకుండా ఉంది.

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు ఆప్షన్ కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో వివిధ పీహెచ్‌సీ, యూహెచ్‌సీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు మంగళవారం రాత్రి రీ డిప్లాయ్‌మెంట్ కింద ఆప్షన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు నిర్వహించవలసిన ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ రాత్రి 9.15కు ప్రారంభమైంది. కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న 73 మంది, ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న 24 మందితో పాటు ఎన్టీఆర్ జిల్లాలో పనిచేస్తున్న 67మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను మలేరియా, డెంగ్యూ ఫీవర్ అధికంగా ఉండే ప్రాంతాలకు నియామకాలు జరిగాయి. కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ఒక్కొక్క పీహెచ్‌సీకి ఒక్కొక్క మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్‌ను నియమించారు. అయితే అధిక జనాభా గల ఎన్టీఆర్ జిల్లాలో నగరంలోని హాట్ స్పాట్‌లకు ఆప్షన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. 5వేల నుంచి 20 వేల వరకు జనాభా ఉండే ప్రాంతాలకు డిప్యూట్ చేశారు. 4 సచివాలయాలకు ఒక్కొక్కరిని నియమించారు. కాగా ఖాళీల జాబితాలపై ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్టీఆర్ జిల్లాలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు ఆందోళన చేశారు. ఆందోళన అనంతరం డీఎంహెచ్‌వో శర్మిష్టతో రెండు పర్యాయాలు చర్చలకు దిగారు. స్పౌజ్ కేటగిరి, అనారోగ్యంతో బాధపడే వారి కేటగిరిల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, రాత్రి 9.15 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. కౌన్సెలింగ్‌లో డీఎంహెచ్‌వోతో పాటు కృష్ణాజిల్లా డీఎంవో బి.రామారావు, ఏలూరు జిల్లా డీఎంవో పి.ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా డీఎంవో మోతిబాబులు పాల్గొన్నారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు వారు కోరుకున్న స్థానాల్లో నియామకాలు జరిపారు.



ఆయిల్ ఇంజన్లతో నీటిని తోడి పోస్తున్న దృశ్యం

అవరోధాలను అధిగమిస్తూ..

(3వ పేజీ తరువాయి)

జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. సుమారు పక్షం రోజుల నుంచి పనులు కొనసాగుతుండగా వరుణుడు రోజు మార్చి రోజు పనులకు అవరోధంగా నిలుస్తున్నాడు. అయినా పనులు ఏమాత్రం ఆపకుండా యంత్రాల సాయంతో ముందుకు కొనసాగిస్తున్నారు. రానున్న వర్షాకాలం సీజన్‌లో బుడమేరు వరదలు వచ్చినా విజయవాడ పల్లపు ప్రాంతాలు ఏమాత్రం ముంపు బారిన పడకుండా చూడాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ పనులపై పూర్తి శ్రద్ధ నిలిపింది. దీంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని జలవనరులశాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ అప్పారెడ్డి, ఏఈ కౌశిక్‌లు తెలిపారు.



ముమ్మరంగా సాగుతున్న పనులు

16 ఏళ్లకే ఎవరెస్ట్ ఎక్కిన విశ్వనాథ్ కార్తికేయ పడకంటి

- ప్రపంచంలోనే ఎత్తయిన 7 శిఖరాలు ఎక్కిన హైదరాబాదీ
- 7 సమ్మిట్ అడ్వెంచర్ పూర్తి చేసిన తొలి భారతీయుడు



హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం మౌంట్ ఎవరెస్ట్‌ను హైదరాబాద్‌కు చెందిన విశ్వనాథ్ కార్తికేయ పడకంటి అనే యువకుడు 16 ఏళ్లకే అధిరోహించాడు. దీంతో ప్రపంచంలోని 7 ఖండాల్లో అత్యంత ఎత్తయిన ఏడు శిఖరాలను అధిరోహించి 7 సమ్మిట్ అడ్వెంచర్‌ను పూర్తి చేశాడు. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన రెండో పిన్న వయస్కుడిగా, తొలి భారతీయునిగా విశ్వనాథ్ చరిత్ర సృష్టించాడు.

సౌదీలో ఆదోని మహిళ ఇక్కట్లు

- ఆదుకున్న 'సాటా' అధ్యక్షుడు తేజ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



కర్నూలు మహిళ ఆశాబీతో సాటా అధ్యక్షుడు తేజ

కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన 51 ఏళ్ల షేక్ ఆశాబీ ఒక ఏజెంట్‌ను నమ్మి సందర్శక వీసాపై ఏడాది క్రితం సౌదీ అరేబియాకు వచ్చింది. ఒప్పందం ప్రకారం ఉద్యోగ కాలపరిమితి ముగియగానే ఆమె స్వదేశానికి వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. వీసా గడువు ముగియడంతో సిబ్బంది ఆమెను వెనక్కి పంపించారు. దిక్కు తోచని పరిస్థితిలో ఉన్న ఆశాబీను గుర్తించిన కొందరు భారతీయులు తెలుగు ప్రవాసీ సంఘం 'సాటా' అధ్యక్షుడు పల్లెం తేజకు వివరించారు. స్పందించిన ఆయన ఆశాబీకి ఆశ్రయం కల్పించారు. వీసా ఉల్లంఘన జరిమాన చెల్లించి స్వదేశానికి పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కువైత్ అగ్ని ప్రమాదంలో మరణించిన ఆంధ్రులకు అందిన బీమా సొమ్ము

కువైత్‌లో గత ఏడాది జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన ముగ్గురు ప్రవాసాంధ్రుల కుటుంబాలతో పాటు మరో 46 ప్రవాసీ కుటుంబాలకు బీమా రూపంలో భారీ ఆర్థిక సాయం అందింది. గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం కింద సంబంధిత కంపెనీ ఈ బీమా సొమ్ము.. నాలుగేళ్ల పూర్తి వేతనాన్ని సోమవారం కువైత్‌లోని మృతుల కుటుంబాలకు చెల్లించింది. బాధితుల కుటుంబాలు ఒక్కొక్కరికీ రూ.12 లక్షలు కువైత్ ప్రభుత్వం ఇప్పటికే చెల్లించింది. మృతులలో శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలానికి చెందిన తామాడ లోకనాథం, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం సత్యనారాయణ, మీసాల ఈశ్వరుడు ఉన్నారు.

యూనియన్లదే హవా!

- నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు
- వ్యవసాయ శాఖలో తీవ్ర గందరగోళం

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ బదిలీల్లో యూనియన్లకే ప్రాధాన్యం దక్కిందని, ప్రభుత్వ మార్గదర్శకాలకు పట్టించుకోలేదని విమర్శలొస్తున్నాయి. నాలుగు జోన్లలో ఏఈవోలు, ఏవోలు, ఏడీఏల బదిలీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఈ బదిలీల్లో కౌన్సెలింగ్ కమిటీలు ఇష్టమొచ్చినట్లు పోస్టులు కేటాయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యోగుల అసోసియేషన్‌లో ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్‌లతోపాటు మరో ముగ్గురికే ఇవ్వాల్సిన రిటెన్షన్‌లు ఇతర ఆఫీస్ బేరర్స్‌కూ ఇచ్చారు. పైగా ఒక వర్గానికి చెందినవారికే ఈ అవకాశం లభించిందని అంటున్నారు. వాస్తవంగా ఉద్యోగ సంఘాల్లో ప్రైమ్ బాడీగా ఉండే ఆరుగురు ఆఫీస్ బేరర్స్‌కు 9ఏళ్లపాటు ఎక్కడివారు అక్కడే (రిటెన్షన్) ఉండే అవకాశం ఉండగా, కార్యవర్గంలో కొందరు ఇతర పదవులు చూపి, ఐదేళ్లు దాటినా రిటెన్షన్ కోరుకుంటే.. కౌన్సెలింగ్ కమిటీలు ఆమోదం తెలిపాయి. ఉపాధ్యక్ష, ఉపకార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, మహిళా సంఘం వంటి పదవులు చూపుతూ కొందరు బదిలీ కాకుండా చూసుకున్నారు. చాలా జిల్లాల్లో ఆఫీస్ బేరర్‌గా ఉన్నారా? అని కౌన్సెలింగ్ కమిటీలు ముందుగానే ఉద్యోగులను అడిగి, వారికి ఐదేళ్లు దాటినా రిటెన్షన్ ఇచ్చారని చెబుతున్నారు. కానీ ఒక స్టేషన్‌లో ఐదేళ్లు పూర్తైన ఉద్యోగి మరోచోట పోస్టింగ్ కోరుకుంటే.... అక్కడ ఖాళీ లేదు, ఇక్కడ భర్తీ అయిపోయింది, మరోచోటికి వెళ్లండి.. అంటూ కమిటీనే బదిలీలు చేసేందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. గుంటూరు జిల్లాలో ఐదేళ్లు దాటినా.. ఆఫీస్ బేరర్స్‌గా ప్రాధాన్యం ఇచ్చి, బదిలీలకు అర్హులైన ఉద్యోగులకు అన్యాయం చేశారని, అభ్యర్థన పెట్టుకోకపోయినా.. సిఫారసు లేఖలతో బదిలీలు చేసేశారని చెప్తున్నారు. గుంటూరు జిల్లాలో సాయిల్ టెస్టింగ్ ల్యాబ్, పెస్టిసైడ్స్ కంట్రోల్ ల్యాబ్, బయోలాజికల్ కంట్రోల్ ల్యాబ్, ఫర్టిలైజర్ కంట్రోల్ ల్యాబ్ ఉన్నాయి. వీటిలో 20మంది ఏవోలు ఉండగా, ఐదేళ్లు దాటిన వారిని స్టేషన్ సీనియారిటీ కింద చూడకుండా, వారిలో కొందరికి ఫ్రీజోన్‌గా చూపిన గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో పోస్టులు కేటాయిస్తున్నారు. కొన్నిచోట్ల రెండు మూడు అసోసియేషన్లు ఉన్నట్టు చూపి, వారికి కూడా ప్రాధాన్యం ఇచ్చారని విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో ఒక్కో జిల్లాకు ప్రైమ్ బాడీ కింద ఆరుగురికి రిటెన్షన్ అవకాశం ఉండగా, జోన్-2(ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాలు)లో 18మందికి అవకాశం వస్తుంది. కానీ ఈ జోన్ 7 జిల్లాలు కావడంతో.. 42మందికి రిటెన్షన్ అవకాశం ఉండగా, ఈ జోన్‌లో 300మంది బదిలీలకు అవకాశం ఉంది. కానీ ఈ జోన్‌లో రెండు అసోసియేషన్లు ఉండటంతో, మూడింట ఒక వంతు పోస్టులు ఆఫీస్ బేరర్స్ కింద రిటెన్షన్‌కే పోయాయి. దీనివల్ల ఇతర ఉద్యోగులకు బదిలీ, కోరుకున్న పోస్టు రాకుండా పోతోందన్న వాదన ఉంది.

మూడేళ్లు దాటితే బదిలీ తప్పనిసరి!

- రెండేళ్లు సర్వీస్ దాటితేనే ట్రాన్స్‌ఫర్లకు అర్హత
- ఆరోగ్యశాఖ ప్రతిపాదనలకు సీఎం ఆమోదం

అమరావతి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ విధానాల ప్రకారం ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలన్న నిబంధనను సడలిస్తూ, ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన పాలనా సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆరోగ్యశాఖ నిర్ణయించింది. అలాగే, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి మాత్రమే బదిలీలకు అర్హత కల్పించింది. ఆర్థిక శాఖ విధానాల ప్రకారం సర్వీసు కాలంతో సంబంధం లేకుండా ఎవరైనా బదిలీ కోరవచ్చు. కానీ ప్రత్యేక అవసరాల మేరకు ఆరోగ్యశాఖ ఈ రెండేళ్ల కనీస సర్వీసు నిబంధన తీసుకుంది. ఈ మేరకు ఆరోగ్యశాఖ పరిధిలో ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను సీఎం చంద్రబాబు ఆమోదించారు. క్షేత్రస్థాయిలో రీజనల్ డైరెక్టర్లు, డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌ఎస్‌ల కార్యాలయాలతో పాటు ప్రిన్సిపాళ్లు, ఆసుపత్రుల సూపరింటెండెంట్ల కార్యాలయాల్లో సంవత్సరాలుగా పని చేస్తున్న కిందస్థాయి పాలనా సిబ్బందిపై పలు అవినీతి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీన్ని అరికట్టడానికి ఆరోగ్యశాఖ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. కాగా, డీఎంఈ పరిధిలో ఉండే ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు ఉన్న ఖాళీలనే ప్రకటించి బదిలీల్లో వాటిని భర్తీ చేస్తారు. 20 రోజుల్లోగా బదిలీల ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వివిధ ఉద్యోగ సంఘాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న సిబ్బందిని అదే స్టేషన్లోనే వేరొక కార్యాలయానికి బదిలీ చేయనున్నారు.

88 కరువు మండలాల్లో తాగునీటికి 32 కోట్లు

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో తాగునీటి సరఫరా కోసం విపత్తు నిర్వహణ పద్దు కింద నిధులు విడుదల చేసింది. 88 మండలాల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి అవసరమైన తక్షణమే చర్యలు చేపట్టడానికి రూ.32.39 కోట్లు విడుదల చేస్తూ విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద 1.55 లక్షల పంటకుంటలను తవ్వించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 50 వేల పంటకుంటలను తవ్వినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది.

యోగాంధ్రాలో ఉపాధి శ్రామికులు

రాష్ట్రంలోని ఉపాధి శ్రామికులకు యోగాపై అవగాహన కల్పించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ శాఖ నుంచి కనీసం 20 లక్షల మందికి యోగాపై శిక్షణ అందించాలని నిర్ణయించారు.

పీఎంశ్రీకి 80 పాఠశాలలు ఎంపిక

పీఎంశ్రీ పథకానికి రాష్ట్రంలో మరో 80 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో 855 పాఠశాలలు పీఎంశ్రీ పథకంలో ఉన్నాయి.

మధ్యాహ్న భోజనంలో జూన్ నుంచి సన్నబియ్యం

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు జూన్ నుంచి మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం ప్రవేశపెడుతున్నట్లు సమగ్రశిక్ష స్టేట్ పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు.

కేంద్ర సర్వీసుల్లోకి హరినారాయణ 'తాగునీరు, పరిశుద్ధ్యం' డైరెక్టర్‌గా నియామకం

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ స్టాఫింగ్ స్కీమ్ కింద ఉన్న డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ డైరెక్టర్‌గా హరినారాయణ మురుగన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు డీవోపీటీ డైరెక్టర్ పల్లవీ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

2 నెలల తర్వాత కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు

- మాజీ మంత్రి కొడాలి ఆరోగ్యంపై ప్రకటన

గుడివాడ, మే 27(ఆంధ్రజ్యోతి): 'రెండు నెలలు ఆగండి. వైసీపీ పార్టీ శ్రేణులకు, అభిమానులకు కొడాలి నాని అందుబాటులో ఉంటారు' అని మాజీ మంత్రి ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన చేశారు.

'వ్యవసాయ' బదిలీల్లో ఉన్నతాధికారి అత్యుత్సాహం

అనంతపురం అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో వేరే జిల్లాకు చెందిన ఉన్నతాధికారి జోక్యం చేసుకోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. కౌన్సెలింగ్‌కు వెళ్లిన ఉద్యోగులు.. ఎవరు ఏ స్థానం కోరుకున్నా, 'అక్కడెందుకు నీకు? వేరేచోటుకు వెళ్లొచ్చుకదా..?' అని ప్రశ్నలు వేస్తూ బదిలీ ప్రక్రియకు ఆటంకం కలిగించారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని బాధిత ఉద్యోగులు కోరుతున్నారు.

జస్టిస్ బట్టు దేవానంద్ తిరిగి ఏపీ హైకోర్టుకు



అమరావతి, న్యూఢిల్లీ, మే 27(ఆంధ్రజ్యోతి): జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీం కోర్టు కొలీజియం నిర్ణయించింది. ఈ నెల 26న సమావేశమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం జస్టిస్ దేవానంద్‌ను మద్రాస్ హైకోర్టు నుంచి మళ్లీ ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీనికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. జస్టిస్ బట్టు దేవానంద్ 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2023 మార్చిలో ఇక్కడి నుంచి మద్రాసు హైకోర్టుకు బదిలీ అయ్యారు.

అమరావతిలో కొత్త సాంకేతికతల సర్టిఫికేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి నాదెండ్ల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మే 27(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఎమర్జింగ్ టెక్నాలజీస్ (కొత్తగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికలు) కోసం ఒక సర్టిఫికేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రజాపంపిణీ, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరామని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తమ విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అధ్యక్షతన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) గవర్నింగ్ కౌన్సిల్ 9వ సమావేశం జరిగింది. అనంతరం మనోహర్ మీడియాతో మాట్లాడుతూ గుంటూరులో మత్స్య, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విస్తరించి, ఫుడ్ కంట్రోలింగ్ ల్యాబ్ పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర మంత్రిని కోరామని తెలిపారు.

మహిళల భద్రతకు 'శక్తి' వాట్సాప్

- 79934 85111 విడుదల చేసిన డీజీపీ



శక్తి వాట్సాప్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, చిన్నారుల భద్రత కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం.. 'శక్తి' యాప్ ద్వారా కోటిన్నర మందికి దగ్గరైన పోలీసు సేవలు ఇకపై వాట్సాప్ ద్వారా అందించబోతున్నాం. ఏ మహిళకు ఇబ్బంది వచ్చినా 79934 85111లో సంప్రదిస్తే చాలు.. వెంటనే పోలీసులు పరిష్కరిస్తారు' అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా భరోసా ఇచ్చారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం ఈ నంబర్ ప్రారంభించిన డీజీపీ గుప్తా మాట్లాడుతూ.. 'మహిళలు, చిన్నారుల జోలికి వస్తే జాగ్రత్త..' అంటూ హెచ్చరించారు.

జపాన్‌తో కాదు.. చైనాతో పోటీ పడండి: రామకృష్ణ

కర్నూలు న్యూ సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధాని మోదీ భజన చేస్తున్నారంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మంగళవారం కర్నూలులోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రపంచంలోని అనేక దేశాలతో పోల్చుకుంటే భారత్ ముందు ఉందని చంద్రబాబు, పవన్.. మోదీని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. జీడీపీలో జపాన్ కంటే ముందు ఉందని వారు చెప్పారు. మనం పోటీ పడాల్సింది జపాన్‌తో కాదని చైనాతో అని రామకృష్ణ అన్నారు.

మృతదేహాలను పోలీసులే దహనం చేయడం అమానుషం

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాల కాల్పుల్లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు ఇవ్వకుండా పోలీసులే దహనం చేయడం అమానుషమని రామకృష్ణ అన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని, ఈ ఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.



మహా సంబరంలో మన నాయకులు

కడపలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో పాల్గొన్న విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, అనుచరగణంతో వెళుతున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, గన్నవరం, పెడన ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, సభలో పాల్గొన్న గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, మహానాడులో పాల్గొనేందుకు విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి వెళ్లిన మహిళలు, సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ




కడప మహానాడు భోజనశాలలో అంబికా క్యాటరర్స్ అధినేత కిలారి శివాజీతో పెనమలూరు నేతలు (కుడి నుంచి రెండో వ్యక్తి శివాజీ)


ఎన్ని లక్షల మందికైనా వండి వడ్డిస్తాం

- మహానాడులో పెనమలూరు క్యాటరర్ కిలారి శివాజీ

పెనమలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎన్ని లక్షల మంది మహానాడుకు వచ్చినా.. చివరి కార్యకర్తకు కూడా రుచికరమైన వంటకాలు వండి వడ్డిస్తామంటున్నారు.. పెనమలూరు అంబికా క్యాటరర్ యజమాని కిలారి శివాజీ. 15 రోజుల క్రితమే 1500 మంది సహాయకులతో మహానాడు ప్రాంగణానికి చేరుకొని వండి వడ్డించాల్సిన ప్రణాళికను, మెనూను సిద్ధం చేసుకున్నారు. మహానాడులో వంటకాలపై కిలారి శివాజీ ఏబీఎన్‌తో మాట్లాడుతూ ఏ మహానాడులోనూ లేని విధంగా కడప మహానాడులో రాయలసీమ వారికిష్టమైన మాంసాహార వంటకాలు వడ్డిస్తున్నాం. గోంగూరతో మటన్, చికెన్ కూరలు, దోస మటన్, ఉలవచారు చికెన్ లాంటి ఆంధ్రా స్టైల్ వంటకాలను అతిథులకు అందిస్తున్నామన్నారు. పెనమలూరులో అంబికా క్యాటరర్స్ ప్రారంభించిన తర్వాత ఏడోసారి మహానాడు భోజనశాలలో వంటకాలు చేస్తున్నామని గర్వంగా తెలిపారు. తమపై ఇంతటి బృహత్తర బాధ్యత పెట్టిన అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం మహానాడు భోజనశాలలో పెనమలూరు టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, తుమ్మల రాంకుమార్ అతిథులకు వడ్డించారు.

ఎన్టీఆర్‌కు కళా నీరాజనం





జగ్గయ్యపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్, చిత్రకారుడు శేఖర్ ఎన్టీఆర్ నటించిన చిత్రాల పేర్లతో ఎన్టీఆర్ చిత్రాన్ని గీశారు. అలాగే మామిడి పండుపై ఎన్టీఆర్ చిత్రాన్ని గీసి వినూత్నంగా నివాళులర్పించారు.

దద్దరిల్లిన కౌన్సిల్

మేమేమన్న దొంగలమా అంటూ వైసీపీ కౌన్సిలర్‌పై డీఈ అసహనం



కౌన్సిల్ సమావేశంలో వైసీపీ, కూటమి కౌన్సిలర్ల మధ్య వాగ్యుద్ధం, వారిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర

- సింగిల్ టెండర్లతో దోచేసున్నారన్న వైసీపీ
- అభివృద్ధి ఏమిటో త్వరలో చూస్తామంటూ చైర్మన్ చురకలు
- ఆదాయం పెంచిన కమిషనర్‌కు కౌన్సిల్ ప్రశంసలు

జగ్గయ్యపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): పేట మునిసిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడీగా జరిగింది. అధికారులపై కౌన్సిలర్లు, పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య వ్యంగాస్త్రాలు, విమర్శలతో కౌన్సిల్ సమావేశం దద్దరిల్లింది. అభివృద్ధి ఏమిటో త్వరలోనే చూస్తారంటూ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రతిపక్షానికి చురకలు అంటించారు. మంగళవారం జగ్గయ్యపేట పురపాలకసంఘ సమావేశం చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన ఏపీజే అబ్దుల్ కలాం కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగింది. అజెండాలోని 28 టెండర్లలో సింగిల్ టెండర్, ఒకే వ్యక్తివి ఆమోదం తెలపటంపై వైసీపీ కౌన్సిలర్ వట్టెం మనోహర్ నిలదీశారు. రూ.70 లక్షలు విలువైన ఈ పనుల్లో సింగిల్ టెండర్లు రావటమేంటని ప్రశ్నించారు. మునిసిపల్ డీఈఈ ఖలీం వివరణ ఇస్తూ టెండర్లలో అవినీతి లేదని, మరమ్మతులకు అవసరమైన సామగ్రికి బిల్లులు చెల్లిస్తామన్నారు. మునిసిపల్ సిబ్బందే రిపేర్లు చేసినపుడు అంత మొత్తం కాదని వట్టెం అభ్యంతరం తెలిపారు. మరమ్మతులు చేశాక ఇష్టం వచ్చిన బోర్‌ను చూసుకోవచ్చని, స్థానికులైన సిబ్బందితో పనిచే యిస్తున్నందున విచారించుకోవచ్చన్నారు. మేం కౌన్సిలర్లులా మాట్లాడలేమని, మేమేమన్న దొంగలామా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, చైర్మన్ రాఘవేంద్ర సర్దిచెప్పటంతో వివాదం ముగిసింది. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్స్ రూ.7కోట్లు, 15వ ఆర్థికసంఘం నిధులు రూ.కోటిన్నర, సీఆర్‌డీఏ గ్రాంట్ రూ.3కోట్లతో వచ్చే నెల రోజుల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. జనసేన కౌన్సిలర్ రాము మాట్లాడుతే తాను కౌన్సిలర్ అయి రెండున్నరేళ్లయిందని, ఇంతవరకు వార్డులో స్పీడు బ్రేకర్లు కూడా వేయించ లేకపోయానని ఈ పదవీ ఎందుకని ఆక్రోశం వెలిబుచ్చారు. అధికారులు తాము ప్రతిపాదించిన పనుల ఆమోదం కోసం కౌన్సిలర్లు కావాలని, కౌన్సిలర్లు కోరిన పనులు మాత్రం పట్టవని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ జోక్యం చేసుకుని స్పీడు బ్రేకర్లు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే వాటిని అమర్చాలని డీఈ ఖలీంను ఆదేశించారు.

డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుపై కౌన్సిల్ హర్షం


పేటలో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుపై టీడీపీ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి సమావేశంలో ప్రస్తావించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు చెబుతు కౌన్సిల్ సమావేశం తీర్మానించాలని కోరారు. అజెండాలో లేని అంశంపై తీర్మానం ఏమిటని ప్రతిపక్ష కౌన్సిలర్ వట్టెం అభ్యంతరం చెప్పగా, అభివృద్ధి చేయటం చేతకాదని, చేసేవారిని అభినందించటానికి ఇబ్బందేమిటని రామలక్ష్మి ప్రశ్నించారు. కమిషనర్‌గా వచ్చిన స్వల్పకాలంలో పురపాలకసంఘ ఆదాయం, పన్ను వసూళ్లలో అద్భుత పనితీరు కనబరిచిన కమిషనర్ రామ్మోహన్‌ను చైర్మన్, వైస్ చైర్మన్, ఇతర కౌన్సిలర్లు ప్రశంసలు కురిపించారు. 16వ ఆర్థికసంఘం తిరుపతిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న చైర్మన్ రాఘవేంద్రను కౌన్సిల్ అభినందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది చైర్మన్‌లో ఒకరిగా తనకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విలువైన సూచనలు, సలహాలిచ్చారని ప్రశంసించారు. చైర్మన్ రాఘవేంద్ర తాను చేసిన సూచనలతో 16వ ఆర్థికసంఘ నిధులు 50 శాతం పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మనమిత్రపై అవగాహన కల్పించండి: కలెక్టర్

కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యాప్ ఆధారిత డిజిటల్ వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర) ద్వారా ప్రజలకు 500పైగా సేవలందిస్తోందని, అందులో అందుబాటులోని పారిశ్రామిక సేవలపై పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక సంఘాలకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఈ సమావేశంలో పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులపై చర్చించారు. ఏప్రిల్ 1 నుంచి మే 26 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 824 దరఖాస్తులు స్వీకరించగా, 762 ఆమోదం పొందాయని అధికారులు వివరించగా, మిగిలిన వాటిని కూడా గడువుకు ముందే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మాట్లాడుతూ వేగవంతమైన పారిశ్రామిక వృద్ధి లక్ష్యంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, ఇన్‌చార్జి జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకట్రావు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో దెబ్బతిన్న రెవెన్యూ వ్యవస్థ

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



విజయవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): అనేక దశాబ్దాలుగా గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ అనేక రూపాంతరాలు చెందడంతో బాగా దెబ్బతిందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవోపై జీవో నెం.4 వారితో మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయ రేషనలైజేషన్లో భాగంగా గతంలో ఉన్న 15వేల గ్రామ, వార్డు సచివాలయాల స్థానంలో హేతుబద్ధీకరణలో 7,500 సచివాలయాలుగా మారుస్తూ ప్రభుత్వం జీవో తీసుకొచ్చిన విషయం తెలిసిందేనన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ప్రభుత్వ భూముల సంరక్షకులుగా, ఎలక్షన్ విధులు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే రెవెన్యూ ఉద్యోగులను తగ్గించడం వల్ల సకాలంలో రెవెన్యూ సేవలు ప్రజలకు అందవన్నారు. వీరిని ఆయా మండల తహసీల్దార్ ఆధీనంలో పనిచేసేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయశాఖ అధికారి కాటమనేని భాస్కర్‌కు లేఖ ఇచ్చారు. దీనికి భాస్కర్ సానుకూలంగా స్పందిస్తూ రెవెన్యూ, సర్వేయర్లను రెవెన్యూ శాఖలోనే కొనసాగిస్తామని హామీ ఇచ్చినట్టు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. కోన ఆంజనేయకుమార్, రామిశెట్టి వెంకటరాజేష్, జి.అనుపమ పాల్గొన్నారు.

వంశీ అనుచరుడు రంగా కోర్టుకు తరలింపు

హనుమాన్‌జంక్షన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్లపట్టాల పంపిణీ కేసులో రెండు రోజుల పాటు కస్టడీ తీసుకున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ముఖ్య అనుచరుడు ఓలుపల్లి రంగాను జంక్షన్ పోలీసులు మంగళవారం తిరిగి నూజివీడు కోర్టులో హాజరు పరిచారు. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో ఏ7 నిందితుడిగా విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రంగాను సోమవారం జంక్షన్ సీఐ సత్యనారాయణ మూర్తి కస్టడీకి తీసుకున్నారు. జంక్షన్‌లో 2019లో నమోదైన ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీతో పాటు 10మందిపై కేసు నమోదు చేశారు. అందులో గన్నవరానికి చెందిన జాస్తి ఫణిశేఖర్, కాట్రు శేషుకుమార్ పరారీలో ఉన్నారు. పెరికీడు గ్రామానికి చెందిన మరో నిందితుడు లావేటి నారాయణ మృతి చెందాడు. రెండు రోజుల పాటు సీఐ దాదాపు 30 ప్రశ్నలు సంధించినట్టు తెలిసింది. కొన్ని ప్రశ్నలకు తెలియదు, మరి కొన్ని ప్రశ్నలకు సంబంధం లేదని నిందితుడు చెప్పినట్టు సమాచారం. నిందితుడి తరుపు లాయర్ స్రవంతి, బాపులపాడు వీఆర్వో గాబ్రియేలు సమక్షంలో సీఐ విచారణ జరిపారు. అనంతరం కోర్టు ఆదేశాలు మేరకు రంగాను తిరిగి నూజివీడు సెకండ్ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో న్యాయమూర్తి ఎదుట జంక్షన్ ఎస్సై వి.సురేశ్ హాజరు పరిచారు. అనంతరం రంగాను విజయవాడ జైలుకు తరలించారు.

నిర్వాసితులకు పశ్చిమ ఏజెన్సీలో భూములు

» పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్

బుట్టాయగూడెం, మే 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన నిర్వాసితులుగా మారుతున్న చింతూరు ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల కోసం పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో భూముల సేకరిస్తున్నట్టు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ తెలిపారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం వచ్చిన ఆయన రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా పోలవరం ప్రాజెక్టు ఫేజ్-1(బి)లో 2022లో గోదావరికి వచ్చిన వరదల కారణంగా చింతూరు ఐటీడీఏ పరిధిలోని 32 గిరిజన గ్రామాలకు చెందిన 13,700 మంది నిర్వాసితులుగా మారారని తెలిపారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో 48 గ్రామాలు వరదల ప్రభావానికి గురికాగా 32 గ్రామాల ప్రజలను తరలిం చేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఆదేశాల మేరకు మంగళవారం బుట్టాయగూడెం మండలంలోని రెడ్డిగణపవరం ప్రాంతంలోని భూములను చూసుకోడానికి 38 మంది నిర్వాసితులు వచ్చినట్టు తెలిపారు. వ్యవసాయానికి అనుకూలమైన భూములనే నిర్వాసితులకు చూపుతు న్నామని, గిరిజనులు రాతపూర్వకంగా అంగీకరిస్తేనే కొనుగోలు చేస్తామన్నారు. రెవెన్యూ అధికారులు దగ్గరుండి నిర్వాసితులకు భూములను చూపిస్తారని ముఖాముఖిగా వారితో మాట్లాడి అంగీకారం తెలిపిన తరువాతే చర్యలు చేపడ తామన్నారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో భూములు కోల్పోతున్న గిరిజ నులం దరికీ రెండున్నర ఎకరాల భూమిని ఇవ్వనున్నట్టు తెలిపారు.

వానలే వానలు

నైరుతిపై ఐఎండీ తీపి కబురు

» దీర్ఘకాల సగటుకు 106 శాతం కురిసే అవకాశం
» దక్షిణ, మధ్య భారతాల్లో సాధారణం కంటే ఎక్కువ
» వాయవ్యంలో సాధారణ వర్షపాతం
» ఈశాన్య, తూర్పు భారతాల్లో తక్కువ
» జూన్‌లో ఊపందుకోనున్న వర్షాలు
» బంగాళాఖాతంలో అల్పపీడనం.. రాష్ట్రంలో నేడూ రేపు వర్షాలు
» దేశంలో తగ్గనున్న ఎండలు


అంతర్వేదిలో ముందుకు వచ్చిన సముద్రం

విశాఖపట్నం, మే 27(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవనున్నాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకూ నాలుగు నెలల సీజన్‌లో తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, ఈశాన్యలో ఎక్కువ ప్రాంతాలు, వాయవ్యంలో జమ్మూకశ్మీర్ మినహా దేశంలోని మిగిలిన అన్ని ప్రాంతాల్లో దీర్ఘకాల సగటుకు 106 శాతం వర్షపాతం నమోదు కానుంది. ఈ మేరకు నైరుతి రుతుపవనాల సీజన్‌కు రెండో దశ అంచనా బులెటిన్‌ను భారత వాతావరణ శాఖ(ఐఎండీ) మంగళవారం విడుదల చేసింది. నాలుగు నెలల దీర్ఘకాలిక సగటు (1971 నుంచి 2020 వరకూ 87 సెం.మీ)లో ఈసారి 105 శాతం(నాలుగు శాతం అటుఇటుగా) నమోదవుతుంది. దేశంలో దక్షిణ, మధ్య భారతాల్లో దీర్ఘకాల సగటు కంటే 10 శాతం ఎక్కువ, వాయవ్య భారతంలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణంగా, జమ్మూకశ్మీర్, ఈశాన్యంలోని అనేక రాష్ట్రాలు, తూర్పుభారతంలోని బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ (సగటు కంటే 94 శాతం కంటే తక్కువ)గా వర్షపాతం నమోదుకానుంది. తమిళనాడులో సాధారణం కంటే ఎక్కువ, కేరళ దక్షిణ ప్రాంతంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది.

అనేక ప్రాంతాలకు రుతుపవనాల విస్తరణ..

రుతుపవనాలు ప్రస్తుతం కేరళతోపాటు దక్షిణ భారతంలోని అనేక ప్రాంతాలకు విస్తరించాయి. ఈ నెలాఖరులోగా దక్షిణాదిలోని మిగిలిన ప్రాంతాలకు, తూర్పుభారతం వరకు విస్తరిస్తాయని వాతావరణ నిపుణులు అంచనావేశారు. ఈ నేపథ్యంలో జూన్ లో వర్షాలు ఊపందుకుంటాయని విశ్లేషిస్తున్నారు. జూన్‌లో దీర్ఘకాల సగటులో 108 శాతం వర్షపాతం నమోదుకానుందని ఐఎండీ తెలిపింది. దక్షిణ, వాయవ్య భారతంలో కొద్దిప్రాంతాలు, ఈశాన్య భారతంలో పలు ప్రాంతాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. దీనివల్ల ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని వ్యవసాయ శాఖ నిపుణులు వెల్లడించారు. జూన్‌లో వాయవ్య, తూర్పు భారతంలో అతి తక్కువ ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలినచోట్ల వడగాడ్పుల ప్రభావం ఉండబోదని ఐఎండీ తెలిపింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని, అందువల్ల ఎండల తీవ్రత తక్కువగా ఉంటుందని పేర్కొంది. జూలై నెలకు సంబంధించిన బులెటిన్‌ను జూన్ నెలాఖరున విడుదల చేస్తారు.

ఏపీలో మంచి వర్షాలు

ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. దీర్ఘకాలిక సగటులో కోస్తాలో 109 శాతం (601 మి.మీ.), రాయలసీమలో 112 శాతం(409 మి.మీ.) వర్షపాతం నమోదు కానుంది. జూన్‌లో కూడా సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ పేర్కొంది. రుతుపవనాలు ఈ ఏడాది నిర్ణీత సమయం కంటే ముందుగానే కొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించగా, మిగిలిన ప్రాంతాలకు వచ్చే రెండు, మూడు రోజుల్లో విస్తరిస్తాయి. దీంతో ఈ ఏడాది తొలకరి ముందుగానే ప్రారంభం కానుందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

ముగిసిన ఏపీఈఏపీసెట్

94.38 శాతం హాజరు

» నేడు ఇంజనీరింగ్ పరీక్షల ప్రాథమిక కీ విడుదల

జేఎన్టీయూకే, మే 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఏపీ, హైదరాబాద్‌లోని 145 కేంద్రాల్లో నిర్వహించిన ఏపీఈఏపీసెట్ మంగళవారం ప్రశాంతంగా ముగిసిందని సెట్ ఛైర్మన్, జేఎన్టీయూకే ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఇంజనీరింగ్ పరీక్షలకు 94.38 శాతం హాజరు నమోదైంది. అగ్రికల్చర్, ఫార్మసీకి అన్ని సెషన్లకు 92.21 శాతం మంది పరీక్షలు రాశారు. అగ్రికల్చర్, ఫార్మసీ ప్రాథమిక కీని మంగళవారం విడుదల చేశామని, విద్యార్థుల రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని సెట్ ఛైర్మన్ తెలిపారు. ప్రాథమిక కీపై ఈ నెల 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. ఇంజనీరింగ్ పరీక్షల ప్రాథమిక కీని బుధవారం ఉదయం విడుదల చేస్తామని, అభ్యంతరాలను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5గంటలలోపు తెలియజేయాలని సూచించారు. 25శాతం వెయిటేజీని ఇంటర్ మార్కుల ఆధారంగా తీసుకోనున్న నేపథ్యంలో ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, ఏపీవోఎస్ఎస్, ఎన్ఐవోఎస్, డిప్లొమా ఇతర బోర్డులకు చెందిన విద్యార్థులు మార్కులను ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదీలోపు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు.

హింసిస్తున్నారని పిల్లల ఫిర్యాదు

» తల్లి, మరో వ్యక్తికి మూడేళ్ల జైలు

కడియం, మే 27(ఆంధ్రజ్యోతి): తమను చిత్రహింసలకు గురిచేస్తున్నారని పిల్లలు ఇచ్చిన ఫిర్యాదుతో తల్లి, ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 7వ ఏజేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ పి.బాబు సోమవారం తీర్పునిచ్చినట్టు సీఐ ఎ.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన ఖండవిల్లి దాసు భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కృపావతితో సహజీవనం చేస్తున్నాడు. కృపావతికి భర్త లేడు. నాలుగు, ఐదో తరగతి చదువుతున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలిద్దరినీ దాసు, కృపావతి కలిసి శారీరకంగా చిత్రహింసలకు గురి చేసేవారు. దీంతో చిన్నారులిద్దరూ స్థానికుల సాయంతో 2021లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ఎస్ఐ ఎస్కే అమీనాబేగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి దాసు, కృపావతిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన సీఐ ఎ.వెంకటేశ్వరరావు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు, స్టేషన్ రైటర్ కె.సురేష్‌బాబును పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

10న విశాఖకు రాష్ట్రపతి

» గిరిజన విశ్వవిద్యాలయం

తొలి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు

విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చే నెల పదో తేదీన విశాఖపట్నం రానున్నారు. ఆర్కే బీచ్‌రోడ్డులో గల ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. పదో తేదీ ఉదయం 9.50 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టులో గౌరవ వందనం స్వీకరించిన తరువాత రాష్ట్రపతి 11.40 గంటలకు రోడ్ మార్గాన బయలుదేరి ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కన్వెన్షన్ సెంటర్ నుంచి బయలుదేరి 1.10 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని 1.20 గంటలకు ప్రత్యేక విమానంలో జార్ఖండ్ వెళతారు.

భువనేశ్వర్ విమాన సర్వీస్‌కు వీజీఎఫ్



విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య వచ్చే నెల 12వ తేదీ నుంచి కొత్త విమాన సర్వీస్ ప్రారంభం కానుంది. దీనిని ఇండిగో సంస్థ నడపనుంది. ఒకవేళ ఆక్యుపెన్సీ తక్కువగా ఉండి ఆ సంస్థకు ఏమైనా నష్టాలు వచ్చినట్టయితే 'వయబులిటీ గ్యాప్ ఫండింగ్' (వీజీఎఫ్) ద్వారా భర్తీ చేయడానికి ఒడిశా ప్రభుత్వం అంగీకరించింది. దీనికి కృషిచేసిన ఆ రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబును ఏపీ విమాన ప్రయాణికుల సంఘం (అపాటా) ప్రతినిధులు నరేశ్‌కుమార్, కాశీవిశ్వనాథరాజు, డీఎస్ వర్మ భువనేశ్వర్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విమాన సర్వీస్ ప్రతిరోజూ విశాఖపట్నానికి మధ్యాహ్నం 1.55 గంటలకు వచ్చి, తిరిగి 2.25 గంటలకు బయలుదేరి భువనేశ్వర్ వెళుతుంది. వారానికి నాలుగు రోజులు నడిచే అబుదాబి విమానం జూన్ 13 నుంచి ప్రారంభమవుతుందని, ఇది ఉదయం 8.20 గంటలకు విశాఖపట్నం వచ్చి, తిరిగి ఇక్కడి నుంచి 9.50 గంటలకు బయలుదేరుతుందని వారు తెలిపారు.

కాంగ్రెస్‌తో రాయబారం!



హస్తం గూటికి చేరేందుకు కవిత యత్నాలు

హైదరాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌కు లేఖాస్త్రం సంధించి ధిక్కార స్వరం వినిపించిన ఆయన తనయ కవిత కాంగ్రెస్ అధిష్ఠానంతో రాయబారం నడిపారా!? ఆ పార్టీలో చేరేందుకు ప్రయత్నం చేశారా!? ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ అధిష్ఠానం అందుకు 'నో' చెప్పిందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు! లేఖలు, లీకుల ద్వారా బీఆర్ఎస్‌లో కలకలం నెలకొన్న సమయంలోనే.. ఓ మధ్యవర్తి ద్వారా ఆమె కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సంప్రదించారని ఆ వర్గాలు వివరించాయి. ఇటీవల రెండు మూడు రోజులపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీలోనే మకాం వేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే, కవిత ప్రతిపాదనను అధిష్ఠానం వారిద్దరి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపాయి. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఆమెను చేర్చుకోవడం మంచిది కాదని వారిద్దరూ అభిప్రాయపడినట్లు వివరించాయి. పార్టీలో కవితను చేర్చుకుంటే కేసీఆర్ కుటుంబ కలహాలకు కాంగ్రెస్ కారణమన్న తప్పుడు సంకేతాలు వెళతాయని చెప్పినట్లు ఆ వర్గాలు వివరించాయి.

ఇదే అదనుగా..: బీఆర్ఎస్‌లో తాజా పరిణామాలను గమనిస్తున్న ఆ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలు 'చేయి' అందుకునేందుకు ముందుకు వస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కవిత లేఖ.. ఆ తర్వాత లీకులు బీఆర్ఎస్‌లో కలకలం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. కవితతో ఆ పార్టీ పెద్దలు జరిపిన రాయబారమూ విఫలమైంది. సొంతంగా అడుగులు వేసే దిశగా ఆమె ముందుకు సాగుతున్నారు. అదే సమయంలో, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించి కాళేశ్వరం కమిషన్ కేసీఆర్, హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసింది. విచారణకు ఇద్దరూ హాజరు కానున్నారు కూడా. ఇక, ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ విచారణ ముమ్మరమవుతోంది. ఈ కేసు కూడా బీఆర్ఎస్ పెద్దల మెడకు చుట్టుకోనుంది. ఎన్నికలు జరిగి ఏడాదిన్నర గడిచినా.. ఆ పార్టీ బలోపేతం కావడానికి బదులుగా నాయకత్వ రగడ నెలకొందని ఎమ్మెల్యేల్లో ఆందోళన నెలకొంది. పార్టీ పరిస్థితిని గమనించే కవిత సొంతంగా అడుగులు వేసేందుకు పావులు కదుపుతున్నారని, అదే బాటలో తాము కూడా ప్రత్యామ్నాయం చూసుకోవాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే, గతంలో అడుగు వెనక్కి వేసిన పలువురు ఎమ్మెల్యేలు ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ తలుపు తడుతున్నారని తెలుస్తోంది. నిజానికి, బీఆర్ఎస్‌కు ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేల్లో అత్యధికులు గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతం నుంచే ఉన్నారు. ఈ ఏడాది చివరికే జీహెచ్ఎంసీ ఎన్నికలు కూడా జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, కారు దిగి చేయి అందుకోవడానికి కూడా ఇదే సరైన సమయంగా సదరు ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. వాస్తవానికి రేవంత్ రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీసినప్పుడు పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పంచన చేరారు. అప్పట్లోనే, గ్రేటర్ సహా రాష్ట్రంలోని మరి కొందరు ఎమ్మెల్యేల చేరికకూ రంగం సిద్ధమైంది. కానీ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధిష్ఠానం ఆ ప్రక్రియను నిలిపేసింది. అయితే, తాజాగా, కేసీఆర్ కుటుంబంలో రేగిన చిచ్చుతో గందరగోళానికి గురవుతున్న ఎమ్మెల్యేలు ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌కు ఆకర్షితులవుతున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

లోకం తీరు



పాక్ గడ్డపైకి వెళ్లి.. తూటాల రుచి చూపించి..

» ఆపరేషన్ సిందూర్ వేళ సరిహద్దు దాటి బీఎస్ఎఫ్ దాడి

న్యూఢిల్లీ, మే 27: పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ కింద భారత్ తొలి దాడి చేసిన రోజు అది. ఇరుదేశాల మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. సరిహద్దుల వద్ద బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) కాపలా కాస్తోంది. కాస్త చీకటిపడగానే సియాల్‌కోట్ ప్రాంతంలో సుమారు 40-50 మంది ఉగ్రవాదుల గుంపు భారత్‌లోకి చొరబడేందుకు సరిహద్దుల వైపు వస్తున్నట్టు బీఎస్ఎఫ్ గుర్తించింది. వారు చొరబడేందుకు వీలుగా.. పాక్ దళాలు ఉన్నట్టుండి భారత సైనిక పోస్టులపై కాల్పులు జరపడం మొదలుపెట్టాయి. అప్పటికే అప్రమత్తంగా ఉన్న బీఎస్ఎఫ్ దళాలు.. పాక్ ఆర్మీ సాధారణ పోస్టులు, వ్యూహాత్మక (ఫార్వర్డ్) పోస్టులతోపాటు ఉగ్రవాదుల ల్యాంచ్‌ప్యాడ్‌లపై గుళ్ల వర్షం కురిపించాయి. పాకిస్థాన్ భూభాగంలో సుమారు 2.2 కిలోమీటర్ల లోపల ఉన్న అడ్డాలను ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో సరిహద్దులు దాటి వెళ్లి, పాక్ భూభాగంపైనా దాడి చేశాయి. ఈ ధాటికి తట్టుకోలేక పాక్ సైనికులు పారిపోయారు. బీఎస్ఎఫ్ జమ్మూ ఫ్రాంటియర్ ఐజీ శశాంక్ ఆనంద్ మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. పాక్‌లోని లూని, మస్త్‌పూర్, ఛబ్రా ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశామని తెలిపారు.

జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన?



న్యూఢిల్లీ, మే 27: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను పదవి నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్టు సమాచారం. ఈ మేరకు పార్లమెంట్ వానాకాల సమావేశాల్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో.. ఆయన నివాసంలో అగ్నిప్రమాదం జరిగి, భారీగా నోట్ల కట్టలు బయటపడి కలకలం రేగిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ముగ్గురు జడ్జీలతో ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరిపి... జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమేనంటూ నివేదిక ఇచ్చింది. మే 9న అప్పటి సుప్రీం చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా.. ఈ నివేదికను, జస్టిస్ యశ్వంత్‌వర్మను అభిశంసించి, పదవి నుంచి తొలగించాలన్న సిఫార్సును రాష్ట్రపతికి, ప్రధానికి పంపారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఇటీవలే సుప్రీం సీజే ప్రతిపాదనను రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్‌లకు పంపినట్టు సమాచారం.



ట్రైడెంట్ హోటల్లో మిస్ వరల్డ్ పోటీదారుల సందడి

మిస్ వరల్డ్ ఫైనల్స్... 3 గంటలు.. 3500 మంది ప్రేక్షకులు

» ప్రత్యేక ఆహ్వానితులుగా పారిశ్రామికవేత్తలు, బాలీవుడ్, టాలీవుడ్ ప్రముఖులు

హైదరాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఆతిథ్యమిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీలు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే నాలుగు ఖండాల నుంచి 40 దేశాల ప్రతినిధులను ఎంపిక చేసిన నిర్వాహకులు.. వచ్చే ఆదివారం సాయంత్రం జరగనున్న ఫైనల్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైటెక్స్‌లోని హాల్ నెంబర్-4లో ఈ కార్యక్రమం జరగనుందని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. అన్ని శాఖల మధ్య సమన్వయం కోసం హైటెక్స్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సాయంత్రం 6-30గంటలకు కార్యక్రమం ప్రారంభమై 9-20గంటలకు ముగుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవలం ప్రముఖులే కాకుండా సామాన్యులకు కూడా పాల్గొనే అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఇప్పటికే సూచించారు. రాష్ట్రంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలతోపాటు బాలీవుడ్, టాలీవుడ్ సినీ ప్రముఖులను ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా హాజరు కానున్నారు. తుది పోటీల ప్రత్యక్ష ప్రసారాలు సోనీ టీవీ 120 దేశాల్లో అందించనుందని తెలిపారు. తుది పోటీల్లో వ్యవహరించనున్న న్యాయ నిర్ణేతల వివరాలను మిస్ వరల్డ్ సంస్థ త్వరలో ప్రకటిస్తుందని వెల్లడించారు.

నాడు పటేల్ మాట వినుంటే.. ఉగ్రదాడులు జరిగేవే కాదు!

పీవోకేను స్వాధీనం చేసుకోవాలని చెప్పినా నాటి పాలకులు పట్టించుకోలే

» 1947లో దేశ విభజన నిర్ణయంతోనే పాక్ ఉగ్రవాదం పరంపర మొదలైంది

» గుజరాత్‌లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

గాంధీనగర్, మే 27: దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ మాట విని ఉంటే భారత్‌లో ఉగ్రదాడుల పరంపర కొనసాగేది కాదని ప్రధాని మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి 1947లో తీసుకున్న దేశ విభజన నిర్ణయమే కారణమని చెప్పారు. భారత మాతను 1947లో రెండు భాగాలుగా విభజించారని, అదే రోజు రాత్రి కశ్మీరులో ముజాహిదీన్‌లు తొలి ఉగ్రదాడికి పాల్పడ్డారని తెలిపారు.

ఆ ఉగ్రవాదుల సాయంతో పాకిస్థాన్ భారత భూభాగాన్ని కొంత మేర ఆక్రమించుకుందని గుర్తుచేశారు. పాకిస్థాన్ ఆక్రమించుకున్న కశ్మీరు (పీవోకే)ను తిరిగి తీసుకునే వరకూ భారత సైన్యాన్ని ఆపొద్దని సర్దార్ పటేల్ చెప్పారని.. అయినా అప్పటి పాలకులు ఆయన మాట వినలేదని మోదీ ఆరోపించారు. నాటి నుంచి వారు (పాకిస్థాన్, దానికి అండగా నిలుస్తున్న ఉగ్రవాదులు) రక్తం రుచి మరిగారని చెప్పారు. 75 ఏళ్లుగా ఆ ఉగ్రవాదం కొనసాగుతూనే ఉందన్నారు. తాజాగా పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రదాడి కూడా ఆ పరంపరలో భాగమేనని తెలిపారు. మూడుసార్లు జరిగిన యుద్ధాల్లో భారత బలగాలు పాక్‌ను చిత్తుగా ఓడించాయన్నారు. ఈ నేపథ్యంలోనే పాకిస్థాన్ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి, భారత్‌పై దాడులకు ఉసిగొల్పడం ద్వారా పరోక్ష యుద్ధానికి తెరతీసిందని ఆరోపించారు. ఉగ్రదాడులతో దేశంలో అమాయక పౌరులు, పర్యాటకులు, యాత్రికుల ప్రాణాలు తీస్తోందని ధ్వజమెత్తారు. ఉగ్రవాదం కేవలం పరోక్ష యుద్ధమే కాదని, పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగానే ఎంచుకున్న యుద్ధ వ్యూహమని చెప్పారు. దానికి సరైన రీతిలో భారత్ బదులిస్తుందన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గుజరాత్ వెళ్లిన ప్రధాని మోదీ.. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వసుధైక కుటుంబం అన్నది మన సంస్కారమని, పొరుగువారు కూడా సంతోషంగా ఉండాలనే కోరుకుంటామని చెప్పారు. మన సత్తాకు సవాలు విసిరితే ఊరుకునే ప్రసక్తే లేదని, భారత్ వీరుల గడ్డ అని తెలిపారు. కేవలం 22 నిమిషాల్లోనే 9 ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని, అది కూడా కెమెరా సాక్షిగా చేశామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా హతమైన ఉగ్రవాదులకు పాకిస్థాన్ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు చేసిందని, వారి శవపేటికలపై పాక్ జెండాను కప్పారని, పాక్ సైన్యం వారికి సెల్యూట్ చేసిందని మోదీ గుర్తుచేశారు. వారి తీరు ఇలాగే కొనసాగితే.. అదే రీతిలో తగిన బదులిస్తామని స్పష్టం చేశారు. కాగా, మంగళవారం మాజీ ప్రధాని నెహ్రూ వర్ధంతి సందర్భంగా మోదీ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మరోవైపు ప్రధాని మోదీపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. దేశ తొలి ప్రధాని నెహ్రూ వర్ధంతి రోజు కూడా ప్రధాని మోదీ ఆయనపై విమర్శలు మానుకోలేదని, సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే దేశ విభజన అంశాన్ని తెరపైకి తెచ్చిందని మండిపడింది.



పహల్గాంలో సైకిల్‌పైన పర్యటిస్తున్న కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

పహల్గాంలో జమ్మూ-కశ్మీర్ మంత్రివర్గ సమావేశం

జమ్మూ-కశ్మీర్ ప్రభుత్వం మంగళవారం పహల్గాంలో ప్రత్యేకంగా మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించింది. ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు ప్రభుత్వం భయపడబోదంటూ స్పష్టమైన సందేశం పంపడమే ఈ సమావేశం ఉద్దేశమని తెలిపింది. పహల్గాంలో పర్యాటక రంగం మునుపటిలాగానే కొనసాగుతోందన్న సందేశం పంపించడం కూడా ఈ సమావేశం నిర్వహణకు మరో కారణమని పేర్కొంది. ఇటీవల తాను ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసినప్పుడు జమ్మూ-కశ్మీర్‌లో పర్యాటక పరిశ్రమ పరిస్థితిని వివరించానని, ఆయన అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారని కశ్మీర్ సీఎం ఒమర్ ఈ సందర్భంగా తెలిపారు. పహల్గాంలో ఆయన మంగళవారం సైకిల్‌పై పర్యటించారు.

పోస్టు పెట్టినంత మాత్రాన విద్యార్థినిని అరెస్టు చేస్తారా?

» ఆమె జీవితాన్ని నాశనం చేస్తారా?

» మహారాష్ట్రపై బాంబే హైకోర్టు ఆగ్రహం

ముంబయి, మే 27: ఆపరేషన్ సిందూర్‌పై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పోస్టును ఫార్వర్డ్ చేసిన ఓ విద్యార్థినిని అరెస్టు చేసినందుకు మహారాష్ట్ర ప్రభుత్వంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పోస్టు పెట్టినంత మాత్రాన అరెస్టు చేస్తారా అని ప్రశ్నించింది. ఆమె జీవితాన్ని నాశనం చేస్తున్నారని ఆక్షేపించింది. పుణెలోని సిన్హగడ్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రెండో సంవత్సరం చదువుతున్న 19 ఏళ్ల విద్యార్థిని ఈ నెల ఏడో తేదీన ఆపరేషన్ సిందూర్‌పై ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఓ పోస్టును ఫార్వర్డ్ చేసింది. విమర్శలు రావడంతో రెండు గంటల వ్యవధిలోనే దాన్ని తొలగించింది. పోస్టు పెట్టినందుకు కళాశాలకు రావద్దంటూ యాజమాన్యం ఆమెను ఆదేశించింది. పోలీసు కేసు కూడా నమోదు కావడంతో అరెస్టు చేసి ఎరవాడ సెంట్రల్ జైలుకు పంపించారు. కాలేజీ నుంచి తనను పంపించివేయడంపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు.

బోర్డర్‌లో పోస్టుకు 'సిందూర్' పేరు

» కేంద్ర ప్రభుత్వానికి బీఎస్ఎఫ్ ప్రతిపాదన

న్యూఢిల్లీ, మే 27: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో.. భారత సైన్యం చూపిన తెగువకు గుర్తుగా సాంబా సెక్టార్‌లోని ఓ పోస్టుకు 'సిందూర్' అని పేరు పెట్టాలని బీఎస్ఎఫ్ ప్రతిపాదించింది. అలాగే మే 10న సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్‌తో జరిగిన పోరులో అమరులైన ఇద్దరు బీఎస్ఎఫ్ సిబ్బంది పేర్లను మరో రెండు పోస్టులకు పెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మే 10న పాకిస్థాన్ బీఎస్ఎఫ్ పోస్టులను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు చేయగా, బీఎస్ఎఫ్ ఎస్ఐ ఇంతియాజ్, కానిస్టేబుల్ దీపక్ అమరులయ్యారు.

హార్వర్డ్‌లో కీలక పదవుల్లో భారతీయులు

» వారిలో తెలుగు మూలాలున్న హిమబిందు



వాషింగ్టన్, మే 27: హార్వర్డ్‌పై ట్రంప్ నిర్ణయం మాట ఎలా ఉన్నప్పటికీ విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలకు భారతీయులు ఆధిపత్యం వహిస్తుండడం విశేషం. ముఖ్యంగా హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో ఇండియన్-అమెరికన్‌ల పాత్ర గణనీయంగా ఉంది. శ్రీకాంత్ ఎం దాతర్, నితిన్ నోహ్రియా, తరుణ్ ఖన్నా, భరత్ ఎస్ ఆనంద్, అమితాబ్ చంద్ర, పృథ్వీరాజ్ చౌదరి తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తుంటాయి. ఈ జాబితాలో తెలుగు మహిళ హిమబిందు లక్కరాజు కూడా ఉన్నారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నప్పటికీ ఇతర విభాగాలతోనూ ఆమెకు సంబంధం ఉంది. కంప్యూటర్ సైన్స్, డాటా సైన్స్ ఇనిషియేటివ్, సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ కంప్యుటేషన్ అండ్ సొసైటీ, లేబరేటరీ ఆఫ్ ఇన్నోవేషన్ సైన్స్ వంటి విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. ఏఐ4లైఫ్ అనే పరిశోధన విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. పోస్ట్ డాక్టరల్, గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మార్గదర్శనం చేస్తున్నారు. కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ రంగాల్లో స్టార్టప్‌లు పెట్టాలనుకునే వారికి సలహాలు ఇస్తుంటారు. కృత్రిమ మేధను సామాన్యులను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఆమె స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఎం.ఎస్, పీహెచ్‌డీ పట్టాలను అందుకున్నారు.

అమెరికా విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు బంద్!

» ప్రపంచ వ్యాప్తంగా తక్షణమే అమలులోకి

» విదేశీ విద్యార్థుల 'సోషల్' ఖాతాల తనిఖీకి త్వరలో కఠిన నిబంధనలు

» అప్పటిదాకా ఇంటర్వ్యూల నిలుపుదల

» ఇప్పటికే షెడ్యూల్ అయిన వారికి ఓకే

» క్లాసులు ఎగ్గొడితే.. వీసా రద్దు!

» విదేశీ విద్యార్థులకు అమెరికా హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 27: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలని వీసా కోసం దరఖాస్తు చేసుకున్న విదేశీ విద్యార్థులకు ట్రంప్ ప్రభుత్వం పెద్ద షాకిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థి(స్టూడెంట్) వీసా జారీ కోసం నిర్వహించే ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపి వేసింది. దీంతో భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని అమెరికా ఎంబసీలల్లోనూ విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు జరగవు. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాల తనిఖీలకు సంబంధించి కఠిన నిబంధనలను తీసుకొస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. స్టూడెంట్ వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేయాలని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని అమెరికా ఎంబసీలకు ఆదేశాలు పంపారు. ఇప్పటికే షెడ్యూల్ అయిన ఇంటర్వ్యూలకు ఈ ఆదేశాలు వర్తించవు. కానీ, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కొత్తగా విద్యార్థి లేదా ఎక్స్‌చేంజ్ విజిటర్(ఎఫ్, ఎం, జే) వీసా ఇంటర్వ్యూలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకూడదని స్పష్టం చేశారు. దీనిపై మరింత స్పష్టమైన ఆదేశాలు త్వరలో ఇస్తామని పేర్కొన్నారు. సోషల్ మీడియా ఖాతాల తనిఖీలకు సంబంధించి కఠిన నిబంధనలు అమలులోకి వస్తే అమెరికా విశ్వవిద్యాలయాల్లో విదేశీ విద్యార్థుల ప్రవేశం మరింత కష్టం కానుంది.

క్లాసులు ఎగ్గొడితే అంతే..!

అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు ట్రంప్ ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. తరగతులకు గైర్హాజరయ్యే వారి వీసా రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ఇలాంటి వారంతా భవిష్యత్తులో ఎలాంటి అమెరికా వీసా కోసమైనా దరఖాస్తు చేసుకోవడానికి అర్హతను కోల్పోతారని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం మంగళవారం ప్రకటించింది. 'డ్రాపౌట్ అయినా, తరగతులు ఎగ్గొట్టినా, విద్యాసంస్థకు సమాచారం ఇవ్వకుండా స్టడీ ప్రోగ్రామ్ నుంచి వెళ్లిపోయినా మీ విద్యార్థి వీసా రద్దు కావచ్చు. భవిష్యత్తులో అమెరికా వీసాలకు మీరు అర్హత కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సమస్యలను నివారించడానికి వీసా నిబంధనలకు అనుగుణంగా నడుచుకోండి. మీ విద్యార్థి వీసాను కొనసాగించుకోండి' అని ఆ ప్రకటనలో సూచించింది.



హార్వర్డ్‌పై విజయం సాధిస్తా

వాషింగ్టన్, మే 26: హార్వర్డ్ వర్సిటీపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధం ప్రకటించారు. ఈ యుద్ధంలో విజయం సాధిస్తామని కూడా ఆయన తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో సోమవారం ఆయన పోస్టు పెడుతూ "యూదు వ్యతిరేక హార్వర్డ్‌కు ఇచ్చే గ్రాంట్లలో మూడు బిలియన్ డాలర్ల మేర కోత విధించాలని అనుకుంటున్నాం. వాటిని దేశంలోని ఇతర ట్రేడ్ స్కూళ్లకు మళ్లిస్తాం" అని పేర్కొన్నారు. విదేశీ విద్యార్థులు చెల్లించే ట్యూషన్ ఫీజులే హార్వర్డ్‌కు పెద్ద ఆదాయ వనరు కావడంతో వాటిపైనా దృష్టి పెట్టారు. విదేశీ విద్యార్థుల జాబితా ఇవ్వాలని అడిగినట్టు తెలిపారు. "ఆ జాబితా వస్తే దేశంలోకి ఎంతమంది రాడికల్ పిచ్చోళ్లు, సమస్యలను సృష్టించే వారు వస్తున్నారో తెలుసుకోవచ్చు. బిలియన్ల కొద్దీ డాలర్లను ఇలాంటి పనికి మాలిన వారి కోసం ఖర్చు పెడుతున్నాం. అయినా భయం లేదు. ప్రభుత్వం విజయం సాధిస్తుంది" అని పేర్కొన్నారు. హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులు చేరకుండా ఆదేశాలు ఇచ్చినప్పటికీ న్యాయస్థానం దాన్ని సస్పెండ్ చేయడం గమనార్హం. ట్రంప్ నిర్ణయంతో భారతీయ విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

రాష్ట్రంలో పెరుగుతున్న కొవిడ్ కేసులు

» ఒకేరోజు నలుగురికి కరోనా..? నిలకడగా ఆరోగ్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో మంగళవారం ఒక్కరోజే నాలుగు కొవిడ్ పాజిటివ్ కేసులు వెలుగులోకి వచ్చాయి. ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరులో ఇద్దరికి, గుంటూరు జిల్లా తెనాలిలో ఒకరికి కొవిడ్ సోకినట్లు వైద్య ఆరోగ్య శాఖ నిర్ధారించింది. తణుకులో మరొకరు కరోనా లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు. నిర్ధారణ కావాల్సి ఉంది. ఈనెల 20న ఏలూరుకు చెందిన ఓ మహిళ (55) కరొనరీ యాంజియోప్లాస్టీ చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఆమె వెంట భర్త (63) కూడా ఉన్నారు. చికిత్స అనంతరం ఇంటికి వెళ్లిన ఆమె హఠాత్తుగా జ్వరం, జలుబు బారినపడ్డారు. దీంతో తిరిగి 24న విజయవాడలోని సదరు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఇద్దరికీ పరీక్ష చేయగా కొవిడ్ పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం భార్యాభర్తలు ఆసుపత్రిలోనే ఉన్నారు. వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. కాగా, గుంటూరు జిల్లా తెనాలి, కొత్తపేటలో కొవిడ్ తొలి కేసు నమోదైంది. ఎస్‌బీఐ రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వృద్ధుడి(83)కి కొవిడ్ పాజిటివ్ అని తేలడంతో తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. మున్సిపల్, ఆరోగ్య శాఖ అధికారులు కొత్తపేట ప్రాంతాన్ని సందర్శించి శానిటైజ్ చేశారు.

తణుకు పట్టణంలో కరోనా అంటూ ప్రచారం

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు శివారులో ఒక మహిళకు కరోనా సోకిందంటూ ప్రచారం జరిగింది. 'ఆ మహిళకు కొవిడ్ లక్షణాలు ఉండటంతో అనుమానంతో రాజమహేంద్రవరం పంపించాం. అక్కడ పరీక్షల ఫలితాలు వచ్చిన తరువాతే నిర్ధారణ చేయగలం. అన్ని ఆసుపత్రుల్లో ఆక్సిజన్ అందుబాటులో ఉంది. ఎవరూ భయపడవద్దు' అని జిల్లా వైద్యాధికారి గీతాబాయి పేర్కొన్నారు.

ఘొల్లుమన్న గోదారి లంక!

» స్నానానికి వెళ్లినవారు విగత జీవులుగా తేలారు

» ఏడుగురి మృతదేహాలు లభ్యం.. ఇంకా దొరకని ఒకరి ఆచూకీ

» కోనసీమ జిల్లా సలాదివారిపాలెం తీరంలో మిన్నంటిన రోదనలు

(కాకినాడ/అమలాపురం, ఆంధ్రజ్యోతి)

గోదావరి తీరం ఘొల్లుమంది. కన్నబిడ్డలను కోల్పోయిన తల్లుల కడుపు కోత వేదనలతో ఘోషించింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం పరిధిలోని సలాదివారిపాలెంవద్ద గోదారి పాయలో సోమవారం స్నానానికి వెళ్లి ఎనిమిది మంది యువకులు కొట్టుకుపోయిన ఘటనలో ఏడుగురి మృతదేహాలు మంగళవారం బయటపడ్డాయి. మృతులను వడ్డి మహేష్(14), సబ్బతి పాల్ అభిషేక్(18), ఎలిపే మహేష్(14), వై.సాయి మహేష్(18), కె.రోహిత్(18), తాతపూడి నితీష్(18), వడ్డి రాజేష్(14)గా గుర్తించారు. ముమ్మిడివరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

నీటిపై ఒత్తిడి తెచ్చి.. ఫలించిన ఎస్‌డీఆర్ఎఫ్ కృషి..

రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్, ఎస్పీని అప్రమత్తం చేయడంతో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను రంగంలోకి దించారు. అంతకుముందే మత్స్యకారులు, గజఈతగాళ్లను దించి గాలింపు చర్యలు చేపట్టారు. ఎ బోట్లలో జనరేటర్లను ఉంచి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఎంత అన్వేషించినా ఫలితం రాలేదు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో గతంలో తవ్వేసిన ఇసుక గోతుల్లో మృతదేహాలు చిక్కుకుపోయి ఉంటాయని అనుమానించి ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. రెండు స్పీడ్‌బోట్లతో చాలా వేగంగా గుండ్రంగా రౌండ్లు కొట్టడంతో నీటిపై ఒత్తిడి భారీగా పెరిగి అడుగు నుంచి ఒక్కో మృతదేహం బయటపడుతూ వచ్చింది.

మిన్నంటిన రోదనలు..

మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయానికి ఆరు మృతదేహాలు బయటపడగా వీటిని పోస్టుమార్టం కోసం ముమ్మిడివరం తరలించారు. అయితే, మిగిలిన మృతదేహాలు కూడా వచ్చిన తర్వాతే శవపంచనామా చేయాలని బంధువులు అడ్డుకున్నారు. మరోపక్క తమ బిడ్డలను మృతదేహాలుగా చూసి అక్కడికి వచ్చిన తల్లుల రోదనలకు అంతులేకుండా పోయింది. ముగ్గురి మృతదేహాలకు సంబంధించి ముఖాలను చేపలు తినేయడంతో చాలా వరకు తల ఎదుటి భాగం పాడైపోయి రక్తం కారుతూ కనిపించింది. ఇది చూసి పలువురు తల్లులు తమ చీరతో బిడ్డల ముఖాలను తుడిచిన ఘటన పలువురిని కంటతడి పెట్టించింది. కాకినాడకు చెందిన ఓ పాస్టర్ ఇద్దరు తనయులు గోదావరి ప్రమాద ఘటనలో గల్లంతవగా, వారిలో ఒకరి మృతదేహం బయటపడింది. దీంతో రెండో మృతదేహం లభించే వరకు పోస్టుమార్టం చేయవద్దని బంధువులు పట్టుబట్టారు. ఒకేసారి పోస్టుమార్టం చేయాల్సిన మృతదేహాలు పెరగడంతో ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రి పోస్టుమార్టం గది ఇరుకుగా మారింది. మృతదేహాల దుర్వాసన నేపథ్యంలో వీటిని బయటే ఉంచి కొబ్బరిచెట్ల చుట్టూ పరదాలు కట్టి శవపంచనామా పూర్తిచేశారు.



గోదావరిలో లభ్యమైన మృతదేహాలను బయటకు తీసుకువస్తున్న దృశ్యం

పశ్చిమ లంకలో మరో ఘోరం

» స్నానానికి దిగిన ముగ్గురు బాలురు గల్లంతు

» ఆచంట మండలం రావిలంక వద్ద ఘటన

» ముమ్మరంగా గాలింపు

ఆచంట, మే 27(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం అయోధ్యలంక శివారు రావిలంక వద్ద గోదావరిలో ముగ్గురు బాలురు గల్లంతయ్యారు. కోనసీమ జిల్లా గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన కేతా ప్రవీణ్(15), సానబోయిన సూర్యతేజ (12), నీతిపూడి పాల్‌కుమార్(15)తోపాటు మరో ఇద్దరు బాలురు మంగళవారం ఇక్కడ స్నానానికి దిగారు. వీరిలో ప్రవీణ్, సూర్యతేజ, పాల్ కుమార్ గల్లంతు కాగా మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. గన్నవరం, ఆచంట రెవెన్యూ, పోలీసు అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రవీణ్ పదో తరగతి పరీక్షలు రాశాడు. సూర్యతేజ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. పాల్ కుమార్ యలమంచిలి మండలం పెదలంక వాసి. వేసవి సెలవులు కావడంతో బంధువైన సూర్యతేజ ఇంటికి వచ్చాడు. ముగ్గురి కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కాకాణికి ప్రత్యేక సెల్.. కోర్టు అనుమతితో మార్పు

నెల్లూరు (క్రైం), మే 27(ఆంధ్రజ్యోతి): మైనింగ్ అక్రమాల కేసులో నెల్లూరు కేంద్రకారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మంగళవారం ప్రత్యేక సెల్‌కు మార్చారు. సోమవారం రాత్రి జైల్లోకి వెళ్లిన కాకాణిని ఒంటరిగా సాధారణ సెల్‌లో ఉంచారు. రూల్ 730 ప్రకారం భద్రత దృష్ట్యా కోర్టు అనుమతితో ఆయన్ను ప్రత్యేక సెల్‌కు మార్చారు. పడుకునేందుకు మంచం, పుస్తకాలను సమకూర్చారు.

కుట్రలో మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్లకూ పాత్ర

» టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 127వ నిందితుడిగా చేర్చిన సీఐడీ

గుంటూరు, మే 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికుట్రలో మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పాత్ర కూడా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆయన్ను ఈ కేసులో 127వ నిందితుడిగా చేర్చారు. టీడీపీ ఆఫీస్‌పై దాడికి వైసీపీ ముఖ్య నేతలు కుట్ర చేసినట్లు ఇప్పటికే తేలిన విషయం తెలిసిందే. కుట్రదారుల్లో సజ్జల రామకృష్ణారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, నందిగం సురేశ్, దేవినేని అవినాశ్, న్యాయవాది గవాస్కర్‌లతో పాటు మరికొందరు ఉన్నారు. ఆ జాబితాలో రామకృష్ణారెడ్డి చేరారు. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చాల్సి వస్తే ముందుగా నోటీస్ ఇచ్చి విచారించాలని ఆయన గతంలో కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో సీఐడీ అధికారులు ఆయన్ను 127వ నిందితుడిగా చేర్చారు. త్వరలోనే విచారణకు రావాలని నోటీసులు జారీ చేయనున్నారు. మరోవైపు కొందరు నిందితులు అరెస్ట్ నుంచి కోర్టు ద్వారా రక్షణ పొందిన నేపథ్యంలో వారందరికీ నోటీసులు జారీ చేయడంతో పాటు కేసు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు.

బెంగళూరుకు గాలి జనార్దన్‌రెడ్డి

» పీటీ వారెంట్‌పై హైదరాబాద్ నుంచి తరలింపు

హైదరాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాల కేసులో హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్న గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన అనుచరుడు అలీఖాన్‌లను పోలీసులు సోమవారం రాత్రి బెంగళూరుకు తరలించారు. కర్ణాటకలో పలు కేసుల విచారణ నేపథ్యంలో పీటీ వారెంట్‌పై అయనను పటిష్ఠ బందోబస్తు మధ్య తీసుకువెళ్లారు. అక్రమ మైనింగ్ ద్వారా కర్ణాటక ప్రభుత్వానికి రూ. 480 కోట్లు నష్టం కలిగించిన అసోసియేటెడ్ మైనింగ్ కంపెనీ కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు.

ఐపీఎస్ సంజయ్ సస్పెన్షన్ పొడిగింపు

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఐడీ మాజీ ఏడీజీ సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరో ఆర్నెళ్లు పొడిగించింది. ఎస్సీ, ఎస్టీల్లో బాధితులకు హక్కుల గురించి అవగాహన కల్పించేందుకు ఖర్చు చేయాల్సిన ప్రభుత్వ నిధులు స్వాహా చేశారనే అభియోగంపై ఏసీబీ గత డిసెంబరులో ఆయనపై కేసు నమోదు చేసింది. దీంతో ఆయన్ను సస్పెండ్ చేసిన ప్రభుత్వం దీనిపై ఇటీవల సమీక్షించింది. కేసు దర్యాప్తులో ఉన్నందున సస్పెన్షన్ ఎత్తేస్తే ఆటంకం కలుగుతుందంటూ ఏసీబీ అభిప్రాయపడింది. ఏకీభవించిన ప్రభుత్వం సంజయ్ సస్పెన్షన్‌ను నవంబరు 27వరకూ పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చింది.

గ్రూపు-1 కేసులో మరొకరికి సంకెళ్లు

» కామ్‌సైన్ మధు సహాయకుడు అరెస్టు.. హైదరాబాద్‌లో అదుపులోకి

విజయవాడ, మే 27(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో పోలీసులు రఘు అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన రఘు... కామ్‌సైన్ మీడియా సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌కు సహాయకుడిగా వ్యవహరిస్తున్నారు. హాయ్‌ల్యాండ్‌లో మాన్యువల్‌గా మూల్యాంకనం చేసినట్టుగా చూపించడానికి కొంతమంది వ్యక్తులను రఘు సరఫరా చేశారు. ఆక్కడ ఈ శిబిరం ప్రారంభమైన తర్వాత మధు అక్కడే బస చేసి మొత్తం ప్రక్రియను పరిశీలించేవారు. ఆయన హైదరాబాద్ వెళ్లిన సమయంలో ఆ బాధ్యతలను రఘు నిర్వహించేవారు. మధు తన వ్యవహారాలను చక్కబెట్టుకోవడానికి రఘుతో పాటు గణేశ్ అనే వ్యక్తిని, నందిగామకు చెందిన ఇద్దరిని నియమించుకున్నారు. ఎక్కువ బాధ్యతలను రఘుకు అప్పగించారు. గ్రూప్-1 పేపర్లను దిద్దినట్లు సంతకాలు చేసిన కూలీలు, వెల్డర్లు, బిల్డింగ్ వర్కర్లను గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి తరలించడంలో రఘు కీలకంగా వ్యవహరించారు.

మందకృష్ణకు పద్మశ్రీ

రాష్ట్రపతి చేతుల మీదుగా 68 మందికి పద్మ పురస్కారాల ప్రదానం.. ఏపీ నుంచి ఇద్దరికి..



రాష్ట్రపతి ముర్ము నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకుంటున్న వదిరాజ్ రాఘవేంద్రాచార్య, కేఎల్‌కృష్ణ, మందకృష్ణ

న్యూఢిల్లీ, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెలంగాణ నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రొఫెసర్ కేఎల్ కృష్ణ, ఆర్థిక శాస్త్రం, సంస్కృత పండితుడు వదిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి.. పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అందుకున్నారు. 2025కి గాను కేంద్ర ప్రభుత్వం 139 మందిని పద్మ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇందులో 7 పద్మ విభూషణ్, 11 పద్మభూషణ్, 113 పద్మశ్రీ ఉన్నాయి. తొలి విడతగా ఏప్రిల్ 28న నిర్వహించిన కార్యక్రమంలో డి.నాగేశ్వర్ రెడ్డి, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సహా 71 మంది పద్మ పురస్కారాలను అందుకున్నారు. మిగిలిన 68 మందికి మంగళవారం నిర్వహించిన రెండో విడత కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలను అందజేశారు. ముగ్గురికి పద్మవిభూషణ్, తొమ్మిది మందికి పద్మభూషణ్, 56 మందికి పద్మశ్రీ ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్ పద్మవిభూషణ్, ప్రముఖ సినీ నటి, భరతనాట్య కళాకారిణి శోభన, కన్నడ సినీ నటుడు అనంతనాగ్, విశ్వ హిందూ పరిషత్ మహిళా విభాగం దుర్గావాహిని వ్యవస్థాపక అధ్యక్షురాలు సాధ్వి రితంబర పద్మభూషణ్ అందుకున్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, బండి సంజయ్, అవార్డు గ్రహీతలు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణకు చెందిన సామాజిక కార్యకర్త, రాజకీయ నాయకుడైన మందకృష్ణ మాదిగ తన అవిశ్రాంత పోరాటంతో ఎస్సీ ఉపవర్గీకరణను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆమోదించడంలో కీలకపాత్ర పోషించారని అవార్డుతోపాటు అందజేసిన ప్రశంసాపత్రంలో రాష్ట్రపతి భవన్ పేర్కొంది.

రంగంలోకి ఈడీ

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధమవుతున్నాయి. మంగళవారం విజయవాడలోని 'సిట్' కార్యాలయంలో ఈ దిశగా కీలక ముందడుగు పడింది. సిట్ బృందంతో ఈడీ అధికారులు భేటీ అయ్యారు. ఈ కుంభకోణంలో ఆర్థిక లావాదేవీలు, అక్రమాలు జరిగిన తీరుపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. ముడుపులు సేకరించిన తీరు మొదలుకొని వాటిని మళ్లించిన దారుల వరకు సిట్ అధికారులు ఈడీకి వివరించారు. డిస్టిలరీస్ నుంచి తీసుకున్న కమీషన్లు ఏ రూపంలో ఎంత? ఏ కంపెనీ ఎవరెవరికి ఎంత చేర్చింది? అనే వివరాలు అందించారు. ప్రమోషనల్ గూడ్స్ రూపంలో హైదరాబాద్, ముంబై, ఢిల్లీలోని హవాలా ఆపరేటర్ల ద్వారా మనీలాండరింగ్ జరిగినట్లు నిర్ధారణకు వచ్చిన కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల అధికారులు ఉమ్మడి దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. ఇటీవల ముంబైలో సిట్ అధికారులకు ఈడీ అధికారులు సహకరించారు. అలాగే ముడుపులు చేరిన మార్గం, అంతిమ లబ్ధిదారుడి గుట్టు రట్టు చేసేందుకు ఇప్పుడు సహకరించనున్నారు. మొత్తం కుంభకోణం ఎలా జరిగిందనే దానిపై సిట్ ప్రత్యేక నోట్ సిద్ధం చేసింది. ఈ వివరాలను ఈడీ అధికారులతో పంచుకుంది. రియల్ ఎస్టేట్ లింకులతో పాటు బినామీల ద్వారా బెంగళూరులో కొనుగోలుచేసిన భారీ ఆస్తుల వివరాలతో కూడిన ఐదు లేయర్ల డేటాను ఈడీకి అందజేసింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ సిట్, ఈడీ అధికారులు చర్చించారు.

నేడు ఈడీ విచారణ

మద్యం స్కామ్‌లో కింగ్‌పిన్‌గా భావిస్తున్న ఏ-1 రాజ్ కసిరెడ్డితో పాటు ఇతర నిందితులు, మద్యం వ్యాపారులు, మాజీ అధికారులు సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ముడుపులు అంతిమంగా ఎవరికి చేరాయో తేలిపోయింది. అయితే ఇందుకు పక్కా ఆధారాలు సేకరించాల్సి ఉంది. రాజ్ కసిరెడ్డి ఏర్పాటు చేసుకున్న క్యాష్ హ్యాండర్లు సేకరించిన ముడుపులు ఎన్ని దశలు దాటి ఎవరికి చేరాయనే విషయం ఇటీవల అరెస్టు చేసిన ముగ్గురు కీలక వ్యక్తుల విచారణలో తేలింది. తాడేపల్లి ప్యాలెస్‌లో ఐదేళ్ల పాటు తిరుగులేని హవా నడిపించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను సిట్ విచారించింది. సిట్ సేకరించిన వివరాల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేయనుంది. 'అంతిమ లబ్ధిదారుడి' వేటలో భాగంగా రాజ్ కసిరెడ్డిని బుధవారం విజయవాడ జైలులో ఈడీ అధికారులు విచారించనున్నారు. ఇందుకోసం అధికారులు ప్రశ్నావళి సిద్ధం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో కింగ్‌పిన్ ఇచ్చే సమాచారం కీలకం కానుంది.

సజ్జల శ్రీధర్‌రెడ్డికి చుక్కెదురు

» లిక్కర్ కేసులో బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన కోర్టు

విజయవాడ, మే 27(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో సజ్జల శ్రీధర్‌రెడ్డికి ఏసీబీ కోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ మంగళవారం తీర్పు ఇచ్చింది. శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై వాదనలు పూర్తవ్వడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పు వెలువరించారు.

బెయిల్ మంజూరు చేయండి

» హైకోర్టును ఆశ్రయించిన వంశీ.. నూజివీడు కోర్టులోనూ పిటిషన్

అమరావతి/నూజివీడు టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): నకిలీ ఇళ్ల పట్టాల కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హైకోర్టులో మంగళవారం పిటిషన్ వేశారు. అనారోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకొని మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. వేసవి సెలవుల ప్రత్యేక బెంచ్‌లో వ్యాజ్యంపై గురువారం విచారణ జరుపుతామని న్యాయస్థానం స్పష్టం చేసింది. నూజివీడు సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టునూ వంశీ తరఫు లాయర్లు మరోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

భారత్‌పై పవిత్ర యుద్ధమే లక్ష్యం!

» రెచ్చగొట్టే మతోన్మాద భావాలతో ముస్లిం యువతకు సిరాజ్ ఎర

» విచారణలో విస్తుగొల్పే విషయాలు



సిరాజ్, సమీర్ (ఫైల్)

విజయగనరం, మే 27(ఆంధ్రజ్యోతి): 'ఘజ్వా-ఎ-హింద్ (భారత్‌పై పవిత్ర యుద్ధం) మన లక్ష్యం. ఒక్కటే ఉమ్మా (విశ్వాసం), ఒక్కటే సమాజం.. ఇదే మన ధ్యేయం..' అనే రెచ్చగొట్టే మతోన్మాద భావాల ద్వారా సిరాజ్ సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్, సిగ్నల్ యాప్‌ల ద్వారా అమాయక ముస్లిం యువతకు ఎర వేసే వాడని తెలిసింది. ఈ మేరకు ఐదో రోజు మంగళవారం కొనసాగిన ఎన్ఐఏ, ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్, పోలీసుల విచారణలో అతడు చెప్పినట్లు సమాచారం. సిరాజ్ పోస్టులు చూసిన కొంత మంది అరబ్ దేశాల్లోని ఉగ్రమూకలు, అమాయక ముస్లిం యువకులు అతడికి దగ్గరైనట్లు సమాచారం. ఘజ్వా-ఎ-హింద్ భావనకు తాను ఆకర్షితుడయ్యానని, ఇతరులను కూడా ఆ వైపు మళ్లించే దిశగా చేశానని సిరాజ్ చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు వందలాది మందితో ఒక గ్రూపును తయారు చేయాలనుకున్నాట! సిరాజ్ భాష, అతనిలో భారత్‌పై ఉన్న విద్వేషం అరబ్ దేశాల్లోని కొంతమందికి నచ్చటంతో ఆర్థిక సాయానికి ముందుకొచ్చినట్లు తెలిసింది. వీరిమధ్య ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయనే దానితో పాటు సిరాజ్, అతని కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాలపై అధికారులు దృష్టి సారించారు.

మన ఉత్పత్తులకు

గ్లోబల్ డిమాండ్ లక్ష్యం

» లెదర్ అండ్ ఫుట్‌వేర్ పాలసీ 4.0 విడుదల

» కొత్త ఎంఎస్ఎంఈ యూనిట్లకు 12 కోట్ల వరకు..

» విస్తరణ ప్రాజెక్టుకు 10 కోట్ల వరకు రాయితీ

» ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పలు ప్రోత్సాహకాలు

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తోలు, పాదరక్షల పరిశ్రమల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు వేసింది. లెదర్ అండ్ ఫుట్‌వేర్ పాలసీ (4.0)ని ప్రవేశపెట్టింది. మౌలిక సదుపాయాల్లో అంతరాలను తగ్గించడం, నూతన ఆవిష్కరణలు, సాంకేతికతను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ అనుకూల పరిశ్రమలుగా వీటిని తీర్చిదిద్దాలని నిర్ణయించింది. దేశీయ వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తోలు ఉత్పత్తులకు ప్రపంచస్థాయి డిమాండ్‌ను తీసుకురావడమే లక్ష్యంగా నూతన పాలసీని రూపొందించింది. తోలు పరిశ్రమ అభివృద్ధికి కేంద్రం కూడా ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తోలు పరిశ్రమలో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించనుంది. ఈ పాలసీ 5 సంవత్సరాలు (2025-30) లేదా కొత్త పాలసీ ప్రకటించేవరకు అమలులో ఉంటుంది. ఈ మేరకు మంగళవారం పరిశ్రమల శాఖ ఉత్తర్వులు ఇచ్చింది.

ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు ఇలా..

- కొత్త పరిశ్రమలకు మూలధన పెట్టుబడిలో 35 శాతం లేదా గరిష్ఠంగా రూ. 12 కోట్ల వరకు రాయితీ.
- లెదర్ పరిశ్రమల విస్తరణ, నూతన ఆవిష్కరణలు చేసే పరిశ్రమలకు టెక్నాలజీ అప్‌గ్రేడేషన్‌కు రూ.10 కోట్ల వరకు సబ్సిడీ.
- చర్మశుద్ధి కార్యకలాపాలకు విద్యుత్తు యూనిట్‌కు రూ.1.5 చొప్పున గరిష్ఠంగా రూ.20 లక్షలు, ఇతర కార్యాలయాలకు వినియోగించే విద్యుత్తుకు రూ.1 చొప్పున ఏడాదికి 15 లక్షల వరకు రీయింబర్స్.
- బ్రాండింగ్, మార్కెటింగ్‌తో ఎంఎస్ఎంఈ యూనిట్లు ట్రేడ్‌మార్క్‌లను పొందేలా ప్రోత్సహించడానికి, జీఎల్ ట్యాగ్‌లు, ప్రమోషన్ తదితర కార్యకలాపాలకు అయ్యే ఖర్చులో 25 శాతం చొప్పున 3 సంవత్సరాలపాటు రూ. కోటి వరకు పొందవచ్చు.
- ఐఎస్ఓ, ఐఎస్ఐ, బీఐఎస్, ఎఫ్‌పీవో, బీఈఈ, అగ్‌మార్క్, ఎకో మార్క్ వంటి ధ్రువపత్రాలు, ఇతర జాతీయ, అంతర్జాతీయ ధ్రువీకరణ పొందిన ప్రాజెక్టులకు అయ్యే ఖర్చులో 50 శాతం సబ్సిడీ.
- తోలు, పాదరక్షల తయారీలో స్థానిక కార్మికులు నైపుణ్యం పెంచుకోవడానికి, గుర్తించిన సంస్థల నుంచి శిక్షణ పొందే ఎంఎస్ఎంఈలకు శిక్షణ ఖర్చులో 50 శాతం రాయితీ.
- ఏపీఐఐసీ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.25 లక్షలకు పరిమితం చేసిన భూమి ఖర్చులో 75% తిరిగి చెల్లింపు.
- పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన భూమి కొనుగోలు, పరిశ్రమలకు స్టాంప్ డ్యూటీ వంద శాతం రీయింబర్స్‌మెంట్.

పెద్ద సంస్థలకు ఇవీ ప్రోత్సాహకాలు

- లెదర్ క్లస్టర్లలో రూ.125 కోట్ల నుంచి 500 కోట్ల వరకు పెట్టుబడులతో నెలకొల్పిన పెద్ద పరిశ్రమలకు మూలధన పెట్టుబడిలో 25 శాతం లేదా గరిష్ఠంగా రూ. 50 కోట్ల వరకు రాయితీ.
- సెమీ ప్రాసెస్డ్ లెదర్, వెట్ బ్లూస్ పరిశ్రమలకు మూలధన పెట్టుబడిలో 30 శాతం లేదా గరిష్ఠంగా రూ. 60 కోట్ల వరకు రాయితీ.
- ఎర్లీ బర్డ్ ఇన్సెంటివ్స్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఇంతకుముందే అమలులోకి తీసుకువచ్చిన ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 కింద మూలధన పెట్టుబడిలో 30 శాతం రాయితీ.
- రాష్ట్రంలో తయారు చేసి విక్రయించే తోలు ఉత్పత్తులకు చెల్లించాల్సిన అమ్మకం పన్ను (జీఎస్టీ) పూర్తిగా మినహాయింపు.

స్మార్ట్ స్టిక్స్.. నైట్ గన్స్.. పెప్పర్ స్ప్రేలు..

» చిరుత భయరహితంగా అలిపిరి నడకదారి

» అటవీ శాఖతో ఉమ్మడి కార్యాచరణకు టీటీడీ శ్రీకారం

తిరుమల, మే 27(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ స్టిక్స్, నైట్ గన్స్, పెప్పర్ స్ప్రేలు వంటి రక్షణ పరికరాల వినియోగంతో అలిపిరి నడక దారిని చిరుత భయరహిత ప్రాంతంగా మార్చాలని టీటీడీ నిర్ణయించింది. భక్తుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి మంగళవారం తిరుమలలోని గోకులం మందిరంలో టీటీడీ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈవో శ్యామలరావు వర్చువల్‌గా హాజరవగా.. అదనపు ఈవో వెంకయ్య చౌదరి వివిధ విభాగాల అధికారులతో చర్చించారు. ఇకపై టీటీడీ అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, విజిలెన్స్ శాఖలతో అటవీశాఖ సమన్వయం చేసుకుంటూ నిరంతరం జాయింట్ డ్రైవ్ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. భక్తులకు జంతు బెడద లేకుండా తక్షణం అలిపిరి కాలినడక మార్గంలో భద్రతా సిబ్బంది సంఖ్యను పెంచనున్నారు. కెమెరా ట్రాప్స్, స్మార్ట్ స్టిక్స్, నైట్ గన్స్‌ను వినియోగించాలని నిర్ణయించారు. బయోఫెన్సింగ్ ఏర్పాటు సూచనను ఆమోదించారు. నడకదారిలో హైఫ్లాష్ టార్చ్‌లతో పాటు పెప్పర్ స్ప్రేలను రక్షణపరికరాలుగా వినియోగించాలని నిర్ణయించారు. ఘాట్ రోడ్డులో ద్విచక్రవాహనాలను ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే అనుమతించాలని నిర్ణయించినట్టు తెలిసింది. నడకదారిలో 12ఏళ్లలోపు పిల్లలను ఉదయం 5నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే అనుమతించాలని భావిస్తున్నట్టు సమాచారం. త్వరలో వీటిపై నిర్ణయం తీసుకోనున్నారు. అలిపిరి మార్గంలో ఏడో మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు 2.5 కి.మీ. మేర పటిష్ఠ భద్రత తోపాటు, నిరంతర నిఘా ఉంచాలని నిర్ణయించారు.

భూ వివాదాల్లో పోలీసుల జోక్యం వద్దు: హైకోర్టు

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): సామరస్యపూర్వక పరిష్కారం పేరుతో పోలీసులు భూవివాదాల్లో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రీ లిటిగేషన్ కౌన్సిల్ ఫోరమ్ (పీఎల్‌సీఎఫ్) పేరుతో సివిల్ వివాదాలతో సంబంధం ఉన్న వ్యక్తులను విశాఖ పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. భూవివాదాల పరిష్కారం విషయంలో పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఉత్తర్వులు ఇచ్చారు.

దావా ఉపసంహరణకు ఒత్తిడి చేయవద్దు

దర్శి కోర్టులో తాను దాఖలు చేసిన దావాను ఉపసంహరించుకోవాలని ప్రకాశం జిల్లా ముండ్లమూరు పోలీసులు ఒత్తిడి చేస్తున్నారంటూ బసవపురానికి చెందిన కె.వెంకటరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు దావాను ఉపసంహరించుకోవాలని పిటిషనర్‌ను ఒత్తిడి చేయవద్దని పోలీసులను ఆదేశించింది.

వేబిల్లులో పేర్కొన్న వస్తువులే అయితే వాహనాన్ని వదిలేయాలి: టీ-హైకోర్టు

హైదరాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): ట్యాక్స్ ఇన్వాయిస్, వేబిల్లులో పేర్కొన్న వస్తువులనే రవాణా చేస్తుంటే అలాంటి వాహనాలను వదిలేయాలని తెలంగాణ హైకోర్టు తెలిపింది. అలా కాకుండా ఇతర స్వభావం ఉన్న వస్తువులు అయితే చర్యలు తీసుకోవచ్చని జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం పేర్కొంది. ట్యాక్స్ ఇన్వాయిస్, వేబిల్లుతో రవాణా చేస్తున్న సరుకుల లారీని పోలీసులు పట్టుకోవడంపై నరసరావుపేటకు చెందిన కనుమూరి సునందం హైకోర్టులో సవాల్ చేశారు.

తొలిరోజు 22.28 కోట్ల విరాళాలు

కడప, మే 27(ఆంధ్రజ్యోతి): కడప మహానాడులో తెలుగుదేశం పార్టీకి సోమవారం రూ.22.28 కోట్లు విరాళంగా వచ్చాయని పార్టీ అధినేత చంద్రబాబు చెప్పారు. విరాళాలు ఇచ్చిన వారి పేర్లను మహానాడు వేదికపై చంద్రబాబు చదివి వినిపించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.5కోట్లు, పి.నారాయణ రూ.కోటి, టీజీ భరత్ రూ.కోటి, సానా సతీశ్ రూ.1.16కోట్లు, ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రాజగోపాల్ రూ.50లక్షలు, లక్ష్మీ వెంకటేశ్వర మెటల్ ఇండస్ట్రీస్ రూ.50లక్షలు, దామచర్ల జనార్దన్ 25లక్షలు, వేమన సతీశ్ 25లక్షలు, రవీంద్ర 25లక్షలు ఇచ్చారన్నారు. మొత్తం రూ.22.53కోట్లు పార్టీకి విరాళంగా వచ్చాయన్నారు. విరాళాలు ఇవ్వాలనుకునేవారు 'తెలుగుదేశం పార్టీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, జూబ్లీహిల్స్ బ్రాంచి, అకౌంట్ నంబరు 18090200001238'కు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు.



చిత్తూరు పార్లమెంటులో చంద్రబాబు రిజిస్ట్రేషన్

మహానాడు వేదిక వద్ద ఉదయం 6 గంటలకే ప్రతినిధుల రిజిస్ట్రేషన్ మొదలైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఆయా పార్లమెంటు పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సీఎం చంద్రబాబు 10.35 గంటలకు చిత్తూరు పార్లమెంటు ప్రతినిధుల నమోదు కేంద్రంలో తన పేరు రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బండారు శ్రావణి, టీడీపీ నేత చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ కమిటీ, మండల కమిటీల నుంచి వచ్చిన ప్రతినిధులు ఆయా పార్లమెంటు కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషను చేయించుకున్నారు.

అధ్యక్షుడిగా 30 ఏళ్లు

నేడు మరోసారి టీడీపీ సారథిగా ఎన్నిక కానున్న చంద్రబాబు

టీడీపీ అధ్యక్షుడిగా చంద్రబాబు 30 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. 1995లో తొలిసారి పార్టీ పగ్గాలు చేపట్టిన ఆయన.. అప్పటినుంచీ కొనసాగుతున్నారు. టీడీపీ అధ్యక్ష ఎన్నిక ప్రతి రెండేళ్లకోసారి జరుగుతుంది. 2014 రాష్ట్ర విభజన వరకు పార్టీ అధ్యక్షుడిగా ఉన్న చంద్రబాబు.. ఆ తర్వాత జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ ఏడాదితో ఆయన అధ్యక్ష బాధ్యతలు స్వీకరించి 30ఏళ్లు పూర్తవుతాయి. ఈ ప్రస్థానంలో పార్టీ నిర్వహణలో ఆయన ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. చంద్రబాబు పార్టీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత 2004లో తొలిసారి టీడీపీ ఓటమిపాలైంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి టీడీపీ శ్రేణులు తీవ్ర అణచివేతను చవిచూశాయి. అన్నింటినీ ఎదుర్కొని 2009 ఎన్నికల బరిలో నిలిచిన టీడీపీని వరుసగా రెండోసారి ఓటమి పలుకరించింది. ఇక పార్టీ కోలుకోవడం కష్టమని అంతా భావించారు. రెండో విడత సీఎం అయిన వైఎస్ టీడీపీపై ఉక్కుపాదం మోపారు. 2014లో రాష్ట్ర విభజన జరగడంతో టీడీపీ అటు తెలంగాణ, ఇటు ఏపీలో నిలదొక్కుకునేందుకు చాలాశ్రమపడాల్సి వచ్చింది. అయితే చంద్రబాబుపై నమ్మకంతో 2014 ఎన్నికల్లో ఏపీ ప్రజలు ఆయన్ను గెలిపించడంతో కేడర్ ఊపిరి పీల్చుకుంది. అయితే 2019 ఎన్నికల్లో విజయం సాధించిన జగన్ రూపంలో మరోసారి ఉపద్రవం ముంచుకొచ్చింది. టీడీపీ నేతలు, కార్యకర్తలపై ఆయన తీవ్ర నిర్బంధం అమలు చేశారు. అవన్నీ ఎదుర్కొని 2024లో టీడీపీ మరోసారి సత్తా చాటింది. కడప మహానాడు వేదికగా చంద్రబాబు మరోసారి పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక అవుతున్న నేపథ్యంలో ఆయన శ్రమ, దీక్ష, పట్టుదలను శ్రేణులు గుర్తు చేసుకుంటున్నాయి.

చర్చలపై సర్వే..

తీర్మానాలపై చర్చల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్, ప్రతి నాయకుడి పని తీరును చూస్తున్నామని.. వాట్సాప్, ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే చేశామని చంద్రబాబు తన ప్రసంగంలో తెలిపారు. 'కార్యకర్తే అధినేత' కేటగిరీలో మంత్రి కొల్లు రవీంద్రకు 93 శాతం వచ్చిందన్నారు. 'యువగళం'పై చర్చలో మంత్రి టీజీ భరత్‌కు 76.92 శాతం.. యువగళం, యువత సంక్షేమంలో వెంకటరాజుకు 86 శాతం, వెంకట నరసింహకు 84శాతం, అప్పలనాయుడికి 81శాతం.. యువగళం తీర్మానంపై రవినాయుడికి 86%, వేణుగోపాల్, కేశవ్‌కు చెరో 85%, దుర్గాప్రసాద్‌కు 84%, రాధాకృష్ణ, శివకుమార్‌కు చెరో 83%, ఖాదర్‌బాషాకు 72% వచ్చినట్లు తెలిపారు. ఇంతకుముందు మాదిరి తాను రాత్రి 10 గంటల వరకు మీటింగ్‌లు పెట్టడం లేదని, టైం అంటే టైమేనని చెప్పారు.

- (మహానాడు ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

కార్యకర్తకు జై!

(మొదటి పేజీ తరువాయి)

పసుపు పండుగ మహానాడు మంగళవారం కడప శివార్లలో ప్రారంభమైంది. ఈ పండుగ ఇక్కడ జరుగడం ఇదే మొదటిసారి. ప్రాంగణంలోని ప్రతినిధుల నమోదు కౌంటర్‌లో చంద్రబాబు తన ఐడీ కార్డుతో పేరు నమోదు చేసుకుని వేదికను అధిరోహించారు.ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యాతగా మహానాడు ప్రతినిధుల సభ మొదలైంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అకృత్యాలకు అసువులు బాసిన కార్యకర్తలు, నాయకులతో పాటు పహల్గాం ఉగ్రదాడి మృతులకు, ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన వీర సైనికులకు సంతాపం ప్రకటించారు. వేదిక మీద 2నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం చంద్రబాబు సుదీర్ఘంగా ప్రసంగించారు. 1947లో దేశ ప్రజలకు స్వాతంత్ర్యం, స్వేచ్ఛ వచ్చాయని.. 2024లో వైసీపీని చిత్తుగా ఓడించిన తర్వాత రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్యం మరోసారి వచ్చిందని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

టీడీపీ బ్రాండ్ అంటే అదీ..!

ప్రజల జీవితాలను ప్రభావితం చేసిన ఏకైక పార్టీ టీడీపీ. అభివృద్ధి అంటే మన పార్టీ ఆవిర్భావానికి ముందు, తర్వాత అని చెప్పుకోవచ్చు. నాతో సహా అందరం రాజకీయ పాఠశాలలో నిత్య విద్యార్థులమే. నేను నిరంతరం పోరాటం చేసే సైనికుడిని. నా శక్తి, నా ఆయుధాలు మీరే. మీరు, నేను కలిస్తే ఆకాశమే హద్దుగా ఏ పనైనా చేయగలుగుతాం. పాజిటివ్ పాలిటిక్స్‌తో రాజకీయాల్లో విలువలు పెంచిన ఏకైక పార్టీ టీడీపీ. తెలుగు రాష్ట్రాల్లో ఏ పార్టీలో చూసినా టీడీపీ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులే ఉన్నారంటే అదీ టీడీపీ సత్తా. ఒక ప్రాంతీయ పార్టీగా కోటి సభ్యత్వాలను 45రోజుల్లో పూర్తి చేసిన ఏకైక పార్టీ టీడీపీ. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వాలు తీసుకున్న అనేక నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించింది. పార్టీ విధానాల్లో నూతనత్వాన్ని తీసుకొద్దాం. ఈ మహానాడులో అనేక నిర్ణయాలు చర్చించి భావి తరాల భవిష్యత్ కోసం రూపొందిస్తాం.

కడపలో క్లీన్‌స్వీప్ చేయాలి..

ఇన్నాళ్లూ రాయలసీమలో మహానాడు అంటే తిరుపతే గుర్తొచ్చేది. కానీ కడపలో తొలిసారి జరుగుతున్న ఈ మహానాడు చరిత్ర సృష్టించనుంది. ఇప్పటివరకు 34 పసుపు పండుగలు జరుపుకొన్నాం. గతంలో అవి నిర్వహించే సమయాల్లో ఎండ, వేడి ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు కడపలో చల్లటి వాతావరణంలో జరుగుతోంది. ఉమ్మడి కడపలో 10కి 7 అసెంబ్లీ స్థానాల్లో గెలిచి సత్తా చాటాం. ఈసారి 10కి 10 గెలిచి క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించాలి.

- సంక్షేమం, అభివృద్ధికి టీడీపీ ట్రెండ్ సెట్టర్. బడుగు బలహీన వర్గాలకు అధికారం చూపించిన పార్టీ టీడీపీ. బీసీలు అడిగే పరిస్థితి నుంచి శాసించే పరిస్థితికి తెచ్చిన పార్టీ టీడీపీ.
- టీడీపీ కూటమి పాలనతో ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. చీకటి తొలగి భవిష్యత్‌పై ఆశలు పెరిగాయి. తమ జీవితాలను బాగు చేస్తామని ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా పాలన సాగిస్తున్నాం.
- టీడీపీ విధానాలు, ఆలోచనలు దేశంలోని రాజకీయ పార్టీలకు బ్లూప్రింట్‌గా నిలిచాయి. ప్రజల వద్దకు పాలన, జవాబుదారీ వ్యవస్థను దేశానికి పరిచయం చేశాం. సామాజిక న్యాయం అనేది టీడీపీ తెచ్చిన అతిపెద్ద సామాజిక విప్లవం.

- చంద్రబాబు, టీడీపీ అధినేత

సూపర్ సిక్స్ అమలు చేసి తీరతాం

ఎవరెన్ని మాట్లాడినా సూపర్ సిక్స్ హామీలను అమలుచేసి తీరతాం. ఆ బాధ్యత మేం తీసుకుంటాం. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలను అమలు చేయనున్నాం. ఆగస్టు 10 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం. అనేక సాగునీటి ప్రాజెక్టులు చేపట్టి రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చాం. గత ఐదేళ్లలో ఇరిగేషన్‌కు ఒక్కపైసా ఖర్చు చేయలేదు. హంద్రీనీవాను ఈ ఏడాది పూర్తి చేసి చివరి ఎకరాకు నీళ్లిస్తాం. రాజకీయ అవినీతిని ప్రజలు పట్టించుకోరనేది నిజం కాదు. ఉమ్మడి రాష్ట్రంలో 'రాజా ఆఫ్ కరెప్షన్' అనే పేరుతో రూ.లక్షల కోట్ల అవినీతిపై టీడీపీ చేసిన పోరాటం నిజమని సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు తేల్చాయి. అదే మన విశ్వసనీయత. వాస్తవాలతో అవినీతిపై పోరాడిన పార్టీ టీడీపీ. హైదరాబాద్‌లో ఔటర్ రింగ్ రోడ్డు, వ్యాన్‌పిక్, ఇందూ, లేపాక్షి భూములపై పోరాడాం. ఓబుళాపురం అక్రమ మైనింగ్‌పై మనం చేసిన ఉద్యమం ఒక సంచలనం. మన ప్రతి పోరాట ఫలితం నేడు కళ్ల ముందు కనపడుతోంది. కూటమి అధికారంలోకి వచ్చాక విధ్వంస పాలకుల స్కాముల్ని లెక్కిస్తున్నాం. ఎవరు అవినీతి చేసినా వదిలిపెట్టం. రాజకీయాల్లో డబ్బులు పంచే అవసరం లేకుండా ప్రజలకు సేవ చేయాలి. డిజిటల్ కరెన్సీ పెట్టాలని ప్రధానికి నివేదిక ఇచ్చాను. దీనివల్ల అక్రమార్కులను తేలిగ్గా పట్టుకోవచ్చని చెప్పాను. పెద్ద నోట్లు రద్దు చేస్తేనే అవినీతి పోతుంది.

పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించి..

11 నెలల్లో 6 రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశాలు పెట్టి 76 ప్రాజెక్టులకు క్లియరెన్సు ఇచ్చాం. వీటివల్ల రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులు.. 4.57 లక్షల మందికి ఉద్యోగాలు వస్తున్నాయి. పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించి పెట్టుబడులు తెస్తున్నాం. ప్రపంచంలో తెలుగు జాతి నం-1గా ఉండేందుకు కృషి చేస్తా. కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లును పారిశ్రామికవాడలుగా తీర్చిదిద్దుతాం. రాష్ట్రంలో 5 రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్‌లను ప్రారంభిస్తున్నాం. విశాఖ, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురం కేంద్రాలుగా 5 జోన్లు పెట్టి కుటుంబానికో ఒక పారిశ్రామికవేత్తను ప్రమోట్ చేసేలా ముందుకెళ్తున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 78 ఏళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో.. రాబోయే 22 ఏళ్లలో అంతకంటే రెట్టింపు అభివృద్ధి జరిగే అవకాశముంది. విజన్-2047తో జీరో పావర్టీ సాధించి దేశానికి దశ-దిశను నిర్దేశిస్తాం. పీ-4 ద్వారా ఆర్థిక అసమానతలను తగ్గిస్తాం.



టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును డ్రైఫ్రూట్స్ గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం



కార్యకర్తే అధినేత!

కడప వేదికగా 'మహా'సంరంభం

తెలుగుదేశం పార్టీ అత్యున్నత వేడుక మహానాడు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. కడప జిల్లా సీకే దిన్నె మండలం పబ్బాపురంలో ఉదయం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రారంభోపన్యాసంతో తొలి రోజు కార్యక్రమం మొదలైంది. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా కార్యకర్తకు పెద్దపీట వేశారు. పార్టీ పటిష్టానికి ఆయన 'నా తెలుగు కుటుంబం' పేరుతో ఆరు శాసనాలను మొదటి రోజు మహానాడులో ప్రతిపాదించారు. వాటిలో 'కార్యకర్తే అధినేత' అనే ప్రతిపాదనపై తొలిచర్చ జరిగింది. చంద్రబాబు కూడా తన ప్రసంగంలో లోకేశ్ ప్రతిపాదించిన 6 శాసనాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఇవి రాష్ట్ర చరిత్రను మార్చబోతున్నాయన్నారు. 'ఈ మహానాడు వేదికగా చెబుతున్నా.. ప్రతి కార్యకర్త గర్వపడేలా పాలన అందిస్తాం. గ్రామాల్లో మీరు మీసం మెలేసేలా చేస్తాం. కార్యకర్తే పార్టీకి ప్రాణం.. ఆయుధం కూడా వారే. వారి త్యాగాలు వృథా కానివ్వం' అన్నారు.

వేదికపై కార్యకర్తల ప్రసంగాలు..

గతంలో ఏ మహానాడులో లేని విధంగా రాష్ట్రం నలుమూలల నుంచీ తరలివచ్చిన కార్యకర్తలకు వేదికపై ప్రసంగించే అవకాశం కల్పించారు. ముందుగా పాలకొల్లు నియోజకవర్గం క్లస్టర్ ఇన్‌చార్జి పిచ్చేటి వెంకటనర్సింహ మహానాడు వేదికపై నుంచి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో టీడీపీ కార్యకర్తలను ఎలా తీర్చిదిద్దుతున్నామో వివరించారు. అనంతరం మరికొందరు కార్యకర్తలు మాట్లాడారు. కాగా, మహానాడుకు రెండు రాష్ట్రాల నుంచీ టీడీపీ కార్యకర్తలు, నాయకులు వేల సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 23వేల మంది పార్టీ ప్రతినిధులకు అధికారికంగా ఆహ్వానాలు పంపారు. వీరంతా తొలిరోజు ప్రతినిధుల నమోదు కేంద్రం వద్ద నమోదు చేయించుకున్నారు. మరో 10 వేల పైచిలుకు కార్యకర్తలు తరలివచ్చారు. వీరందరితో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేశ్ ఫొటోలతో ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

వైసీపీ హయాంలో

1,030 మంది కార్యకర్తల మృతి: సోమిశెట్టి

కేశవ్ ప్రారంభోపన్యాసం తర్వాత టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడారు. వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 1,030 మంది టీడీపీ కార్యకర్తలు మృతిచెందారని వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ 2 నిమిషాలు మౌనం పాటించారు. 'ఆపరేషన్ సింధూర్'లో అసువులు బాసిన వీరజవాన్లకూ సంతాపం తెలుపుతూ నేతలు మౌనం పాటించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు. పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. చంద్రబాబు ఒక్కరే నామినేషన్ వేసే అవకాశముంది. బుధవారం సాయంత్రం ఫలితం ప్రకటిస్తారు. మహానాడు తొలి రోజు ఐదు అంశాలపై తీర్మానాలు చేశారు. అయితే ఇవన్నీ లోకేశ్ లోకేశ్ ప్రతిపాదించిన 'నా తెలుగు కుటుంబం'లోని 6 శాసనాల్లో భాగం కావడం గమనార్హం. కార్యకర్తే అధినేత, యువగళం, సామాజిక న్యాయం-పేదల ప్రగతి, స్త్రీశక్తి, అన్నదాతకు అండగా.. అన్న ఐదు అంశాలపై చర్చించి ఆమోదించారు. అలాగే ఈ శాసనాలను పార్టీ నియమావళిలో భాగం చేస్తూ నియమావళిలో సవరణలు చేశారు.

ముఖ్య నేతలతో బాబు భేటీ

తొలిరోజు మహానాడు ముగిసిన తర్వాత.. కార్యక్రమం జరిగిన తీరుపై పార్టీ ముఖ్యనేతలతో చంద్రబాబు సమీక్ష జరిపారు. మొదటి రోజు బాగా జరిగిందని ప్రశంసించారు. తొలి రోజు పార్టీకి రూ.22.28 కోట్ల విరాళాలు వచ్చాయని చంద్రబాబు ప్రకటించారు.

(మహానాడు ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

పక్కాగా సమయపాలన

మహానాడు తొలి రోజు నేతలంతా సమయపాలన పక్కాగా పాటించారు. ఉదయం 8.30కి ప్రతినిధుల నమోదు మొదలు.. వేదికపై నేతల ప్రసంగాలు.. చివరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సైతం నిర్దేశిత వ్యవధిలోనే ముగించారు. చివరిగా సాయంత్రం 6 గంటలకు తొలి రోజు కార్యక్రమాన్ని ముగించాల్సి ఉండగా 20 నిమిషాలు ఆలస్యమైంది. సభావేదికపై చంద్రబాబు దీనిని ప్రస్తావించారు. ఈ ఆలస్యానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కారణమని సరదాగా వ్యాఖ్యానించారు. రేపటి నుంచి ఆలస్యం కాకూడదని సూచించారు.

తొలిరోజు తీర్మానాలు

కడప, మే 27 (ఆంధ్రజ్యోతి): మహానాడులో తొలిరోజు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆరు శాసనాలను ప్రవేశపెట్టారు. భోజన విరామానికి ముందే వీటిని ప్రవేశపెట్టగా.. విరామం తర్వాత ఆ శాసనాలకు అనుబంధ తీర్మానాలను పార్టీ నాయకులు ప్రవేశపెట్టి బలపరిచారు. ఆయా తీర్మానాల వివరాలు...

- 'కార్యకర్తే అధినేత' తీర్మానాన్ని మంత్రి కొల్లు రవీంద్ర ప్రవేశపెట్టగా ఇదే తీర్మానంలో భాగంగా సంస్థాగత నిర్మాణం విషయంపై గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడారు. క్యాడర్ నుంచి ఎంపిక చేసిన పిచ్చేటి వెంకట నరసింహ, సాలూరు మండల పార్టీ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌నాయుడు ఈ తీర్మానాన్ని బలపరిచారు.
- 'కార్యకర్తల సంక్షేమం' తీర్మానాన్ని శాప్ చైర్మన్ రవినాయుడు ప్రవేశపెట్టగా, తిరుపతి రూరల్ ప్రెసిడెంట్ ఈశ్వర్‌రెడ్డి, మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన మండల ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ బలపరిచారు.
- 'పెట్టుబడులు- ఉపాధి అవకాశాలు' తీర్మానాన్ని మంత్రి టీజీ భరత్, 'యువత సంక్షేమం' అనే తీర్మానాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రవేశపెట్టారు. కడప జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, తెలంగాణ యువనేత జయరామ్ యువత సంక్షేమం తీర్మానాన్ని బలపరిచారు.
- 'ప్రజాపాలనలో సాంకేతిక విప్లవం' తీర్మానాన్ని ఎమ్మెల్యే రాధాకృష్ణ ప్రవేశపెట్టగా, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల నరసింహ బలపరిచారు.
- 'మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం' తీర్మానాన్ని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ప్రవేశపెట్టగా శ్రీకాళహస్తికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ శశి బలపరిచారు.
- 'పేదరికం లేని సమాజం-పీ4 సంకల్పం' తీర్మానాన్ని ఎన్ఆర్ఐ టీడీపీ ప్రెసిడెంట్ వేమూరి కుమార్ ప్రవేశపెట్టగా, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ బలపరిచారు.
- 'స్వర్ణాంధ్ర విజన్-2047 సాధన దిశగా ఆంధ్రప్రదేశ్' తీర్మానాన్ని బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ప్రవేశపెట్టారు.
- బీసీ సంక్షేమ తీర్మానాన్ని ఎమ్మెల్సీ, చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఎస్సీ సంక్షేమ తీర్మానాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎస్టీ సంక్షేమ తీర్మానాన్ని జీసీసీ కార్పొరేషన్ చైర్మన్ కిడారు శ్రావణ్, మైనార్టీ సంక్షేమ తీర్మానాన్ని ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్, క్రైస్తవ సంక్షేమ తీర్మానాన్ని స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దిరాల మేనీ, బ్రాహ్మణ సంక్షేమ తీర్మానాన్ని రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, వైశ్యుల సంక్షేమం తీర్మానాన్ని వైశ్యుల కార్పొరేషన్ చైర్మన్ రాకేశ్, కాపు సంక్షేమ తీర్మానాన్ని విశాఖపట్నం డీసీఎంఎస్ బాలాజీ, మహిళా శిశుసంక్షేమం-సాధికారత తీర్మానాన్ని మంత్రి సవిత ప్రవేశపెట్టగా మంత్రి సంధ్యారాణి, జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న బలపరిచారు. 'సాంకేతిక పరిజ్ఞానంతో లాభసాటి వ్యవసాయం' తీర్మానాన్ని మంత్రి అచ్చెన్న ప్రవేశపెట్టగా, మాజీ మంత్రి దేవినేని ఉమా బలపరిచారు.


'మహా'రుచులు

టీడీపీ ప్రతినిధులకు నోరూరించే రాయలసీమ వంటలు

తొలిరోజు 70 వేల మందికి భోజనాలు

కడప రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మహానాడులో రాయలసీమ రుచులతో చక్కటి వంటలను తయారు చేశారు. ఫేమస్ స్వీట్లతోపాటు రకరకాల వెజ్, ఎగ్, చికెన్, మటన్ ఐటమ్స్‌తో భోజనాలు ఏర్పాటు చేశారు. రాయలసీమ స్పెషల్ అట్రాక్షన్‌గా గోంగూర చికెన్ కూడా సిద్ధం చేశారు. 1500 మంది నిపుణులతో వంటలు చేయిస్తున్నారు. తొలిరోజు 50 నుంచి 70 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. వంటకాలను అంబికా క్యాటరింగ్ ఈవెంట్ ఆర్గనైజర్ కిరారు వెంకట శివాజీ చూస్తున్నారు. 2014 నుంచి ప్రతి మహానాడులోనూ ఈయనే వంటలు చేస్తున్నారు. కాగా, మహానాడుకు వచ్చినవారికి స్టేజి సభ్యుల (వీవీఐపీ) భోజన శాల, వీఐపీ భోజనశాల, మీడియా భోజనశాల, జనరల్ కేటగిరీ ఇలా నాలుగు రకాల భోజన శాలలు ఏర్పాటు చేశారు. తొలిరోజు జనరల్ కేటగిరీ భోజన శాలకు కార్యకర్తలు తరలివెళ్లి.. క్యూలైన్లలో బారులు తీరారు. దీంతో గందరగోళం చోటుచేసుకుంది. ప్లేట్లు చాలక.. సమయానికి భోజనం అందక కాసేపు కార్యకర్తలు అవస్థలు పడ్డారు.

ఆకట్టుకుంటున్న చంద్రబాబు, లోకేశ్ కటౌట్లు



మహానాడు సందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విజయవాడ వన్‌టౌన్‌లోని కెనాల్ రోడ్డులో ఏర్పాటు చేసిన కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ 45 అడుగుల కటౌట్లను ఏర్పాటు చేశారు.

- విజయవాడ,ఆంధ్రజ్యోతి

మహానాడు తొలిరోజు సైడ్ లైట్స్

- తొలిరోజు ప్రతినిధుల సభలో సీఎం చంద్రబాబు 11.53 గంటలకు 'జై తెలుగుదేశం, జై ఎన్టీఆర్' అంటూ ప్రసంగం ప్రారంభించి 12.40 గంటల వరకూ మాట్లాడారు.
- చంద్రబాబు ప్రసంగించే ముందు 'జై బాబు, జైజై బాబు' అంటూ జనం కేరింతలు కొట్టారు. 'చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు.
- చంద్రబాబు ప్రసంగించేటప్పుడు విజయవాడకు చెందిన మహిళా కార్యకర్త సత్య మాదల అరచేతిలో కర్పూరం పెట్టుకుని గ్యాలరీలో నుంచే హారతి ఇచ్చారు.
- టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్ 12.45 గంటలకు ప్రసంగం ప్రారంభించి 1.06 గంటలకు ముగించారు. లోకేశ్ ప్రసంగించేటప్పుడు 'జై లోకేశ్' అంటూ ప్రాంగణమంతా దద్దరిల్లేలా కార్యకర్తలు కేకలు వేశారు.
- మహానాడుకు 23వేల మంది ప్రతినిధులకు ఆహ్వానం పంపారు. ప్రతినిధులకు చిరుజల్లులు స్వాగతం పలికాయి.
- మహానాడులో తొలిరోజు వార్షిక నివేదికను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ప్రవేశపెట్టారు.
- మహానాడు ప్రాంగణాన్ని అరటి మట్టలతో పండుగ వాతావరణం తలపించే విధంగా ముస్తాబు చేశారు.
- ఎన్ఆర్ఐ టీడీపీ, మన టీడీపీ, హెల్ప్‌లైన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.



రాష్ట్ర పండుగగా ఎన్టీఆర్ జయంతి

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ విజయానంద్

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా మే 28ని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎస్ విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'సీఎంగా సామాజిక న్యాయం, వికేంద్రీకరణ, ప్రజాకేంద్రీకృత పరిపాలన ఆధారంగా సంస్కరణలను ప్రవేశపెట్టారు. సంక్షేమ పథకాలకు మార్గదర్శకత్వం వహించారు. తెలుగు భాష, సంస్కృతి కేవలం వారసత్వంగా కాకుండా తెలుగు ప్రజల సమిష్టి విధికి పునాదిగా చూడాలని తరతరాలను ప్రేరేపించారు. రాష్ట్రంలో ప్రతి ఏటా ఎన్టీఆర్ జన్మదినోత్సవాన్ని గౌరవప్రదంగా జరపుకోవడం ద్వారా ఆయన జ్ఞాపకాలకు తగిన గౌరవాన్ని ఇవ్వడం అవసరమని ప్రభుత్వం భావిస్తుంది. అలాంటి మాహానుభావుడి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించింది. అధికారులందరూ ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలి' అని పేర్కొన్నారు.



ప్రత్యేక ఆకర్షణగా లోకేశ్

మహానాడులో మంత్రి లోకేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన్ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తారని చర్చ నడుస్తోంది. సభాధ్యక్షత వహించిన మంత్రి పయ్యావుల కేశవ్ మాటలను బట్టి చూస్తే లోకేశ్ పార్టీలో ప్రమోట్ కావడం ఖాయంగా కనిపిస్తోంది. లోకేశ్, చంద్రబాబు పలుమార్లు సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, లోకేశ్ మాట్లాడుకున్నారు.



కడప మహానాడు చరిత్రలో నిలిచిపోతుంది: పల్లా



'నేను గతంలో కార్యకర్తగా మహానాడుకు హాజరయ్యాను. ఇప్పుడు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా హాజరుకావడం మరిచిపోలేని రోజు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉంటే ఉన్నత స్థాయికి వెళ్లవచ్చు. కడప మహానాడు చరిత్రలో నిలిచిపోతుంది. రాష్ట్ర దశ, దిశను మార్చే నిర్ణయాలు తీసుకోనున్నాం. టీడీపీలో బడుగు, బలహీనవర్గాలకు సముచిత స్థానం ఉంటుంది. లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుంది.'

9.40లక్షల కోట్ల పెట్టుబడులు: టీజీ భరత్

'టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రానికి రూ.9.40కోట్ల పెట్టుబడులు తెచ్చాం. వైసీపీ హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటేనే పారిశ్రామికవేత్తలు భయపడేవారు. యువతకు ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వనున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చంద్రబాబు ప్రత్యేకత. యువనేత లోకేశ్ ప్రవేశపెట్టిన ఆరు శాసనాలు రాష్ట్రానికి మంచి దిశానిర్దేశాన్ని ఇస్తాయి.'

గొంతుపై కత్తిపెట్టినా : మంత్రి కొల్లు రవీంద్ర



'గొంతుపై కత్తిపెట్టి బెదిరించినా భయపడకుండా 'జై చంద్రబాబు-జై తెలుగుదేశం' అన్న బలమైన కార్యకర్తలు టీడీపీకి ఉన్నారు. కోటి మంది సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ టీడీపీ. అధికారంలోకి రాగానే చంద్రన్న బీమాను రూ.2 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాం. చంద్రబాబుకు పార్టీ కార్యకర్తలు ఎల్లవేళలా అండగా ఉంటారు'

మన ప్రత్యర్థి జిత్తులమారి నక్క: వర్ల రామయ్య



'మన ప్రత్యర్థి జిత్తులమారి నక్క. కులం, మతం, ప్రాంతాల విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తారు. మనమంతా జాగ్రత్తగా ఉండాలి. గత ప్రభుత్వంలో నిరంకుశ పాలన సాగింది. చంద్రబాబును అరెస్టు చేసి 52 రోజులు జైల్లో పెట్టారు. ప్రజావ్యతిరేక పాలన సాగుతుండటంతో జగన్ తలరాతనే జనం మార్చివేశారు. గత ఏడాదిగా రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోంది.'

టీడీపీతోనే మహిళా సాధికారత

టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని మంత్రి సవిత తెలిపారు. డ్వాక్రా సంఘాలు, వెలుగు, దీపం పథకాలను తెచ్చింది చంద్రబాబే అన్నారు. ఆడబిడ్డలకు ఆస్తిలో వాటా, రిజర్వేషన్లు కల్పించింది ఎన్టీఆర్, చంద్రబాబులే అన్నారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ స్త్రీలను అగౌరవంగా, హేళనగా చూసి ఇబ్బందులు పెట్టడంతోనే వైసీపీకి పుట్టగతులు లేకుండాపోయాయని అన్నారు.



మహానాడు వేదికపై టీడీపీ నాయకులు

ఆరు శాసనాలు

తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం మహానాడులో లోకేశ్ ప్రతిపాదన

(మహానాడు ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

మారుతున్న కాలానికి, అవసరాలకు, ఆలోచనా విధానానికి అనుగుణంగా ప్రజలకు, పార్టీకి, కార్యకర్తలకు మంచి భవిష్యత్తు అందించాలన్న లక్ష్యంతో సరికొత్త నినాదాన్ని రూపొందించామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇందుకోసం మహానాడులో ఆరు శాసనాలను ప్రతిపాదించారు. కడప మహానాడు వేదికపై తొలిరోజు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రతినిధులనుద్దేశించి ఆయన మాట్లాడారు. 'ఎన్టీఆర్ పార్టీ పెట్టిన ముహూర్తబలం గొప్పది. కుల, మత, ప్రాంతీయ అజెండాలతో ఎన్నో పార్టీలు పుట్టినా తెలుగు జాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ మన టీడీపీ. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ కూడా అడుగులు వేయాలి. ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. పార్టీని మరో 40ఏళ్లు నడిపించడానికి కీలక నిర్ణయాలపై చర్చించాలి. ఎన్టీఆర్ హయాంలో ఆత్మాభిమానం నినాదం నియంతృత్వాన్ని తరిమేసింది. చంద్రబాబు హయాంలో ఆత్మవిశ్వాసం అనే నినాదంతో తెలుగు ప్రజల భవిష్యత్తుకు పునాది పడింది. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ.. ప్రజలకు, పార్టీకి, కార్యకర్తలకు మంచి భవిష్యత్తును అందించే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాల్సిన సమయం వచ్చింది. దీనికోసం 'తెలుగుజాతి విశ్వఖ్యాతి, యువగళం, స్త్రీశక్తి, పేదల సేవలో సోషల్ రీఇంజనీరింగ్, అన్నదాతకు అండగా, కార్యకర్తలే అధినేత' అనే ఆరు శాసనాలను ప్రతిపాదిస్తున్నాను. ఈరోజు మేమంతా ఈవేదిక మీద ఉన్నామంటే దానికి కారణం టీడీపీ కార్యకర్త చెమట చుక్కలే. కార్యకర్తలు.. నాయకుల చుట్టూ కాకుండా ప్రజల చుట్టూ తిరగండి. టీడీపీ మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది. ఏ ప్రాంతీయ పార్టీకి లేనివిధంగా కోటి మంది సభ్యత్వం టీడీపీకే సొంతం. కార్యకర్తలను ఆదుకునేందుకు, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఈ ఆరు శాసనాలు కీలకమైనవి. ఇవి చెప్పిన మార్గాన్నే మనం ఎంచుకోవాలి. నేను ప్రతిపాదిస్తున్నాను. మీరు బలపరచండి' అని లోకేశ్ కోరారు.



ఇవీ శాసనాలు

తెలుగుజాతి విశ్వఖ్యాతి

తెలుగువారికి టీడీపీ వల్ల ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఎన్టీఆర్‌ను బర్తరఫ్ చేస్తే ఢిల్లీలో మెడలు వంచి తిరిగి సీఎం అయ్యారు. అదే తెలుగు జాతి పౌరుషం. తెలుగువారిని ప్రపంచ పటంలో పెట్టింది మన చంద్రన్న. అన్ని రంగాల్లో మన తెలుగు వారు ముందుండాలి. దీనిని అజెండాగా పెట్టుకుని మనమంతా పనిచేయాలి.

యువగళం

పార్టీలో యువతకు పెద్దపీట వేస్తున్నాం. కూటమిలో 164 మంది ఎమ్మెల్యేల్లో 88 మంది తొలిసారి గెలిచినవారే. కేబినెట్‌లో 25 మందిలో 17 మంది తొలిసారి మంత్రులుగా నియమితులయ్యారు. గతంలో ప్రముఖ పరిశ్రమలను తరిమేస్తే.. కూటమి వచ్చాక అనేక పరిశ్రమలను తీసుకొచ్చాం. మెగా డీఎస్సీ ద్వారా వచ్చే నెలలోగా 16 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. రాష్ట్రంలో బలమైన యువశక్తి ఉంది. వారికి సరైన అవకాశాలిస్తే దూసుకుపోతారు. అన్ని రంగాల్లో ఉపాధి కల్పించడమే మన లక్ష్యంగా పెట్టుకుంటున్నాం.

స్త్రీ శక్తి

ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది మన చంద్రన్న. గత ప్రభుత్వంలో అసెంబ్లీ సాక్షిగా తల్లుల్ని అవమానించారు. సొంత తల్లిని, చెల్లిని మెడ పట్టి బయటికి గెంటేశారు. ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్, యూనివర్సిటీ ఇచ్చింది టీడీపీ. రానున్న రోజుల్లో మహిళల్ని మరింత బలోపేతం చేస్తాం. పార్టీ పదవుల్లో సమాన బాధ్యత, భద్రత కల్పించాలి.

పేదల సేవలో- సోషల్ రీఇంజనీరింగ్

పేదరికం లేని సమాజం టీడీపీ లక్ష్యం. రూ.2కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కాగృహాలు, పెన్షన్ ఇచ్చింది అన్న ఎన్టీఆర్. ప్రస్తుతం దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా రూ.4 వేల పెన్షన్‌ను చంద్రన్న ఇస్తున్నారు. డ్వాక్రా, దీపం, అన్నక్యాంటీన్ ఇచ్చింది మన చంద్రన్నే. వచ్చే నెలలో తల్లికి వందనం, ఆగస్టులో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నాం. బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక రాజకీయ స్వాతంత్ర్యం వచ్చింది టీడీపీతోనే. ప్రతి వర్గానికీ న్యాయం చేసేందుకు సోషల్ రీఇంజనీరింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

అన్నదాతకు అండగా..

రైతులు లేకుంటే సమాజమే లేదనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మే పార్టీ టీడీపీ. అన్న ఎన్టీఆర్ నుంచి చంద్రన్న వరకు రైతుల జీవితాలను మార్చేందుకు కృషి చేశారు. డ్రిప్ ఇరిగేషన్ నుంచి ఇరిగేషన్ ప్రాజెక్టుల వరకు, సబ్సిడీలు, హార్టికల్చర్‌ను ప్రోత్సహించింది టీడీపీనే. అన్నదాతకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుంది. పొగాకు, మిరప ధరలు పడిపోతే ఏకంగా గిట్టుబాటు ధర ప్రకటించిన నాయకుడు చంద్రన్న. బంగారం పండించే శక్తి మన రైతుల వద్ద ఉంది. అందుకే అన్నదాతకు అండగా అనే విధానాన్ని అమలు చేయాలి.

కార్యకర్తే అధినేత

ఇది నా మనసుకు దగ్గరగా ఉండేది. అంజిరెడ్డి తాత, మంజుల, తోట చంద్రయ్య నాకు స్ఫూర్తి. ఆనాడు పుంగనూరు స్థానిక సంస్థల ఎన్నికల్లో అంజిరెడ్డిని నామినేషన్ వేయకుండా అడ్డుకుంటే తొడగొట్టి, మీసం మెలేసి ఎదురు తిరిగాడు. రిగ్గింగ్ జరుగుతుందని తెలిసి బూత్‌లోకి వెళ్లింది మంజుల. దాడి చేస్తే రక్తం కారినా భయపడలేదు. చివరి ఓటు పడే వరకు, ఈవీఎం బాక్సుకు తాళం వేసే వరకు నిలబడింది. చంద్రయ్య గురించి ఎంత చెప్పినా తక్కువే. నడివీధిలో నాటి పాలకులు తరిమి కొట్టారు. ఏకంగా కత్తిని గొంతుకు పెట్టారు. ఒక్కసారి వాళ్ల నాయకుడికి జై చెప్పమంటే.. జై టీడీపీ జై చంద్రబాబు అని ప్రాణాలు పోగొట్టుకున్నాడు తోట చంద్రయ్య. రాష్ట్రంలో ఎప్పుడూ జరగని విధంగా ఆయన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చాం. అందుకే టీడీపీలో కార్యకర్తే అధినేత.

మహానాడు ఒక చారిత్రక రాజకీయ వేడుక

చర్చకు పెట్టిన ఆరు అంశాలు ప్రశంసనీయం

ఎక్స్‌లో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): 'మహానాడు అన్న పదం విన్నా, చదివినా వెంటనే గుర్తుకు వచ్చేది తెలుగుదేశం పార్టీనే. అంతలా తెలుగువారి గుండెల్లో స్థిరపడిపోయింది' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'కడపలో అంగరంగ వైభవంగా మహానాడు చారిత్రక రాజకీయ పండుగ ప్రారంభమైన శుభవేళ నా పక్షాన, జనసేన పక్షాన టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులుగా సేవలు అందిస్తున్న పల్లా శ్రీనివాస్, బక్కని నరసింహులుకు శుభాభినందనలు. ఈ మూడు రోజుల వేడుకలో చర్చించనున్న ఆరు అంశాలు ప్రశంసనీయంగా ఉన్నాయి. కార్యకర్తే అధినేత, యువగళం, స్త్రీ శక్తి, సామాజిక న్యాయం, పేదల ప్రగతి, అన్నదాతకు అండ వంటి అంశాలపై చర్చించి తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించడం అభినందనీయం. ఈ వేడుక విజయవంతంగా జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.





మహానాడు ప్రారంభంలో కొమ్ముబూర ఊది సందడి చేస్తున్న కళాకారులు



వ్యవసాయంలో సాంకేతికతతో సత్ఫలితాలు

- మంత్రి అచ్చెన్న, దేవినేని ఉమా

వ్యవసాయానికి సాంకేతికతను అనుసంధానం చేస్తే సత్ఫలితాలు వస్తాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. మహానాడులో మంత్రి లోకేశ్ ప్రవేశపెట్టిన ఆరు శాసనాలలో వ్యవసాయ సాంకేతికత అంశంపై అచ్చెన్నాయుడు మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు సాంకేతికతను జోడించాల్సిన అవసరం ఉందన్నారు. గత ఐదేళ్లలో వ్యవసాయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.1600 కోట్లు అప్పులు చెల్లించామన్నారు. ఈ ఏడాది కాలంలో రైతులు పండించిన ప్రతి పంట, ప్రతి గింజ కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతులకు డబ్బులు చెల్లించామన్నారు. మిర్చి, పొగాకు రైతులకు మద్దతు ధరకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ ప్రాంతాన్ని మార్చాలన్నదే లక్ష్యమన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం, సాగునీరు రెండూ ఎంతో ప్రాధాన్యం కలిగిన అంశాలని, వీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గోదావరి జలాలను మళ్లించి ప్రతి ఎకరాకు నీరు అందించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

నిరూపిస్తే రాజీనామా!

(మొదటి పేజీ తరువాయి)

ఉర్సాపై జగన్ చేసిన ఆరోపణలపై లోకేశ్ స్పందించారు. ఉర్సాకు 99 పైసలకు భూములు కేటాయించలేదని స్పష్టం చేశారు. విశాఖలో టీసీఎస్‌కు ఎకరా 99 పైసలకు కేటాయించిన మాట వాస్తవమని, విశాఖలో 5లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా ఐటీ సంస్థలకు భూకేటాయింపులు జరుపుతున్నామని, ప్రపంచంలో టాప్-100 ఐటీ కంపెనీలు విశాఖలో తమ సంస్థల స్థాపనకు ముందుకొస్తే వాటికి 99 పైసలకే భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో చేస్తోందన్నారు. ఇకపై రాష్ట్రానికి పరిశ్రమలు రావడం ఉంటుందే తప్ప గత ప్రభుత్వంలో మాదిరి పోవడం ఉండదన్నారు. జగన్‌ను అరెస్టు చేస్తారన్న ప్రచారంపై స్పందిస్తూ.. అది తనకు తెలియదని హోం మంత్రి, ముఖ్యమంత్రిని అడగాలన్నారు.

చంద్రబాబు నాయకత్వంలో...

ముఖ్యమంత్రి పదవికి అంత తొందరేముందని లోకేశ్ ప్రశ్నించారు. తదుపరి సీఎం మీరేనా? అన్న మీడియా ప్రశ్నకు ఆయనపై విధంగా స్పందించారు. తాను ఏనాడూ పదవులు అడగలేదన్నారు. చంద్రబాబు యంగ్ అండ్ డైనమిక్ నాయకుడని, ఆయన వయసు ఎక్కువ కానీ ఆలోచనలు యూత్‌ఫుల్‌గా ఉంటాయన్నారు. ఆయన నాయకత్వంలో ముందుకు వెళ్లడమే తమకు ఆనందంగా ఉందన్నారు. 'దేశానికి మోదీ, రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం చాలా అవసరం. చంద్రబాబులా నేను యోగా చేయలేను. నేను, అచ్చెన్నాయుడు శవాసనం వేసి హాయిగా నిద్రపోతాం. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో చేస్తా. పార్టీ కోసం కష్టపడిన వారందరికీ పదవులు వస్తాయి. అందరికీ ఒకేసారి న్యాయం చేయలేం. పదవులు రాలేదని నాయకులు అలగడం మానాలి' అని అన్నారు. రాబోయే ఐదు దశాబ్దాలు పార్టీ భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టామని లోకేశ్ వివరించారు. అందులో భాగంగానే నా తెలుగు కుటుంబం పేరుతో 6 శాసనాలు తీసుకొచ్చామని తెలిపారు. 'పార్టీలో నేను ఒక భాగమే తప్ప నేనే పార్టీ కాదు. క్షేత్రస్థాయిలో పార్టీలో ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు మండల స్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకు వర్కింగ్ గ్రూపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రధానితో భేటీ సమయంలో ఈ ఆలోచన చెప్పారు. దాన్నే మేం ఇక్కడ అమలు చేస్తున్నాం. సుమారు 20 ప్రశ్నలకు మోదీ నుంచి సమాధానాలు రాబట్టాను. ఆయన ఎంతో ఓపిగ్గా తండ్రిలా అన్నింటికీ సమాధానం ఇచ్చారు. ప్రధాని నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది' అని లోకేశ్ పేర్కొన్నారు. 'అధికారంలో ఉన్నామని కాలర్ ఎగరేయకుండా ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తున్నాం. జూన్ 12లోగా అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తాం. పార్టీలో సీనియర్లకు తగిన గౌరవం ఉంటుంది. యువగళం పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం. గత ప్రభుత్వం పరిశ్రమలను తరిమేసింది. ఏపీ బ్రాండ్‌ను నాశనం చేసింది. మేము తిరిగి దాన్ని పునరుద్ధరించే పనిలో ఉన్నాం. నేను విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత ఒక్క పాఠశాల కూడా మూతపడలేదు. దేశంలో ఎక్కడా లేని విధంగా 9,800 పాఠశాలలలో వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని తీసుకొస్తున్నాం' అని లోకేశ్ చెప్పారు.

నా తల్లి ఆవేదనను కళ్లారా చూశా

'మహిళలను గౌరవించాలి. ముందు రాజకీయ నాయకులు తమ భాషను మార్చుకోవాలి. వైసీపీ ప్రభుత్వంలో మహిళలను ప్రతిరోజూ కించపరుస్తూ వచ్చారు. నా కన్నతల్లితో పాటు హోంమంత్రి అనిత కూడా వైసీపీ బాధితుల జాబితాలో ఉన్నారు. ఆ సమయంలో నా తల్లి ఆవేదనను కళ్లారా చూశాను. జగన్ కుటుంబంలో ఎవరినీ మా నేతలు ఒక్క మాట కూడా అనడం లేదు. మావాళ్లు ఎవరైనా మహిళల పట్ల తప్పుగా మాట్లాడితే ఉపేక్షించం' అని లోకేశ్ అన్నారు. రెడ్ బుక్ పేరు చెబితే గతంలో తప్పులు చేసిన వారు చాలామంది భయపడుతున్నారన్నారు. కొంతమంది అడవుల్లోకి పోతుంటే, మరి కొంతమంది బాత్‌రూమ్‌ల్లో జారిపడుతున్నారన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

